www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 31-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 62 | వరంగల్
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా.8.16 తదుపరి షష్ఠి; నక్షత్రం: పుష్యమి రా.9.07 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శేషం ఉ.6.56; దుర్ముహూర్తం: ఉ.5.43-7.27; అమృతఘడియలు: మ.2.48-4.23; రాహుకాలం: ఉ.9.00-ఉ.10.30; సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.42
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

వరంగల్ ● శనివారం 31 మే 2025

మార్కెట్ మళ్లీ నష్టాల్లోకి

ముంబై: స్టాక్‌మార్కెట్ వారాంతం రోజున మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలను అమెరికా అప్పీల్ కోర్టు పాక్షికంగా పునరుద్ధరించడంతో మరోసారి వాణిజ్య అస్థిరతలు ఏర్పడడం, ఐటీ షేర్లలో నష్టాలు మార్కెట్‌ను పతన బాటలోకి నడిపాయి. జీడీపీ గణాంకాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తం కావడం కూడా ఇందుకు కారణమని విశ్లేషకులంటున్నారు. శుక్రవారం పూర్తిగా ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 182.01 పాయింట్లు నష్టపోయి 81,451.01 వద్ద ముగియగా నిఫ్టీ 82.90 పాయింట్ల నష్టంతో 24,750.70 వద్ద క్లోజైంది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 270.07 పాయింట్లు, నిఫ్టీ 102.45 పాయింట్లు నష్టపోయాయి.

అర్షద్ వార్సిపై సెబీ నిషేధం: సాధనా బ్రాడ్‌కాస్ట్ షేర్లను కొనుగోలు చేయాలంటూ యూట్యూబ్‌లో ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించే వీడియోలు పోస్ట్ చేసినందుకు బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సి, ఆయన భార్య మరియా గొరెట్టి, మరో 57 సంస్థలను సెక్యూరిటీ మార్కెట్ నుంచి 1 నుంచి 5 సంవత్సరాల పాటు సెబీ నిషేధించింది. దీనికి తోడు వార్సి, మరియాలపై ఒక్కొక్కరికి రూ.5 లక్షల జరిమానా విధించింది. మిగతా 57 సంస్థలపై రూ.5 లక్షల నుంచి రూ.5 కోట్ల మధ్యలో జరిమానా విధించింది. ఈ లావాదేవీ ద్వారా అక్రమంగా ఆర్జించిన రూ.58.01 కోట్లు 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని వార్సి, మరియాలతో పాటు 57 సంస్థలను కూడా ఆదేశించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,310 ▲	89,200 ▲	1,10,900 ▼
విజయవాడ	98,300 ▲	92,000 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	98,340 ▼	89,200 ▲	1,10,900 ▼
రాజమండ్రి	97,310 ▲	89,200 ▲	99,900 ▼
ప్రొద్దుటూరు	95,600 ▲	87,950 ▲	98,700 ▼
ముంబై	95,355 ▲	87,345 ▼	97,458 ▼

2024-25 జీడీపీ వృద్ధి 6.5%



క్యూ4లో 7.4 శాతంగా నమోదు ● రూ.330 లక్షల కోట్లకు ఎకానమీ

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో జీడీపీ వృద్ధి రేటు మార్కెట్ అంచనాలను మించి ఏడాది గరిష్ఠ స్థాయి 7.4 శాతానికి పెరిగింది. ప్రైవేట్ వినియోగం పుంజుకోవడంతో పాటు నిర్మాణం, తయారీ రంగాలు మంచి పనితీరును కనబర్చడం ఇందుకు దోహదపడింది. క్యూ4 వృద్ధి దన్నుతో 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి, 2023-24 వృద్ధి రేటు 9.2 శాతంతో పోలిస్తే బాగా తగ్గిన ప్పటికీ, ఈ ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం అంచనా వేసిన స్థాయిలోనే ఉంది. అంతేకాదు, చైనాతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉంది. ఈ జనవరి-మార్చిలో చైనా జీడీపీ వృద్ధి 5.4 శాతమే. వార్షిక, త్రైమాసిక వృద్ధిపరంగా ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. వరుసగా నాలుగేళ్లుగా భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో కెల్లా అధిక వృద్ధిని నమోదు చేస్తోంది.

ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.330.68 లక్షల కోట్లకు (3.9 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. తద్వారా ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో 6.3-6.8 శాతం వృద్ధి రేటుతో భారత్ జపాన్‌ను అధిగవించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశాలున్నాయి. మరికొన్నేళ్లలో భారత ఎకానమీ సైజు 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా.

త్రైమాసికాల వారీగా జీడీపీ వృద్ధి (%)	
ఏప్రిల్-జూన్ (క్యూ1)	6.5
జూలై-సెప్టెంబరు (క్యూ2)	5.6
అక్టోబరు-డిసెంబరు (క్యూ3)	6.4
జనవరి-మార్చి (క్యూ4)	7.4
2024-25 ఆర్థిక సంవత్సరం	6.5

వృద్ధి గణాంకాలు ఇలా..

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ లేదా స్థిర (2011-12 నాటి) ధరల ఆధారిత జీడీపీ రూ.187.97 లక్షల కోట్లకు పెరిగిందని అంచనా. 2023-24లో నమోదైన రూ.176.51 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 6.5 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, 2024-25లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ రూ.330.68 లక్షల కోట్లకు ఎగబాకింది. 2023-24లో నమోదైన రూ.301.23 లక్షల కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 9.8 శాతం వృద్ధి చెందింది. 2024-25 క్యూ4 విషయానికొస్తే, వాస్తవ జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ వార్షిక ప్రాతిపదికన 7.4 శాతం వృద్ధితో రూ.51.35 లక్షల కోట్లకు చేరగా.. నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ 10.8 శాతం వృద్ధితో రూ.88.18 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీవీఏ (జోడించిన స్థూల విలువ)ను ఎన్ఎస్ఓ రూ.171.87 లక్షల కోట్లుగా అంచనా వేసింది. 2023-24లో ఈ అంచనా రూ.161.51 లక్షల కోట్లుగా ఉంది.

2024-25 నామినల్ జీవీఏను రూ.300.22 లక్షల కోట్లుగా అంచనా వేసింది. 2023-24లో ఇది రూ.274.13 లక్షల కోట్లుగా ఉంది. కాగా, ఈ జూన్‌తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (క్యూ1) జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్ఓ ఈ ఆగస్టు 29న విడుదల చేయనుంది.

తలసరి ఆదాయం రూ.1,14,710

నికర జాతీయ ఆదాయం ప్రకారంగా, గత ఆర్థిక సంవత్సరంలో దేశ ప్రజల తలసరి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం పెరిగి రూ.1,14,710కి చేరింది. 2023-24లో ఇది రూ.1,08,786గా ఉంది. కాగా, 2024-25లో నికర జాతీయ ఆదాయం రూ.1,61,51,199 కోట్లుగా నమోదైంది.

4.8% లక్ష్యం మేరకు ద్రవ్య లోటు కట్టడి

గత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 4.8 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం సాధించింది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. 2024-25 ద్రవ్య లోటు రూ.15,77,270 కోట్లుగా నమోదైంది. ఈ ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంచనా వేసిన రూ.15,69,527 కోట్లకు దరిదాపుల్లోనే ఉంది. గత ఆర్థిక సంవత్సరం కేంద్రానికి రూ.30.36 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని, బడ్జెట్ అంచనాల్లో ఇది 98.3 శాతమని సీజీఏ తెలిపింది. వ్యయాలు రూ.46.55 లక్షల కోట్లకు పెరిగాయని, బడ్జెట్ అంచనాల్లో ఇది 98.7 శాతమని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జీడీపీలో 5.63 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఆదాయం, వ్యయాల మధ్య అంతరాన్ని ద్రవ్య లోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాల సమీకరణ ద్వారా ప్రభుత్వం ఈ లోటును భర్తీ చేస్తుంది.

రంగాలవారీగా వాస్తవ స్థూల విలువ జోడింపు(%)

రంగం	పూర్తి ఆర్థిక సంవత్సరం 2024-25	పూర్తి ఆర్థిక సంవత్సరం 2023-24	నాలుగో త్రైమాసికం 2024-25	నాలుగో త్రైమాసికం 2023-24
వ్యవసాయ సంబంధిత రంగాలు	4.6	2.7	5.4	0.9
మైనింగ్ అండ్ క్వారీయింగ్	2.7	3.2	2.5	0.8
మాన్యుఫ్యాక్చరింగ్	4.5	12.3	4.8	11.3
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	5.9	8.6	5.4	8.8
నిర్మాణం	9.4	10.4	10.8	8.7
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	6.1	7.5	6.0	6.2
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	7.2	10.3	7.8	9.0
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	8.9	8.8	8.7	8.7

ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలో కెల్లా భారత్ అధిక వృద్ధిని నమోదు చేయడం వరుసగా ఇది నాలుగో ఏడాది. తయారీ, సేవలు, వ్యవసాయ రంగాల పనితీరు ఇందుకు తోడ్పడింది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో తయారీ రంగం పనితీరు బాగుంది. దాంతో ఆ త్రైమాసిక జీడీపీ కూడా 7.4 శాతానికి ఎగబాకింది. ఈ సందర్భంగా చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు ధన్యవాదాలు తెలుపుతున్నా.

-నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

నాలుగేళ్లలో రూ.8,000 కోట్ల పెట్టుబడులు

- క్యూ4 లాభం రూ.390 కోట్లు
- ఒక్కో షేరుకు రూ.10 తుది డివిడెండ్
- అపోలో హాస్పిటల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్.. వచ్చే మూడు నుంచి నాలుగేళ్ల కాలంలో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడులతో దేశవ్యాప్తంగా కొత్తగా 4,300 పడకలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. కొత్త హాస్పిటల్స్ ఏర్పాటు సహా ప్రస్తుత హాస్పిటల్స్ విస్తరణ ద్వారా ఈ అదనపు పడకలను చేర్చుకోనున్నట్లు అపోలో హాస్పిటల్స్ పేర్కొంది. ఇప్పటికే తొలి దశలో 2,000 పడకల ఏర్పాటుకు సంబంధించిన పనులు సాగుతున్నాయని పేర్కొంది. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ హాస్పిటల్స్ విస్తరణ ద్వారా 160 పడకలు చేర్చుకోవటంతో పాటు గచ్చిబౌలిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్‌తో హైదరాబాద్‌లో మొత్తం పడకల సంఖ్య 1,400కు చేరుకోనుందని తెలిపింది. అలాగే బెంగళూరులో 200 పడకల సామర్థ్యం గల హాస్పిటల్ కొనుగోలుతో పాటు కొత్త హాస్పిటల్ ఏర్పాటుతో మొత్తం పడకల సంఖ్య 1,500కు చేరుకోనుందని పేర్కొంది. మరోవైపు పుణె, కోల్‌కతా, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో నెలకొల్పుతున్న హాస్పిటల్స్ కూడా ఈ ఏడాది అందుబాటులోకి రానున్నాయని తెలిపింది.

క్యూ4 ఆదాయం రూ.5,592 కోట్లు: మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో అపోలో హాస్పిటల్స్ రూ.5,592 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.390 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.254 కోట్లు)తో పోల్చితే లాభం 54 శాతం వృద్ధి చెందగా ఆదాయం (రూ.4,944 కోట్లు) 13 శాతం పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.21,794 కోట్ల ఆదాయంపై రూ.1,446 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.10 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

టీజీబీ చైర్మన్‌గా ప్రతాప రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) చైర్మన్‌గా కే ప్రతాప రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈయన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వ్యవసాయం, ఫైనాన్షియల్ ఇంక్లూజన్, రిటైల్, కమర్షియల్, రూరల్ బ్యాంకింగ్ రంగాల్లో అపారమైన అనుభవం కలిగిన ప్రతాప రెడ్డి టీజీబీ చైర్మన్‌గా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. టీజీబీ మాతృసంస్థ అయిన ఎస్‌బీఐలో ఆయనకు రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) చైర్మన్‌గా రెండేళ్ల పాటు సేవలందించారు. ప్రస్తుతం తెలంగాణలో ఏపీజీవీబీ కార్యకలాపాలన్నీ టీజీబీలో విలీనమయ్యాయి.

కాగా మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను టీజీబీ రూ.73,791 కోట్ల మొత్తం వ్యాపారంపై రూ.675 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ప్రస్తుతం తెలంగాణలో టీజీబీ 17 రీజినల్ బిజినెస్ కార్యాలయాలతో మొత్తం 934 శాఖలను నిర్వహిస్తోంది.

స్పోర్ట్స్

ప్రధానితో వైభవ్ కుటుంబం



పట్నా: ప్రధాని నరేంద్ర మోదీని యువ సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కలిశాడు. ఈ సందర్భంగా స్థానిక విమానాశ్రయంలో వైభవ్, అతడి తల్లిదండ్రులను మోదీ ఆప్యాయంగా పలకరించారు. 14 ఏళ్ల వైభవ్ ప్రధాని కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. 'యువ క్రికెటర్ వైభవ్, అతడి కుటుంబాన్ని పట్నా ఎయిర్‌పోర్టులో కలిశాను. అతడి భవిష్యత్తు గొప్పగా సాగాలని కోరుకుంటున్నా' అని ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఐపీఎల్‌లో సెంచరీ చేశాక ప్రధాని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలోనూ వైభవ్‌ను కొనియాడారు.

శతక్కొట్టిన కరుణ్ నాయర్



ఇండియా 'ఎ' 409/3
ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికార టెస్ట్

కాంటర్‌బరీ: ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికార టెస్ట్ తొలిరోజే కరుణ్ నాయర్ (186 బ్యాటింగ్) శతక్కొట్టాడు. శుక్రవారం ప్రారంభమైన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో కరుణ్‌తో పాటు సర్ఫరాజ్ ఖాన్ (92), ధ్రువ్ జురెల్ (82 బ్యాటింగ్) చెలరేగారు. దాంతో తొలి రోజు ఆఖరికి మొదటి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 409/3 పరుగులు చేసింది. టాస్ కోల్పోయి ఇండియా 'ఎ' బ్యాటింగ్ చేపట్టగా యశస్వీ జైస్వాల్ (24), అభిమన్యు ఈశ్వరన్ (8) విఫలమయ్యారు. ఆనక నాయర్, సర్ఫరాజ్ మూడో వికెట్‌కు 181 పరుగులు జోడించి ఆదుకున్నారు. తర్వాత జురెల్‌తో కలిసి కరుణ్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 177 పరుగులు జత చేశాడు.

అర్జున్‌కు మరో ఓటమి

స్టావంజర్ (నార్వే): అర్జున్ ఇరిగేసి నార్వే చెస్ టోర్నీ నాలుగో రౌండ్‌లో వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో పరాజయం చవిచూశాడు. గురువారం రాత్రి జరిగిన నాలుగో రౌండ్‌లో 48 ఎత్తులలో అర్జున్‌ని కార్ల్‌సన్ ఓడించాడు. అర్జున్‌కిది వరుసగా రెండో పరాజయం. ఇక గుకేష్-కరువాన మధ్య నాలుగో రౌండ్ క్లాసికల్ గేమ్ డ్రా కావడంతో మ్యాచ్ ఆర్మగెడాన్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో కరువానను గుకేష్ చిత్తు చేశాడు. ఈ రౌండ్ తర్వాత అర్జున్, గుకేష్ చెరో 4.5 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల విభాగంలో వరల్డ్ చాంపియన్ వెన్‌జున్-కోనేరు హంపిపై నెగ్గింది. ఈ రౌండ్ అనంతరం ముజిచుక్‌తో కలిసి హంపి (7 పాయింట్లు) అగ్ర స్థానంలో నిలిచింది.

ఇంగ్లండ్ ఘనంగా..

238 రన్స్ తేడాతో విండీస్ చిత్తు

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ ఏకంగా 238 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 400 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెథెల్ (82), డకెట్ (60), బ్రూక్ (58), రూట్ (57) ఆకట్టుకున్నారు. అలాగే వన్డే చరిత్రలో తొలి ఏడుగురు బ్యాటర్లు 30+ స్కోర్లు సాధించడం విశేషం. ఛేదనలో విండీస్ 26.2 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. చివరి బ్యాటర్ సీల్స్ (29 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓవర్టన్, మహమూద్‌లకు మూడేసి, రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి.



2న ఇంగ్లండ్‌కు కేఎల్ రాహుల్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు కేఎల్ రాహుల్ వచ్చేనెల 2వ తేదీనే లండన్ పయనం కానున్నాడు. టెస్ట్ సిరీస్‌కు తగినవిధంగా సిద్ధమయ్యేందుకు.. ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా 'ఎ' ఆడే రెండో నాలుగు రోజుల టెస్ట్‌లో పాల్గొనాలని కేఎల్ నిర్ణయించుకున్నాడు.

నెంబర్‌వన్‌ను చిత్తుచేసి.. సెమీస్‌కు సాత్విక్ జోడీ

సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్



సింగపూర్: డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి ఈ సీజన్‌లో తొలి టైటిల్ దిశగా ముందడుగు వేసింది. సింగపూర్ ఓపెన్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్ జోడీని చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 27వ ర్యాంకరైన భారత ద్వయం 21-17, 21-15తో గో జ్ ఫీ/నూర్ ఇజుద్దీన్ (మలేసియా)పై గెలుపొందింది. భారత జంట సెమీస్‌లో మలేసియాకే చెందిన మూడో సీడ్ ఆరోన్ చియా/సో వూయి యిక్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

నందినికి పసిడి

గుల్వీర్, పూజకు కూడా.. ● ఆసియా అథ్లెటిక్స్



గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల స్వర్ణ సంబరం కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పోటీల్లో ఏకంగా ముగ్గురు అథ్లెట్లు పసిడి పతకాలు కొల్లగొట్టారు. తెలుగమ్మాయి అగసర నందిని మహిళల హెప్టాథ్లాన్ (5941 పాయింట్లు)లో విజేతగా నిలిచింది. ఈ క్రమంలో సోమా బిశ్వాస్ (2005), స్వప్నా బర్మన్ (2017) తర్వాత ఆసియా అథ్లెటిక్స్‌లో స్వర్ణం నెగ్గిన మూడో భారత మహిళా హెప్టాథ్లెట్‌గా నందిని రికార్డుకెక్కింది. ఇక గుల్వీర్ సింగ్.. 5,000 మీటర్ల రేసులో చాంపియన్‌గా నిలిచి తన ఖాతాలో రెండో పసిడి వేసుకున్నాడు. ఇక, హైజంప్‌లో పూజా సింగ్ (1.89 మీ) లంఘించి బంగారు పతకం దక్కించుకుంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పారుల్ చౌదరి రజతానికి పరిమితమైంది. పురుషుల 4x100 మీటర్ల రిలే ఈవెంట్‌లో భారత జట్టు సభ్యుల్లో ఒకరు ఫౌల్ చేయడంతో టీమ్ అనర్హతకు గురైంది. ఇక 200 మీటర్ల రేసులో తెలుగమ్మాయిలు జ్యోతి యర్రాజి, నిత్య గంధె ఫైనల్‌కు దూసుకెళ్లారు. టోర్నీలో భారత్ ఇప్పటిదాకా మొత్తం 18 పతకాలు (8 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్యాలు) సాధించింది. పోటీలకు ఆఖరిరోజైన శనివారం భారత్ ఖాతాలో మరిన్ని పతకాలు చేరే అవకాశముంది.

వీర జవాన్లకు అంకితం..

నేను ఈ పోటీల్లో పతకం గెలవడానికి మన త్రివిధ దళాలు ఇచ్చిన స్ఫూర్తే కారణం. దేశ సరిహద్దుల్లో వారు ప్రాణాలను పణంగా పెట్టి రక్షణ కల్పించడం వల్లే మనమంతా క్షేమంగా ఉన్నాం. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన భారత వీర జవాన్లకు ఈ పతకం అంకితం.

- అగసర నందిని

ముంబై ముందుకు

- క్వాలిఫయర్-2కు అర్హత
- రోహిత్ హాఫ్ సెంచరీ
- పోరాడిన సాయి సుదర్శన్

గుజరాత్ ఇంటికి



రోహిత్ (50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 81)

2 ఐపీఎల్‌లో ఎక్కువ సిక్సర్లు (302) బాదిన రెండో బ్యాటర్‌గా రోహిత్. గేల్ (357) తొలి స్థానంలో ఉన్నాడు.

ముల్లన్‌పూర్: ఆల్‌రౌండ్‌షోతో చెలరేగిన ముంబై ఇండియన్స్ క్వాలిఫయర్-2కి అర్హత సాధించింది. బ్యాటర్లు కలిసికట్టుగా కదం తొక్కడంతో పాటు బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీశారు. దీంతో శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా ఆదివారం పంజాబ్‌తో పోరుకు సిద్ధమైంది. ఇందులో గెలిచిన జట్టు బెంగళూరుతో ఫైనల్లో తలపడుతుంది. ఇక భారీ ఛేదనలో సాయి సుదర్శన్ (49 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 80) అద్భుతంగా పోరాడినా అతడికి పెద్దగా సహకారం అందలేదు. లీగ్ ఆరంభం నుంచి దాదాపు టేబుల్ టాపర్‌గానే కొనసాగిన టైటాన్స్ చివరకు ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించక తప్పలేదు. ముందుగా ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. రోహిత్ (50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 81), బెయిర్‌స్టో (22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 47), సూర్యకుమార్ (20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 33) వేగంగా ఆడారు. ప్రసిద్ధ్, సాయి కిశోర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 208 పరుగులు చేసి ఓడింది. సుందర్ (48), రూథర్‌ఫోర్డ్ (24) ఓ మాదిరిగా ఆడారు. బౌల్ట్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్ నిలిచాడు.

చివర్లో తడబాటు: భారీ ఛేదనలో గుజరాత్‌కు తొలి ఓవర్‌లోనే గట్టి ఝలక్ తగిలింది. కెప్టెన్ గిల్ (1)ను పేసర్ బౌల్ట్ ఎల్బీగా వెనక్కి పంపాడు. కానీ మరో ఓపెనర్ సాయి సుదర్శన్ మాత్రం తన పోరాటాన్ని కొనసాగించాడు. కానీ విజయం ఖాయమనుకున్న దశలో కీలక వికెట్లు తీసిన ముంబై బౌలర్లు మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పేశారు. ఆరంభంలో సాయి, వన్‌డౌన్ బ్యాటర్ కుశాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అలాగే పవర్‌ప్లేలో జట్టు 66/1 స్కోరు చేసింది. ఆ వెంటనే స్పిన్నర్ శాంట్నర్ ఓవర్‌లో కుశాల్ హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అయితే సాయి మాత్రం ఎదురుదాడి ఆపలేదు. ఈ దశలో మ్యాచ్ గుజరాత్ వైపే కనిపించింది. కానీ బుమ్రా 14వ ఓవర్‌లో సూపర్ యార్కర్‌తో సుందర్‌ను బౌల్డ్ చేయడంతో సీన్ మారిపోయింది. అప్పటికి మూడో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. ఆ తర్వాత పేసర్ గ్లీసన్ టైటాన్స్‌కు గట్టి షాక్ ఇస్తూ సుదర్శన్‌ను బౌల్డ్ చేయడంతో టైటాన్స్ చేసేదేమీ లేకపోయింది. దీనికి తోడు బుమ్రా 18వ ఓవర్‌లో 9 పరుగులే ఇవ్వడంతో సమీకరణం మరింత క్లిష్టంగా మారింది. రూథర్‌ఫోర్డ్ (24)ను బౌల్ట్ అవుట్ చేయడంతో చివ రి ఆరు బంతుల్లో టైటాన్స్‌కు 24 పరుగులు అవసరమయ్యాయి. కానీ మూడు పరుగులే రావడంతో ముంబై సంబరాల్లో మునిగింది.

కలిసికట్టుగా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ధనాధన్ ఆటతీరుతో హోరెత్తించింది. క్రీజులోకి దిగిన ప్రతీ బ్యాటర్ గుజరాత్ బౌలర్లపై ఆధిపత్యం చూపాడు. దీనికి తోడు వారి ఫీల్డింగ్ వైఫల్యం కూడా కలిసివచ్చింది. రికెల్టన్ స్థానంలో బరిలోకి దిగిన ఓపెనర్ బెయిర్‌స్టో తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. మరో ఓపెనర్ రోహిత్ నిలకడగా కొనసాగాడు. చివర్లో హార్దిక్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో భారీ స్కోరు సాధ్యమైంది. వాస్తవానికి రోహిత్ మూడు పరుగుల వద్ద ఉన్నప్పుడు కొట్జీ సులువైన క్యాచ్‌ను వదిలేశాడు. అలాగే 12 పరుగుల వద్ద కీపర్ కుశాల్ కూడా అందుకోలేకపోయాడు. అటు బెయిర్‌స్టో నాలుగో ఓవర్‌లో 6,4,6,6,4తో 26 పరుగులు రాబట్టాడు. ఇక ఆరో ఓవర్‌లో రోహిత్ 6,4,4తో పవర్‌ప్లేలో జట్టు 79 పరుగులు సాధించింది. బెయిర్‌స్టో జోరుకు ఎనిమిదో ఓవర్‌లో స్పిన్నర్ సాయికిశోర్ బ్రేక్ వేశాడు. సుదర్శన్ డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోవాలనుకున్నా ఆ బంతి లక్కీగా పక్కనే ఉన్న కొట్జీ చేతుల్లో పడింది. దీంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత స్పిన్నర్లు రషీద్, సాయి ఓవర్లలో రోహిత్ బౌండరీలతో ధాటిని కొనసాగించగా.. సూర్య సైతం కొట్జీ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదాడు. అదే ఓవర్‌లో సూర్య క్యాచ్‌ను కీపర్ కుశాల్ వదిలేశాడు. కానీ 13వ ఓవర్‌లో స్వీప్ షాట్‌కు వెళ్లి సూర్య అవుటయ్యాడు. అప్పటికే రెండో వికెట్‌కు 59 పరుగులు జత చేరాయి. అనంతరం డెత్ ఓవర్లలో వరుసగా రోహిత్, తిలక్ (25), నమన్ (9) వికెట్లను కోల్పోయినా.. చివరి ఓవర్‌లో కెప్టెన్ హార్దిక్ (22 నాటౌట్) మూడు సిక్సర్లతో 22 పరుగులు రాబట్టి స్కోరును 220+ దాటించాడు.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (సి) రషీద్ (బి) ప్రసిద్ధ్ 81, బెయిర్‌స్టో (సి) కొట్జీ (బి) సాయి కిశోర్ 47, సూర్యకుమార్ (సి) వాషింగ్టన్ (బి) సాయి కిశోర్ 33, తిలక్ (సి) మెండిస్ (బి) సిరాజ్ 25, హార్దిక్ (నాటౌట్) 22, నమన్ ధిర్ (సి) రషీద్ (బి) ప్రసిద్ధ్ 9, శాంట్నర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 228/5; వికెట్ల పతనం:** 1-84, 2-143, 3-186, 4-194, 5-206; **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-1, ప్రసిద్ధ్ 4-0-53-2, సాయి కిశోర్ 4-0-42-2, రషీద్ 4-0-31-0, కొట్జీ 3-0-51-0, వాషింగ్టన్ 1-0-7-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (బి) గ్లీసన్ 80, గిల్ (ఎల్బీ) బౌల్ట్ 1, మెండిస్ (హిట్ వికెట్) (బి) శాంట్నర్ 20, వాషింగ్టన్ (బి) బుమ్రా 48, రూథర్‌ఫర్డ్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 24, తెవాటియా (నాటౌట్) 16, షారుక్ (సి) సూర్య (బి) అశ్వనీ కుమార్ 13, రషీద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 208/6; వికెట్ల పతనం:** 1-3, 2-67, 3-151, 4-170, 5-193, 6-208; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-56-2, బుమ్రా 4-0-27-1, గ్లీసన్ 3.3-0-39-1, హార్దిక్ 3-0-37-0, శాంట్నర్ 1-0-10-1, నమన్ ధిర్ 1-0-9-0, అశ్వనీ కుమార్ 3.3-0-28-1.

ఫ్రెంచ్ ఓపెన్



సబలెంక

ప్రీక్వార్టర్స్‌లో సబలెంక, స్వియటెక్

పారిస్: టాప్ సీడ్ సబలెంక, డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్ ఫ్రెంచ్ ఓపెన్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో సబలెంక 6-2, 6-3తో డానిలోవిచ్‌ను చిత్తు చేసింది. ఇక స్వియటెక్ 6-2, 7-5తో క్రిస్టియన్‌ని ఓడించింది. నాలుగో సీడ్ పోలిని 6-4, 6-1తో యులియాపై, ఎనిమిదో సీడ్ జెంగ్ 6-3, 6-4 విక్టోరియాపై, రిబకినా 6-2, 6-2తో ఓస్టాపెంకోపై నెగ్గి నాలుగోరౌండ్‌కు చేరారు. పురుషుల సింగిల్స్‌లో ముసేటి, రూన్, టామీ పాల్ ముందంజ వేశారు.

ఏడో సీడ్‌కు భాంబ్రీ జోడీ షాక్: పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రీ ద్వయం సంచలనం సృష్టించింది. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో భాంబ్రీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-7(4), 7-6 (7), 6-3తో ఏడో సీడ్ నొకోలా మెక్టిక్ (క్రొయేషియా)/మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంటని ఓడించి ముందంజ వేసింది.

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) :23
సంచిక (Issue) : 62
శనివారం | 31-5-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.8.16 తదుపరి షష్ఠి; నక్షత్రం: పుష్యమి రా.9.07 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శేషం ఉ.6.56; దుర్ముహూర్తం: ఉ.5.43-7.27; అమృతఘడియలు: మ.2.48-4.23; రాహుకాలం: ఉ.9.00-ఉ.10.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మిస్ వరల్డ్ 2025 ఫైనల్‌కు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాట్లు

రూ. 8.5 కోట్ల నగదు..



1770 వజ్రాల కిరీటం

ప్రపంచ సుందరికి అందే నజరానాలు.. ఏడాదిపాటు ఉచితంగా ప్రపంచ యాత్ర

ప్రకటనలు, సినిమాల్లో అవకాశాలు మరెన్నో.. ప్రస్తుతం పోటీలో 40 మంది

ప్రపంచం దృష్టి అంతా హైదరాబాద్ పైనే..

150కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం

హైటెక్స్‌లో 4వేల మంది వీక్షించేలా ఏర్పాట్లు

భారత్ గెలిస్తే అత్యధిక టైటిళ్ల విజేతగా రికార్డు

నేడే మిస్ వరల్డ్ ఫైనల్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ సుందరి విజేత ఎవరో నేడే తేలిపోనుంది. హైటెక్స్‌లో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రపంచ సుందరి పోటీల తుది ఘట్టం మొదలుకానుంది. ప్రపంచ సుందరి విజేతకు మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.8.5 కోట్లు) నగదుతో పాటు 1,770 వజ్రాలతో కూడిన తెల్ల బంగారు కిరీటం దక్కనుంది. అంతేకాదు మిస్ వరల్డ్ బ్రాండ్ అంబాసిడర్ హోదాలో ఏడాది పాటు ప్రపంచమంతా ఉచితంగా పర్యటించే అవకాశం లభిస్తుంది. అదే సమయంలో అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు, సినిమాల్లో అవకాశాలతో మరెన్నో నజరానాలు దక్కుతాయి.

ఎంపిక ప్రక్రియ జరిగేది ఇలా..

ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు 108 దేశాలకు చెందిన సుందరీమణులు వచ్చారు. అందులో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల నుంచి 40 మందిని క్వార్టర్ ఫైనల్‌కు ఎంపిక చేశారు. అందులో నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు సంబంధించి ఒక్కో విభాగం

మిగతా 12వ పేజీలో...

కేసీఆర్, ఈటల

పాత బంధం చిగురించింది

శామీర్‌పేట ఫాంహౌస్‌లో ఈటలతో హరీశ్ భేటీ

అక్కడి నుంచే కేసీఆర్‌తో ఫోన్‌లో మాటామంతీ

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం: మహేశ్ గౌడ్



హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి నోటీసులు రాగానే కేసీఆర్, ఈటల రాజేందర్ మధ్య పాత బంధం మళ్లీ చిగురించిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. శామీర్‌పేటలోని ఓ ఫాంహౌస్‌లో ఈటలతో హరీశ్‌రావు భేటీ అయ్యారని, అక్కడి నుంచి కేసీఆర్‌తో వారు ఫోన్‌లో సంభాషించారన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. బీఆర్ఎస్ ఒక మునిగిపోయిన నావ అని, ఆ నావలో ఉన్న వస్తువుల్లో వాటాల కోసమే కేసీఆర్ కుటుంబంలో

మిగతా 9వ పేజీలో...

సంపన్నుల చేతుల్లో అసైన్డ్ భూములుంటే

స్వాధీనమే

9

పేదల అసైన్డ్ భూములను వారసులకు బదిలీ చేసే వెసులుబాటు కల్పిస్తున్నాం

3 నుంచి 18 వరకు రెవెన్యూ సదస్సులు

కవిత వివాదం టీ కప్పులో తుఫానే: పొంగులేటి



మంచిర్యాలలో తెలంగాణ జాగృతి నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కమలంతో పొత్తు పెట్టుకున్న ఏ పార్టీ

బాగుపడలేదు

పొత్తు ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకిస్తా

పార్టీని కాపాడుకోవాలనే కేసీఆర్‌కు లేఖ

అవకాశం వచ్చినా నాన్నను కలవలేక పోయా

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం దుశ్చర్యలు

ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల మృతదేహాన్ని ఇచ్చే సంస్కారం లేని పార్టీ బీజేపీ

కాంగ్రెస్ దళిత వ్యతిరేకి.. రేవంత్‌రెడ్డి కూడా..

అందువల్లే భట్టి, ఎంపీ వంశీలకు అవమానాలు

మంచిర్యాలలో విలేకరులతో ఎమ్మెల్సీ కవిత

ఆమె పర్యటనలో కనిపించని బీఆర్ఎస్ నేతలు

మంచిర్యాల, మే 30(ఆంధ్రజ్యోతి): తనకంటూ ప్రత్యేక అజెండా ఏదీ లేదని, పెద్దాయనను(కేసీఆర్‌ను ఉద్దేశించి) ఎవరు ఏమన్నా ఊరుకునేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మంచిర్యాలలో ఆమె మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఎన్నో ఆవేదనలు భరించలేక పార్టీని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే పెద్దాయనకు లేఖ రాసినట్లు తెలిపారు. జాగృతి కమిటీలను వేస్తే రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాగ్యరెడ్డి వర్మ, పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమాలను జాగృతి ఆధ్వర్యంలో చేశామని, అది కూడా బీఆర్ఎస్‌ను వ్యతిరేకించినట్లా అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)లో కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు కూడా పనికట్టుకొని విమర్శలు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఎందుకు స్పందించలేదని

మిగతా 11వ పేజీలో...

బాయ్‌కాట్!

కవితకు దూరంగా క్యాడర్

ఆమె వ్యాఖ్యలపై స్పందించవద్దు

కార్యక్రమాలలో పాల్గొనవద్దు

బీఆర్ఎస్ నేతలకు ఆదేశాలు

కవిత పర్యటనపై సొంత మీడియాతో అధిష్ఠానం నిఘా

ఆమె ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారన్నదానిపై ఆరా

కవిత తీరుతో కేసీఆర్ నారాజ్

అధినేత నుంచి క్షేత్రస్థాయి వరకు పార్టీలో అంతా మౌనం

11



బీజేపీలో విలీనంపై కేసీఆరే

జవాబు చెప్పాలి

కవిత వ్యాఖ్యలకు ఉన్న విలువ ఏమిటి?

వాళ్లది ఆస్తులు, అధికారం, పదవుల కొట్లాట


డాడీ–డాటర్.. సిస్టర్–బ్రదర్.. ఫ్యామిలీ డ్రామా

అందులో మేం పాత్రధారులం కాబోము

'సిందూర్'పై బడేమియా రాహుల్ మాటలకు ఛోటేమియా రేవంత్ వత్తాసు: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై కవిత డాడీ కేసీఆరే సమాధానం చెప్పాలని, ఆమె వాళ్ల డాడీనే ప్రశ్నించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం గురించి కవిత చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. పనికిరాని విషయాలపై తాను స్పందించబోనని.. ఆ వ్యాఖ్యలు చేసిన వాళ్లకు ఉన్న విలువ ఏంటని ప్రశ్నించారు. కవిత చేసిన ఆరోపణలు నేను విని జవాబు చెప్పాలా..? అని ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఓ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అని, అందులోని డైరెక్టర్ల మధ్య ఆస్తులు, అధికారం, పదవుల కొట్లాటపై తాము ఎందుకు తలదూర్చాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వాళ్లది ఇంటి సమస్య అని, చాలా చిన్న అంశమని అన్నారు. కవిత వ్యవహారంపై బీజేపీ సహా ఏ రాజకీయ పార్టీ స్పందించాల్సిన అవసరం లేదని తెలిపారు. అది డాడీ- డాటర్, సిస్టర్-బ్రదర్ డ్రామా అని.. వాళ్ల ఫ్యామిలీ డ్రామాలో తాము సూత్రధారులం, పాత్రధారులం కాబోమని చెప్పారు. ఆ అంశం తెలంగాణ ప్రజలకు సంబంధం లేని విషయమని

మిగతా 11వ పేజీలో...



సీఎంతో గద్దర్ అవార్డుల కమిటీ చైర్మన్ మురళీమోహన్, దిల్‌రాజు తదితరులు

బాలకృష్ణకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు

విజయ్ దేవరకొండకు కాంతారావు పురస్కారం

పైడి జైరాజ్ అవార్డుకు ఎంపికైన మణిరత్నం

ప్రజాకవి కాళోజీ చిత్రానికి స్పెషల్ జ్యూరీ పురస్కారం

ఏడాదికి 3 చొప్పున పదేళ్ల అవార్డులు ఒకేసారి ప్రకటించిన జ్యూరీ చైర్మన్ మురళీమోహన్

8

ఏపీలోనూ అవార్డులు ఇవ్వాలన్న సీనియర్ నటుడు

ఆర్ఆర్ఆర్‌పై ముఖ్యమంత్రి సమీక్ష

దక్షిణ భాగం అలైన్‌మెంట్ పరిశీలన

హ్యామ్ రోడ్లు, హైదరాబాద్–మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ రహదారులపైనా ఆరా

అధికారులకు పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

9

ఈడీ అధికారిని అరెస్టు చేసిన సీబీఐ

రూ. 20 లక్షలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి

ఒడిశాలో ఘటన.. నిందితుడు ఈడీ డిప్యూటీ డైరెక్టర్

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, మే 30: ఈడీ డిప్యూటీ డైరెక్టర్ చింతన్ రఘువంశీని సీబీఐ అధికారులు లంచం తీసుకుంటుండగా ఒడిశాలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2013 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన రఘువంశీ ఓ మైనింగ్ కేసును పరిష్కరించేందుకు భువనేశ్వర్‌కు చెందిన వ్యాపారవేత్త నుంచి ఏకంగా రూ. 5 కోట్ల లంచం డిమాండ్ చేశారని అధికారులు తెలిపారు. ఒడిశాలోని ఢెంకనాల్ కు చెందిన మైనింగ్ వ్యాపారి రతికాంత రౌత్ పై కొన్నాళ్ల క్రితం ఈడీ కేసు నమోదైంది. విచారణలో భాగంగా ఈ ఏడాది మార్చిలో రౌత్ ఈడీ ఆఫీస్‌కు వెళ్లినప్పుడు కేసుకు సంబంధించి ఆస్తులు అటాచ్ చేయకుండా ఉండేందుకు డబ్బులు చెల్లించాలని

మిగతా 10వ పేజీలో...




కిటికీ నుంచి

కరెన్సీ వర్షం

విజిలెన్స్ దాడికి భయపడి

నోట్ల కట్టలు బయటకు విసిరేసిన ఒడిశా ఇంజనీర్

10



నిందితులు బాలాజీ, స్వాతి

అధిక వడ్డీ ఆశ చూపి..

150 కోట్లకు టోపీ

16 నెలల్లో సొమ్ము డబుల్ అంటూ

1,530 మంది నుంచి డిపాజిట్లు వసూలు

తిరిగి చెల్లించని పెంగ్విన్ సెక్యూరిటీస్ సర్వీసెస్

జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

నిర్వాహకుల్లో ఒకరి అరెస్టు.. పరారీలో మరొకరు

జీడిమెట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే.. 16 నెలల్లో రెండింతలు ఇస్తామని ఆశ చూపారు. డిపాజిట్లు చెల్లించినవారికి బాండ్ పేపర్లు రాసిచ్చారు. కొందరికి అధికంగా డబ్బులిచ్చి నమ్మించారు. సుమారు 1,530 మంది నుంచి రూ.150 కోట్లకుపైగా వసూలు చేశారు. ఆ తర్వాత బోర్డు తిప్పేశారు. హైదరాబాద్ శివార్లలోని జీడిమెట్లలో ఈ భారీ మోసం వెలుగు చూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన వడైగర్ బాలాజీ (35), తండ్లే చౌదరి స్వాతి(30) 2023లో చింతల్ సూర్యానగర్‌లోని రిడ్జ్ టవర్స్‌లో పెంగ్విన్ సెక్యూరిటీస్ సర్వీసెస్ పేరిట సంస్థను నిర్వహిస్తున్నారు. అంతకుముందు

మిగతా 12వ పేజీలో...

వాణిజ్య పన్నుల స్కామ్‌లో

సీఐడీ దూకుడు

యాప్స్, మాడ్యూల్స్ తయారీలో రిసోర్స్ పర్సన్లుగా ఉన్న అధికారులపై దృష్టి

30 మందికి విచారణ కోసం పిలుపు

ఇప్పటికే 20 మంది విచారణ పూర్తి

నేడు మిగతావారి వంతు

12

వాణిజ్య పన్నుల శాఖ సాఫ్ట్‌వేర్‌లో మాడ్యూల్‌ను మాయం చేయడంపై ఆరా



'కాళేశ్వరం' ప్రయోజనాలు

వివరిద్దాం!

కమిషన్ ఎదుట చెప్పేందుకు కేసీఆర్ సన్నద్ధం

మరోసారి బీఆర్ఎస్ చీఫ్‌తో హరీశ్ భేటీ

ఫామ్‌హౌజ్‌లో ఐదుగంటల పాటు చర్చ

తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న హరీశ్

కవిత పరిణామాలపైనా కేసీఆర్ ఆరా!

సంగారెడ్డి ప్రతినిధి/హైదరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై విచారణ కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమాయత్తమవుతున్నారు. ఇదే విషయమై ఇప్పటికే మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో మూడుసార్లు చర్చించిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం మరోసారి సిద్దిపేట జిల్లా

మిగతా 11వ పేజీలో...

గోదావరి–కావేరీ అనుసంధానంపై

మళ్లీ ఫోకస్!

9

జూన్ 24న సీడబ్ల్యూసీ, నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ భేటీ

బొల్లాపల్లి నుంచి అనుసంధానానికి ఏపీ పట్టు

సగం వాటా కేటాయించాలన్న తెలంగాణ

పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై సర్వే

ఆరు నదుల ప్రవాహంపై జరపాలని సీడబ్ల్యూసీ నిర్ణయం

9

ఖర్చు పోలవరం ప్రాజెక్టు అథారిటీదే!

దాబా హోటళ్లలో మత్తు!

షాద్‌నగర్ మార్వాడి దాబాలో గుట్టుగా డ్రగ్స్ విక్రయం

రూ.3.05 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్

నలుగురి అరెస్టు

12



'బ్రహ్మోస్'తో పాక్‌కు

నిద్ర లేని రాత్రులు

ఉగ్ర, వైమానిక స్థావరాల్ని ధ్వంసం చేసిన క్షిపణులు

ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

ఉగ్రవాద పాము మళ్లీ పడగ విప్పితే తొక్కేస్తాం

బిహార్, యూపీ పర్యటనలో ప్రధాని మోదీ

10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గెలుపోటములు!

తాత్కాలికమే కావచ్చును కానీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సత్వర ఉపశమనం దక్కింది. నీకేమీ విశేషాధికారాలు లేవు విదేశీ-వాణిజ్యంతో చిత్తంవచ్చినట్టు ఆడుకోవడానికి అంటూ అమెరికా వాణిజ్య న్యాయస్థానం ట్రంప్ దూకుడుకు అడ్డుకట్టవేసిన మరునాడే అప్పీల్ కోర్టులో ఆయనకు ఉపశమనం లభించింది. జిమ్మీకార్టర్ కాలంలో తయారైన, అనంతరం ఏ అమెరికా అధ్యక్షుడూ వినియోగించని ఓ ఆర్థిక అత్యాయిక చట్టాన్ని ఆయుధంగా వాడి, ఏకంగా 180దేశాలతో సుంకాల యుద్ధం చేసిన, చేస్తున్న అమెరికా అధ్యక్షుడికి తన అధికారాల పరిమితులేమిటో తెలియదని అనుకోలేం. న్యాయకోవిదులు, వాణిజ్య నిపుణులు ఆయనకు మంచిచెడ్డలు చెప్పి, దేశానికి కీడు చేస్తున్నావని హెచ్చరించేవుంటారు. కానీ, అమెరికాను దోచుకుంటున్న మిగతా ప్రపంచం మెడలు వంచిన యోధుడుగా, రక్షకుడుగా తన ప్రజలకు కనిపించడం ప్రధానం కనుక, ఆయన ఎంతవరకైనా పోతాడు. రాజ్యాంగంతో సహా సమస్తవ్యవస్థలనూ కాదంటాడు. అధ్యక్షుడుగా ఎన్నికల్లో ఓడినాకూడా ప్రజాతీర్పును తప్పుబట్టి, తన అభిమానులను చట్టసభలమీదకు ఉసిగొల్పిన ఉదంతం అంతసులభంగా మరిచిపోయేది కాదు.

మిగతా ప్రపంచంతో పోరాడుతున్నానంటున్న తమ అధ్యక్షుడిమీద అమెరికాలోని చిన్నాచితకా వాణిజ్య సంస్థలు, వేదికలు, వ్యక్తులు, రాష్ట్రాలు న్యాయపోరాటానికి నడుంబిగించాయి కనుక, ఈ వ్యవహారం ఇప్పట్లో తెగేది కాదు. అప్పీల్ కోర్టు ఆదేశాలు ట్రంప్‌కు ఉపశమనం ఇస్తే, ట్రేడ్‌కోర్టు తీర్పు మిగతా ప్రపంచానికి ఉత్సాహాన్నిచ్చింది. ట్రేడ్‌కోర్టు తీర్పులో ట్రంప్‌కు కుట్రలూ, రాజకీయాలు, తనపట్ల ద్వేషం కనిపించాయి. కానీ, వైట్‌హౌస్ అత్యవసరంగా వినియోగంలోకి తెచ్చిన ఆ చట్టం అధ్యక్షుడికి అమెరికన్ కాంగ్రెస్‌ను అతిక్రమించి వాణిజ్య నిర్ణయాలు తీసుకొనే విశేషాధికారాలనేమీ ఇవ్వలేదని ట్రేడ్‌కోర్టు తేల్చింది. 'లిబరేషన్ డే' పేరిట ఆయన అక్షరక్రమంలో ఒక్కోదేశం పేరూ చదువుతూ వాటిమీద విధించిన సుంకాలశాతాన్ని ఏప్రిల్ 2న ప్రకటించిన ఆ దృశ్యం ఎన్నటికీ మరిచిపోగలిగేది కాదు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలను మాదకద్రవ్యాల అక్రమ రవాణాపేరిట మరింత శిక్షించడమే కాక, చివరకు మనుషులు లేని ద్వీపాలను కూడా ఆయన వదల్లేదు. ఈ క్రమంలో ప్రపంచవాణిజ్యాన్ని, గొలుసుకట్టు వ్యవస్థలను తుత్తునియలు చేశాడు. ప్రపంచమార్కెట్లన్నీ తలకిందులై లక్షలాదికోట్లు హరించుకుపోయేందుకు కారణమైనాడు. ఈ సుంకాలు, ప్రతీకార సుంకాల యుద్ధం సాగుతూండగానే, తన దెబ్బకు మిగతా ప్రపంచమంతా లొంగివచ్చిందని, దేశాలన్నీ ఒప్పందాలకు దిగివస్తున్నాయని ఆయన చెప్పాడు. కానీ, ట్రంప్ నిర్ణయాల పర్యవసానాలను తాము ఎదుర్కోవాల్సివస్తున్నదని, తమకు అవి భారంగా పరిణమించాయని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. సరఫరాలు నిలిచిపోయి ఆర్థికంగా అపారనష్టం కలుగుతోందని, ఉత్పత్తులు అందక వినియోగదారులకు ఇబ్బంది కలుగుతోందని అంటున్నాయి. బడుగులను కొట్టి బిలీనియర్లకు దోచిపెట్టేందుకే ట్రంప్ ఈ ఎత్తుగడ వేశారని విమర్శకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో, వాణిజ్యానికి సంబంధించి ట్రంప్‌కు చిత్తంవచ్చిన నిర్ణయాలు తీసుకొనే అధికారం లేదని, అమెరికన్ కాంగ్రెస్‌ను దాటిపోవడం శుద్ధతప్పని ట్రేడ్‌కోర్టు చెప్పడం బాగుంది. అమెరికా యాభైయేళ్ళుగా వాణిజ్యలోటు ఎదుర్కొంటున్నదనీ, విశేషాధికారాలు ప్రయోగించాల్సినంత అత్యవసర స్థితి ఏమీ లేదనడం మరీ బాగుంది.

మిగతా ప్రపంచంతో వాణిజ్యయుద్ధాన్ని ఆరంభించి, ఉద్రిక్తతలు పెంచిన ట్రంప్ ప్రభుత్వం న్యాయస్థానంలో మాత్రం తాను వాణిజ్యాన్ని వాడి యుద్ధాలు ఆపుతున్నానని, సుంకాలను సంధించి శాంతిని సాధిస్తున్నానని విచిత్రమైన వాదనలు చేసింది. భారత్—పాక్ ఘర్షణలను కూడా అందుకు నిస్సిగ్గుగా వాడుకుంది. దేశ అత్యాయిక స్థితిని ఎలా ఎదుర్కోవాలో ఎన్నికకాని న్యాయమూర్తులకు ఏమి తెలుసంటూ ట్రంప్ బృందం అహంకారంతో వ్యాఖ్యానిస్తోంది. లేని అధికారాలను దఖలుపరచుకొని, అమెరికా ఆర్థిక, వాణిజ్య భవిష్యత్తును ప్రభావితం చేసే కీలకమైన నిర్ణయాలను వీసమెత్తు చర్చలేకుండా ఓవల్ ఆఫీసులో కూర్చుని ఏకపక్షంగా తీసుకుంటున్న ట్రంప్‌కు ఏ అనుభవం ఉన్నదో మరి. ఇప్పటివరకూ నోరుమెదపని అమెరికన్ కాంగ్రెస్ ఇప్పటికైనా చొరవచూపి తన ఉనికిని కాపాడుకుంటే బాగుంటుంది.

ఆ నాటి చెలిమి ఒక కల..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిగా ఉన్న డోనాల్డ్ ట్రంప్ అక్టోబర్ 2024లో ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు : 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్లాదకరమైన వ్యక్తి, మంచి 'స్నేహపాత్రుడు' అని మెచ్చుకున్నారు. ఫిబ్రవరి 2025లో వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన మోదీ ఇలా చెప్పారు : 'సంపద్వంతమైన భారత్ నిర్మాణానికి మా దార్శనికత 'మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్' (మిగా). అమెరికా, ఇండియా కలిసికట్టుగా ముందుకు సాగితే అంటే మగా ప్లస్ మిగా మెగా అవుతుంది. సంపద్వృద్ధిలో మా రెండు దేశాలు గొప్ప భాగస్వాములు'. ఇండియా ప్రధానమంత్రి, అమెరికా అధ్యక్షుడు ఇరువురూ వినయంలేని మొండి పాఠశాల బాలల్లా అందరినీ ఆకట్టుకున్నారు. మరి ఇప్పుడు మోదీ, ట్రంప్‌ల మధ్య



■ పి. చిదంబరం

'పళని' పలుకు

వర్ధిల్లిన ఆ దోస్తీ ఏమయింది? స్నేహోల్లాసం సెలవు తీసుకుందా? సరసత సమసిపోయిందా?

మే 7, 2025 నుంచి మోదీ, ట్రంప్ పరస్పరం మాట్లాడుకోవడం లేదని నాకు విశ్వసనీయంగా తెలిసింది. మనకు తెలిసిందల్లా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ విదేశాంగ శాఖ కార్యదర్శి మార్కో రూబియో మే 9 రాత్రి మోదీతో ఫోన్‌లో మంతనాలు జరిపారని, యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని ఇరువురూ ప్రధానమంత్రిని కోరారు. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ సంభాషణల గురించి పరోక్షంగా సూచించారు. 'అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల తరువాత, భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే కాల్పుల విరమణను సంపూర్ణంగా పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించడానికి చాలా సంతోషిస్తున్నాను'. మే 10 సాయంత్రం 5.25 గంటలకు వెలువడిన ట్రంప్ ప్రకటన భారతీయులను వాస్తవ పరిస్థితులకు మొరటుగా జాగరూకం చేసింది.

ట్రంప్ దబాయించలేదు మే 10 సాయంత్రం 3.35 గంటలకు కాల్పుల విరమణకు ఉభయ దేశాలు అంగీకరించాయి. అది ఆ సాయంత్రం 5.00 గంటల నుంచి అమలులోకి వచ్చింది. మందహాసం చేయలేని మన విదేశాంగ శాఖ కార్యదర్శి అదే సాయంత్రం 6 గంటలకు ఈ వాస్తవాలను ధ్రువీకరించారు. (తీవ్ర బెదిరింపులతో కానప్పటికీ) తమ మధ్యవర్తిత్వం కారణంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా ఎలా చెప్పుకుంటుంది, ఎందుకు చెప్పుకుంటుంది అన్న విషయాన్ని నిశితంగా శోధించడం చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను. సహేతుకమైన కారణాలు అనేకమున్నాయి.



పాకిస్థాన్ ఇంకెంత మాత్రం తేలిగ్గా లొంగిపోయే శక్తి కాదు. దానికి చైనా సైనిక మద్దతు, అమెరికా దౌత్య మద్దతు ఉన్నది. ఇండియా ఇప్పుడు తన సైనిక వ్యూహాన్ని సరికొత్తగా రూపకల్పన చేసుకోవాలి. తన అమెరికా విధానాన్ని కూడా మళ్లీ కొత్తగా రూపొందించుకోవాలి.

నాలుగు రోజుల యుద్ధం జరిగిన తీరుతెన్నులు నిశితంగా చూడండి. మే 7న అల్గోరిథమ్ ఆధారిత యుద్ధాల యుగంలోకి భారత్ ప్రవేశించింది. ఒక్క సైనికుడూ భూసరిహద్దును కానీ, నియంత్రణరేఖను కానీ దాటలేదు. ఏ విమానమూ శత్రు వాయుతలంలోకి ప్రవేశించలేదు. ప్రధానాయుధాలు మిస్సైల్, సాయుధ డ్రోన్‌లు తొట్ట తొలుత యుద్ధంలోకి ప్రవేశించిన భారత్‌కు సహజంగానే అనుకూలతలు ఉన్నాయి. మే 7—9 తేదీల మధ్య పాకిస్థాన్‌కు భారీనష్టాన్ని కలిగించింది. ఆ విజయోత్సవ వేళ యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ జోక్యం చేసుకున్నారు. 'ఆహ్లాద కరమైన 'స్నేహపాత్రుడు'తో మిత్రత్వాన్ని ఆయన పక్కన పెట్టేశారు. యుద్ధానికి తక్షణమే స్వస్తి చెప్పాలని గట్టిగానే బెదిరించారు ఇండియా నిరసనలను కొట్టివేశారు. సౌదీ అరేబియా, ఖతార్ పర్యటనల్లో కూడా తన మధ్యవర్తిత్వం, యుద్ధాన్ని నిలిపివేయకపోతే ఇంకెంత మాత్రం వాణిజ్యం చేయబోమని హెచ్చరించడం వల్లే కాల్పుల విరమణ ఒప్పందం సాధ్యమయిందని ఆయన పదే పదే ప్రకటించారు.

ట్రంప్ ఏమి చెప్పుతున్నప్పటికీ క్రమేపీ నెమ్మదిగా సత్యం స్పష్టమవుతూ వస్తోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య నాలుగు రోజుల సాయుధ సంఘర్షణల్లో ట్రంప్ జోక్యం వెనుక ఆయన కుటుంబ వాణిజ్య ప్రయోజనాలే ప్రధాన ప్రేరణగా ఉన్నాయన్నదే ఆ సత్యం. ట్రంప్ కుటుంబ క్రిప్టో కరెన్సీ కంపెనీ 'వరల్డ్ లిబర్టీ ఫైనాన్సియల్ (డబ్ల్యుఎల్ఎఫ్) పాకిస్థాన్‌తో సంప్రతింపులు జరిపింది. పహల్గాం ఉగ్ర ఘాతుకం చోటుచేసుకుని నాలుగు రోజులు కూడా గడవక ముందే ఏప్రిల్ 26న డబ్ల్యుఎల్ఎఫ్ ప్రతినిధులు పాక్ ప్రధానమంత్రి, సైనిక దళాల ప్రధానాధికారితో చర్చలు జరిపి పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. మే మొదటివారంలో సాయుధ సంఘర్షణలు ప్రారంభమై తీవ్రమవడంతో ఈ వివాదంలో జోక్యం చేసుకోకూడదన్న తన తొలి వైఖరిని ట్రంప్ విడనాడారు. మే 7 తరువాత ఉధృతంగా ప్రారంభమైన మధ్యవర్తిత్వ కార్యకలాపాలు ట్రంప్ చెప్పినట్లు ఆయన నిర్ణయాత్మక ప్రమేయంతో ముగిసాయి.

డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ మధ్య దోస్తీ ఉన్నప్పటికీ అమెరికా ప్రభుత్వం భారతీయ అక్రమ వలసకారులను చేతులకు బేడీలు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి స్వదేశానికి తిరిగి పంపించివేసింది. ఈ అవమానకరమైన చర్య పట్ల అసమ్మతి తెలుపుతూ ప్రధాని మోదీ ఒక్క మాటైనా మాట్లాడారా? లేదు. భారత్ నుంచి దిగుమతులపై ట్రంప్ భారీ సుంకాలు విధించారు. ప్రధానమంత్రి రవ్వంత మాటతోనైనా ఆక్షేపించారా? లేదు, లేదు. అంతర్జాతీయ ద్రవ్యనిధి రుణం విషయంలో పాకిస్థాన్‌కు అనుకూలంగా అమెరికా ఓటు వేసింది. న్యూఢిల్లీ ఏమి చేసింది? ఏమీ లేదు. భారతీయులతో సహా విదేశీ విద్యార్థులు అందరినీ హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించారు. భారత్ ప్రతిస్పందన మౌనమే కాదూ? అమెరికాలోని భారతీయ విద్యార్థులు వీసాల రద్దు ముప్పునెదుర్కొంటున్నారు. భారత ప్రభుత్వం వారికి బాసటగా మాట్లాడిందా? లేదు. విద్యార్థి వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేశారు. నిరసనగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ట్రంప్—మోదీ దోస్తీ ఏమయింది? అంతా గందరగోళంలోకి జారిపోయింది.

భారత ప్రధానమంత్రి ఇంకెంత మాత్రం అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడితో వ్యవహరించడం లేదు. పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న వందల కోట్ల డాలర్ల డబ్ల్యుఎల్ఎఫ్‌కి యజమానిగా ఉన్న ఒక కుటుంబ పెద్దతో ప్రధాని మోదీ బేరాలు ఆడుతున్నారు. స్వప్రయోజనాలకు తన సర్వాధికారాలు, ఆర్థిక వనరులను వినియోగించేందుకు ఏ మాత్రం సంకోచించని POTUS (ప్రెసిడెంట్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్)తో భారత ప్రధానమంత్రి వ్యవహరిస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు సమస్త భారతీయులు ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. కటువైన మాటలతో పాకిస్థాన్‌కు తీవ్రహెచ్చరికలు చేసిన ప్రధాని మోదీ ట్రంప్ మహాశయుడి దౌత్య రాజకీయానికి నిజంగానే అమిత కలవరపాటుకు గురయ్యారు. పాకిస్థాన్ ఇంకెంత మాత్రం తేలిగ్గా లొంగిపోయే శక్తి కాదు. దానికి చైనా సైనిక మద్దతు, అమెరికా దౌత్య మద్దతు ఉన్నది. ఇండియా ఇప్పుడు తన సైనిక వ్యూహాన్ని సరికొత్తగా రూపకల్పన చేసుకోవాలి. అంతే కాదు తన అమెరికా విధానాన్ని కూడా మళ్లీ కొత్తగా రూపొందించుకోవాలి. ఇవి మూలమట్టుగా జరగాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


ట్రంప్ గ్రహణంలో విద్యా అమెరికా

నాకు ప్రపంచ జ్ఞానం వచ్చినప్పటి నుంచీ అమెరికా పట్ల పరస్పర విరుద్ధ భావాలు ఉండేవి. అమెరికా సాహితీవేత్తలు కొంతమందిని (ఎర్నెస్ట్ హెమింగ్వే నాకు ప్రత్యేకంగా ఇష్టం) అభిమానించేవాణ్ణి. బాబ్ డిలాన్, మిస్సిస్సిపి జాన్ హర్ట్ సంగీతాన్ని గౌరవించేవాణ్ణి. ఇదలావుంచితే 1971 యుద్ధంలో రిచర్డ్ నిక్సన్, హెన్రీ కిస్సింజర్ భారత్, బంగ్లాదేశ్‌లకు వ్యతిరేకంగా పాకిస్థాన్‌ను ఎంతగా సమర్థించారో నాకు ఇప్పటికీ బాగా గుర్తు ఉన్నది. 1980లో ఉన్నత విద్యాభ్యాసానికి కలకత్తా వెళ్లాను. అప్పటికి అమెరికా విషయంలో నా పరస్పర విరుద్ధ మనోభావాలు పూర్తిగా విరోధపూరితమయ్యాయి. మార్క్సిస్టు మేధావులు అయిన నా ఉపాధ్యాయుల ప్రభావంలో నేను అమెరికాకు పూర్తిగా వ్యతిరేకినైపోయాను. అమెరికన్ల దుందుడుకుతనం, రోత కలిగించే వ్యాపార స్వభావం, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియాలో వారి సామ్రాజ్యవాద దుర్మార్గాలు నాకు ఏవగింపు కలిగించేవి. ఈ అసహ్యం నా వ్యక్తిగత చర్చల్లోనూ, బహిరంగ సంభాషణల్లోనూ తరచూ వ్యక్తమవుతుండేది.

నాకుగా నేను అయితే అమెరికా వెళ్లి ఉండేవాణ్ణి కాను. అయితే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ పట్టభద్రురాలు అయిన నా భార్య సుజాతకు 1985లో యేల్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు ఉపకార వేతనం లభించింది. ఆ విద్యావతి ఉన్నత విద్యాభ్యాసానికి అభ్యంతరం చెప్పలేనుకదా. అందునా యేల్ విశ్వవిద్యాలయ గ్రాఫిక్ డిజైన్ విభాగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పేరు పొందింది. అదృష్టవశాత్తు చరిత్ర విదుషీమణి ఉమాదాస్ గుప్తా నాకు పరిచయమయ్యారు. ఆమె అప్పుడు భారత్‌లోని యునైటెడ్ స్టేట్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఉన్నత స్థాయి బాధ్యతల్లో ఉన్నారు. ఉమాజీ సలహా, సహకారంతో యేల్ స్కూల్ ఆఫ్ ఫారెస్ట్రీ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లో విజిటింగ్ లెక్చరర్‌షిప్‌కు దరఖాస్తు చేశాను. ఆశ్చర్యకరంగా నా అభీష్టం నెరవేరింది.

2 జనవరి 1986న నేను యేల్‌కు చేరాను. దరిమిలా ఏడాదిన్నరపాటు నా విద్యార్థులకు బోధించడం ద్వారాను, వారి నుంచి నేర్చుకోవడం ద్వారాను నా మేధో నైశిత్యాన్ని పెంపొందించుకున్నాను, నా పరిశోధనాసక్తులను విస్తృతపరుచుకున్నాను. ఆనాడు నేను అమెరికా వెళ్లినందుకు నేను చాలా ఆనందపడుతున్నాను. అప్పటికే నేను పిహెచ్.డి పూర్తి చేసినందున నాకు సునిశ్చితమైన మేధో విశ్వాసాలు ఉండేవి. అమెరికాలో విద్యాభ్యాసానికి వచ్చిన యువ భారతీయ చరిత్రకారులు ఆనాటి విద్యాప్రపంచంలో ప్రచలితంగా ఉన్న సంప్రదాయాలను మాత్రమే అనుసరించడం నన్ను కించిత్ చకితుడిని చేసింది. పాలస్తీనియన్ మేధావి ఎడ్వర్డ్ సయీద్ 'Orientalism', వలసవాదానంతర, సాంస్కృతిక అధ్యయనాలు అమిత ఉత్సుకతను కలిగిస్తున్న కాలమది. వాటిపట్ల ఆసక్తి చూపేవారికి ఎనలేని ప్రోత్సాహమూ లభిస్తున్న రోజులవి. నాకు ఆసక్తి ఉన్న, శిక్షణ పొందిన చరిత్ర, సామాజిక మానవ శాస్త్రంలో అనుభావిక పరిశోధనకు ఆలంబన, మద్దతు కొరవడిన విద్యావాతావరణమది.

విద్యాభ్యాసానికి, బోధనకు అమెరికాకు వచ్చిన నా తరం భారతీయులు చాలావరకు జీవితోన్నతిని



సామ్రాజ్యవాద దురహంకారం, నయవంచనలే అమెరికా విదేశాంగ విధానం స్వతస్సిద్ధ లక్షణాలు. అమెరికా విశ్వవిద్యాలయాలు మానవత్వానికి అలంకారాలు. మానవతా ప్రదీప్త జ్ఞాన మందిరాలు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరిపాలనా వ్యవస్థ నుంచి వాటిపై ప్రేరేపిత, వివేక రహిత దాడులపట్ల సమస్త దేశాల ఆలోచనాపరులూ ఆవేదన చెందాలి.

సాధించేందుకునేందుకు వచ్చినవారే. నేను వారితో కలివిడిగా ఉండేవాణ్ణికాను. మా మేధో ఆసక్తులు, ప్రవృత్తులు భిన్నమైనవి కావడమే అందుకు కారణం. నాకు విశేష ఆసక్తి ఉన్న రెండు అంశాల— పర్యావరణం, సామాజిక నిరసనోద్యమాలు— లో విశేష కృషి చేసిన విద్వత్‌పరులే నన్ను ఎక్కువగా ఆకట్టుకునేవారు. వారు కృషి చేసిన సంస్కృతులు, సందర్భాలు నా సొంత వాటికి పూర్తిగా భిన్నమైనప్పటికీ వారి నుంచి స్ఫూర్తి పొందాను, నేర్చుకున్నాను. యేల్ విశ్వవిద్యాలయంలో పర్యావరణ సామాజిక శాస్త్రవేత్త 'William Burch', పర్యావరణ చరిత్రకారుడు 'William Cronon', పర్యావరణ మానవ శాస్త్రవేత్త 'Timothy Weiskel'లతో పలుమార్లు సుదీర్ఘ సంభాషణలు జరిపాను. మరో విద్వజ్జుడు 'James Scott'తో తరచు సంవాదాలు జరుపుతుండేవాణ్ణి. ఆయన అప్పుడే ప్రచురించిన 'Weapons of the Weak : Everyday Forms of Peasant Resistance' ఆయన గ్రంథాలలో కెల్లా ఉత్తమమైనది అని నేను భావిస్తాను. యేల్‌కు వెలుపల రట్జెర్స్ విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనాల ప్రముఖుడు Michael Adas తోను, బెర్కెలీలోని సామాజిక శాస్త్రవేత్త Louise Fortmannతోను, బ్రాండెయిస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న అమెరికన్ పర్యావరణ చరిత్ర పఠనిర్దేశకుడు Donald Worsterతోను సంబంధాలు నెరిపాను.

ఈ విద్వజ్జులు అందరూ నేను అలవాటుపడని పరిశోధనా పద్ధతులు, శిక్షణ లేని విద్యా విభాగాలతో ఆఫ్రికా, ఆగ్నేయాసియా, ఉత్తర అమెరికాలో విశేష విద్వత్ కృషి చేసినవారు. అంతేకాకుండా కలకత్తా, ఢిల్లీలోని పండిత ప్రకాండుల వలే కాకుండా ఈ అమెరికన్ విద్యావేత్తలు ఎటువంటి అహం లేకుండా తమ కొత్త విద్యార్థులతో సైతం ఎంతో కలివిడిగా మాట్లాడే ఉదార స్వభావులు, సహృదయులు. వారంతా నా కంటే పెద్దవారయినప్పటికీ పేరు పెట్టి పిలిచినా ఆనందంగా ఆదరించేవారు. తమ భావాలపై నా మిమర్శలకు ప్రాధాన్యమిచ్చి నిశిత చర్చలు జరిపేవారు. ప్రస్తావిత జ్ఞాన పారంగతులు కలుసుకోవడం, సమాలోచనలు జరపడం ద్వారా నా మేధో దిగంతాలు విస్తరించాయి, నా జ్ఞానాసక్తులు వికసించాయి, మేధో ఆకాంక్షలు కొత్త లక్ష్యాలను నిర్దేశించాయి. వారి మాదిరిగానే నా పీహెచ్‌డీ థీసిస్‌ను పుస్తకంగా ప్రచురించాలని, పిదప రెండో పుస్తకం, ఆ తరువాత మూడో పుస్తకం రాయాలని అభిలషించాను, ఆరాటపడ్డాను. నాకు తెలిసిన చాలా మంది భారతీయ విద్వజ్జులు మొదట ఒక ప్రశస్త పుస్తకం రాసి, అది సమకూర్చిన గౌరవంతో సంతృప్తి పడిపోయినవారే. Adas, Scott, Worsterలు మనవారికి పూర్తిగా భిన్నమైనవారు. వారి మేధో కృషి చాలా ఉన్నతమైనది, లోతైనది, విస్తృతమైనది, వైవిధ్య భరితమైనది. ఇంటికి తిరిగివెళ్లిన తరువాత వారిలా నా మేధో కృషి సాగించాలని నేను నిర్ణయించుకున్నాను.

యేల్ విశ్వవిద్యాలయ జీవితాన్ని సుజాత, నేను చాలా ఆనందంగా గడిపాము. ఆమె మాస్టర్స్‌ను పూర్తి చేసిన తరువాత మేము స్వదేశానికి వెళ్లిపోతాము కనుకనే ఎటువంటి ఆలోచన లేకుండా సంతోషంగా ఉన్నాము. కొంతమంది అమెరికన్లు మాకు సన్నిహిత మిత్రులు అయ్యారు. వారితో మాకు ఇప్పటికీ ఆత్మీయ సంబంధాలు కొనసాగుతున్నాయి. బెర్కెలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో నేను గడిపిన ఒక సెమిస్టర్ నాకు ఎన్నో ఆనందప్రదమైన జ్ఞాపకాలను



■ రామచంద్ర గుహ

గతానుగతం

మిగిల్చింది. యేల్, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలలో కంటే ఈ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు వైవిధ్య నేపథ్యాల నుంచి వచ్చినవారే కాకుండా ప్రశస్త మేధో నైశిత్యమున్నవారు కూడా.

ఓనమాల నుంచి డాక్టొరేట్ పొందేవరకు నా విద్యాభ్యాసమంతా పూర్తిగా భారతదేశంలోనే జరిగింది. నా వృత్తి జీవితమూ నా మాతృభూమిలోనే సాగింది. నా జీవితమంతా నా జన్మ భూమిలోనే నివసిస్తున్నాను. అయినప్పటికీ అమెరికాలో నాకు పరిచితులైన ప్రాజ్ఞులు, విద్వజ్జులు, విద్యార్థులకు నేను అపారంగా రుణపడి ఉన్నాను. అమెరికాలోని గ్రంథాలయాలు, పురాపత్రాల భాండాగారాలు ప్రశస్తమైనవి. భారతదేశ చరిత్రపై స్వదేశంలో లభించని విలువైన చారిత్రక పత్రాలు అమెరికాలో లభ్యమవుతాయి. ప్రగాఢ అధ్యయనాలకు అపార అవకాశాలు అందివస్తాయి. ఈ కారణంగానే విశిష్టమైన, అద్వితీయమైన అమెరికన్ విశ్వవిద్యాలయ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలు నాకు అంతులేని ఆవేదన, అపరిమిత ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. సైద్ధాంతిక విశ్వాసాల ప్రేరణతో చేస్తున్నారో లేక వ్యక్తిగత వైరంతో చేస్తున్నారో గానీ సమున్నత ఉన్నతవిద్యా వ్యవస్థ పట్ల ట్రంప్ వ్యవహరిస్తున్నతీరు తాను పరిపాలిస్తున్న, తాను ఎంతగానో ప్రేమిస్తున్నానని ఆయన చెప్పుకుంటున్న దేశానికి ఎనలేని హాని చేస్తోంది. అమెరికా ఉన్నత విద్యారంగంలో లోపాలు, లొసుగులు లేకపోలేదు. అయితే ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో అత్యధికం నిస్సందేహంగా అమెరికాలోనే ఉన్నాయి. సమస్త దేశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులు, ఆచార్యులు, మేధావులకు ఉత్కృష్ట విద్యా విజ్ఞానాలు సమకూర్చడం ద్వారా అమెరికా కీర్తిప్రతిష్ఠలను ఘనంగా పెంపొందించాయి, విశ్వం అంచులకు విస్తరింపచేశాయి. వైజ్ఞానిక సృజనాత్మకతను వికసింపచేసి, సమృద్ధం చేయడం ద్వారా అమెరికాను ఆర్థిక మహాశక్తిగా, అధునాతన సాంకేతికతల స్రష్టగా ప్రపంచ అగ్రగామిగా నిలుపుతున్నాయి.

1986లో యేల్ విశ్వవిద్యాలయానికి వెళ్లక ముందు నేను కొంతకాలం అమెరికా విదేశాంగ విధానం విమర్శకుడుగా ఉన్నాను. అనంతర కాలంలో కూడా విదేశాల్లో అమెరికా ప్రభుత్వ ధ్యేయాలను నేను తీవ్రంగా సంశయించేవాణ్ణి. ప్రపంచ వ్యవహారాలలో నా శ్రద్ధాసక్తులు ప్రారంభమైన నాటి నుంచీ అమెరికా విదేశాంగ విధానం దురహంకారం, నయవంచనల మిశ్రమంగానే ఉంటోన్నది. అయితే అమెరికా విశ్వవిద్యాలయాలు పూర్తిగా మరో విషయం. అవి మానవత్వానికి అలంకారాలు. మానవతా ప్రదీప్త జ్ఞాన మందిరాలు. వాటిపై ప్రేరేపిత, వివేక రహిత దాడులపట్ల సమస్త దేశాల ఆలోచనాపరులు అందరూ ఆవేదన చెందాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

మే 31, తెలంగాణ

ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల్లో జర్నలిస్టులు పాల్గొనడం అంత సులభం కాదు. నిష్పాక్షికత, తటస్థత, రెండు ప్రాంతాలు, ఒక భాషా రాష్ట్రంగా ఉన్నప్పుడు ఎటూ మొగ్గుచూపకుండా ఉండాలనేదే మీడియా సూత్రం. ప్రాంతీయ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర సంక్లిష్టమైనది. స్వంత అస్తిత్వపు తండ్లాట. జర్నలిస్టు మౌలికసూత్రాల పేరిట చెలామణిలో ఉన్న ఆధిపత్య భావజాలపు అనుకూలతల మధ్య ఒక జర్నలిస్టు బహిరంగంగా ఉద్యమంలో పాల్గొనడం అంటే కత్తిమీద సామే. తెలంగాణ ఉద్యమంలో ఈ కత్తిమీద సాము చేసినవారు, కలం కవాతులు నడిపినవారు తెలంగాణ జర్నలిస్టులు. మీడియా అంతా తమ చేతుల్లో లేకున్నా, తెలంగాణ భావనలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉన్నా, ఉద్యోగాలకు ముప్పు ఉందని తెలిసీ ఒక తెగువతో ఉద్యమించింది తెలంగాణ జర్నలిస్టులు. మే 31, 2001న తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ ఏర్పాటుచేసి తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొని ఒక చరిత్రను సృష్టించింది తెలంగాణ జర్నలిస్టులు. క్రియాశీలక పోరాటంలో 2001 తెలంగాణ సాధన దాకా ఒకే గొంతుకగా 'తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు' అని నిలబడడం ఒక చరిత్ర. ఏటికి ఎదురేగిన ఈ తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ ఉద్యమానికి ఇప్పుడు 25 సంవత్సరాలు. ఈ అపురూప ఘడియలకు జేజేలు.

సామాజిక రాజకీయ మార్పులకు జర్నలిజం ఒక పరికరం. ఒక ఉత్ప్రేరకం. ఉద్యమం చుట్టూ, భావజాలవ్యాప్తిని, రక్షణ కవచాలను నిర్మించి ఉత్థానస్థితిలో నిలపగలవాళ్లు జర్నలిస్టులే. తెలంగాణ అస్తిత్వ ఔన్నత్యాన్ని, ప్రత్యేకతలను, ఆర్థిక దోపిడి, వివక్ష, అంతర్గత వలస పెత్తందారీతనాన్ని ఎత్తిచూపి తెలంగాణ ఉద్యమం ఎంత న్యాయబద్ధమైనదో తెలంగాణ జర్నలిస్టులు ఒక అభిప్రాయాన్ని సృష్టించగలిగారు. నిధులు, నీళ్లు, నియామకాల అన్యాయాలను తమ రాతల్లో ప్రతిష్ఠించగలిగారు. ఆ రకంగా ఉద్యమ భావజాలవ్యాప్తిలో గొప్ప పాత్ర నిర్వహించారు.

అప్పటికే పాతుకుపోయిన యూనియన్లన్నింటికీ అతీతంగా, తెలంగాణ కోసం మాత్రమే కొట్లాడే విశాల భావనతో ఈ వేదిక ఏర్పాటయింది. పిడికెడు మంది జర్నలిస్టులతో ప్రారంభమై, 2014 వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పదివేల మంది జర్నలిస్టు జాతరగా ఎదిగింది. గ్రామీణ ప్రాంతాల విలేకరుల నుంచి, హైదరాబాద్ సంపాదకుల దాకా ఈ తెలంగాణ జర్నలిస్టు ఉద్యమంలో భాగస్వాములయ్యారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ పాల్గొనని వేదిక లేదు, పాల్గొనని ఊరేగింపు లేదు. అన్ని జేఏసీలు, అన్ని వేదికలు, అన్ని రాజకీయ పార్టీలు ఒకే గొంతుకగా జర్నలిస్టు ఉద్యమం నడిచింది.



తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ ఏర్పడే నాటికి పరిస్థితులు పరిపక్వమై ఉన్నాయి. ఇంకొక ప్రయత్నం చేస్తే తెలంగాణ తథ్యం అనే వాతావరణం ఉండేది. అందుకే ఒక చిన్న కరపత్రంలో 'ఔర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా' అనే ఘోషతో అది ప్రారంభమయింది. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో అదొక నినాదం అయింది.

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమైనది. విద్యార్థుల ఐక్యతకు, నిర్బంధం వచ్చినప్పుడు వారి వెంట ధైర్యాన్ని నింపుతూ క్యాంపస్‌ల్లో కవాతులు నడిపించింది జర్నలిస్టులే. అదొక చరిత్ర. అదొక పోరాట ఔన్నత్యం. అదొక పోరాట ప్రతీక. అందుకే ఫోరమ్ ఏర్పడినప్పుడు తెలంగాణ జర్నలిస్టుల రాతలతో మే, 31 తెలంగాణ పుస్తకం తెచ్చాము. తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ ఏర్పడే నాటికి పరిస్థితులు పరిపక్వమై ఉన్నాయి. ఇంకొక ప్రయత్నం చేస్తే తెలంగాణ తథ్యం అనే వాతావరణం ఉండేది. అందుకే ఒక చిన్న కరపత్రంలో 'ఔర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా' అనే ఘోషతో అది ప్రారంభమయింది. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో అదొక నినాదం అయింది.

ఇక తెలంగాణ చల్లబడింది అన్నప్పుడు, రాజకీయ పార్టీలు, ఉద్యమ సంస్థలు, జేఏసీల మధ్య విభేదాలు పొడసూపినప్పుడు జర్నలిస్టు ఫోరమ్ జోక్యం చేసుకొన్నది. కేసీఆర్, గద్దర్ మధ్య అలాయ్ బలాయ్ చేయించింది. కాంగ్రెస్, టీఆర్ఎస్, వామపక్షాలు, బీజేపీ అభిప్రాయాలకు అన్నింటికీ ప్రాతినిధ్యం వహించింది. నిర్బంధ వాతావరణంలో జర్నలిస్టులు ఉస్మానియా క్యాంపస్‌లో ఎంతో దన్నుగా రక్షణ కవచంగా నిలబడ్డారు. సింగరేణి కార్మిక ప్రాంతంలో నిర్బంధానికి వ్యతిరేకంగా ఒక గొప్ప యాత్ర చేపట్టి వేలాదిమందితో జర్నలిస్టుల ఫోరమ్ సమావేశాలు ఏర్పాటు చేసింది. ఉద్యోగుల సకలజనుల సమ్మెకు నైతిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. న్యాయవాదుల వెంట నడిచింది. విద్యావంతుల వేదికలో భాగస్వామ్యమైంది. గద్దర్ శాంతియాత్రలో, రసమయి ధూమ్‌ధామ్‌ల్లో మమేకం అయింది.

అసెంబ్లీలో తెలంగాణ పదం నిషేధించినప్పుడు ఆంధ్రా అసెంబ్లీ మనకెందుకు? అని ఒక మాక్ అసెంబ్లీ ఏర్పాటుచేసి తెలంగాణ ప్రజాప్రతినిధులందరినీ ఒక తాటిపైకి తెచ్చింది. హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమం మీద తీవ్ర నిర్బంధం అమలయినప్పుడు 144 సెక్షన్‌ను ధిక్కరించి అన్ని తెలంగాణ సంఘాలు, వేదికలను కలుపుకొని ఐదువేల మందితో గన్‌పార్క్ నుంచి సుందరయ్య విజ్ఞానకేంద్రం దాకా ఒక చరిత్రాత్మక ఊరేగింపు నిర్వహించింది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో అన్ని పార్టీలను కూడగట్టి ఏకాభిప్రాయ సాధన కోసం గొప్ప సమావేశాన్ని నిర్వహించింది. తెలంగాణ కోసం నిరాహారదీక్షలు చేసింది. సకల జనుల సమ్మెలో, మిలియన్ మార్చ్‌లో, చలో హైదరాబాద్‌లో అన్ని ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ రూపాల్లో ప్రత్యక్షంగా తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ పాల్గొన్నది.

తెలంగాణ ఉద్యమం గురించి ఢిల్లీలో ఒక అభిప్రాయం ఏర్పరచడానికి, తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటిగా నిలబడ్డాయని చాటడానికి తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ 'కలం కవాతు' పేరిట యాత్ర జరిపింది. దాదాపు రెండువేల మంది జర్నలిస్టులు ప్రత్యేక రైలులో వెళ్లి, ఢిల్లీ పురవీధుల్లో తెలంగాణ నినాదం వినిపించారు. పార్లమెంటు భవనం పక్కన అద్భుతమైన ఒక సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమంతో ఉన్న అన్ని పార్టీలు, సంఘాలు, మేధావులు, లాయర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, జర్నలిస్టుల ఆ సభ ఒక చరిత్ర.

అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టే ముందు రోజు అన్ని తెలంగాణ పార్టీలతో తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ ఒక హోటల్‌లో సమావేశం నిర్వహించింది. దాదాపు 56 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయిన ఈ సమావేశంలో టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ సభ్యులు పాల్గొని, బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఐక్యంగా వ్యవహరించడానికి అంగీకరించి ఆ ప్రకారమే మరుసటిరోజు అసెంబ్లీలో వ్యవహరించారు. బిల్లుకు ముందు జర్నలిస్టుల ఫోరమ్ చొరవతో జరిగిన ఈ ఘట్టం కూడా ఎక్కడా నమోదు కాలేదు. ఇదీ కీలక ఘట్టం.

14 సంవత్సరాల పాటు అప్రతిహతంగా కొనసాగిన ఈ తెలంగాణ కలంవీరుల చరిత్ర లిఖించాలి. అందుకే పాతిక సంవత్సరాల ఈ చరిత్రను తలచుకుంటూ మే 31, 2025న రజతోత్సవాల ఆరంభసభ. అందరూ హాజరుకావలసిందిగా వినతి. తెలంగాణ అమరవీరులకు వినమ్ర నివాళి. ఇటీవలే మరణించిన మా జర్నలిస్టు ఫోరమ్ తెలంగాణ ఉద్యమకారుడు మునీర్‌కు కన్నీటి నివాళి.


■ అల్లం నారాయణ
తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు

త్యాగాల తల్లి

ఉద్యమాల వీరులకు నెలవు నా తెలంగాణ
జల్ జంగల్ జమీన్ కొమురం భీముడిని
కన్ననేల నా తెలంగాణ
కాలికి గజ్జెకట్టి చేతిలో జెండాపట్టి
ఊరువాడను పల్లెపట్టణాన్ని ఏకం చేసిన
నేల నా తెలంగాణ
విద్యార్థుల ఆత్మబలిదానాల
చిరునామా నా తెలంగాణ.

బానిసత్వ సంకెళ్లను తెంచి
స్వేచ్ఛావాయువు ప్రసాదించిన రోజు
ఎతలన్ని దూరమై కన్నీళ్ళన్ని ఆవిరై
సంతోషాల నవ్వులు పూయించిన రోజు
పోరాటాల పాఠాలను
జనానికి ఎరుకజేసిన రోజు
విజయదరహాసాన్ని యావత్ తెలంగాణ
సమాజానికి తెలిపిన రోజు
త్యాగాల తల్లి సొంత రాష్ట్రమై వచ్చిన రోజు
అవతరణం అభివృద్ధి పరువులై సాగాలి
తెలంగాణ అవనిపై.

నీకోసం పెన్నులను గన్నులుగా సేసినం.
బళ్లు బందువెట్టి బతుకాగం జేసుకున్నాం.
లాఠీలకు తూటాలకు తనువంతా గాయాలు.
అందాలి యువకులకు అభివృద్ధి ఫలాలు.
సకలజనులం... సమ్మెకై
సమరశంఖాన్ని పూరించినం.
ఢిల్లీ పీఠాలను గడగడలాడించినం.
తిమిరాన్ని పోరాటాలతో చీల్చి...
పోరుబాటై వెన్నెలను కురిపించినం.
వీరుల ప్రాణత్యాగాలకు
పుట్టినిల్లు నీ నిలయం.
కళ్లతో నినుచూసి...
సంబరాలను చేసుకున్నాం.
అందరికి అభివృద్ధి ఫలాలు అందితే...
అదే మాకు గర్వకారణం.
తెలంగాణమా... అందుకో మా శుభాకాంక్షలు.



— అశోక్ గోనె


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

సహకార శాఖలో బదిలీలకు శ్రీకారం



- పీఏసీఎస్ సెక్రెటరీలు, సిబ్బందికి స్థానచలనం
- జీవో నెంబరు 44కు సవరణతో మార్గం సుగమం
- జారీ అయిన ఉత్తర్వులు.. త్వరలో మార్గదర్శకాలు
- సీడెడ్ సంఘాలకు బదిలీ నుంచి మినహాయింపు

5



పదవుల పండుగ ఆశలు నిండుగా..

- కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర
- పొలిటికల్ అఫైర్స్ కమిటీలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్‌కు చోటు
- అడ్వయిజరీ కమిటీలో సిరిసిల్ల రాజయ్యకు చాన్స్
- కీలకమైన ఐదు కమిటీల్లో మంత్రి కొండా సురేఖకు దక్కని అవకాశం
- టీపీసీసీ నూతన కమిటీలో చోటు కోసం ఆశావహుల ప్రయత్నాలు
- వర్కింగ్ ప్రెసిడెంట్ కోసం ఎమ్మెల్యే నాయిని.. మంత్రి పదవికి దొంతి లాబీయింగ్
- అనుబంధ సంఘాలు, నామినేటెడ్ పదవుల కోసం మరికొందరి ప్రయత్నాలు
- పదవులు, మంత్రివర్గ విస్తరణతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

'హస్తం'లో ఆశారేఖలు విచ్చుకుంటున్నాయి. అధికార పార్టీలో పదవుల సంరంభం ఊపందుకుంటోంది. మంత్రివర్గ విస్తరణతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అన్ని కమిటీలను ప్రకటించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తుండటంతో నాయకత్వ శ్రేణులు ఆశల పల్లకీలో ఊరేగుతున్నాయి. కలల్లో తేలియాడుతున్నాయి. గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. పార్టీలో అత్యంత కీలకంగా భావించే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)లో ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి సీతక్కతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌కు, అడ్వయిజరీ కమిటీలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు అవకాశం కల్పించారు. ఇక టీపీసీసీ కార్యవర్గాన్ని కూడా ప్రకటించనున్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశిస్తుండగా, మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి లాబీయింగ్ చేస్తున్నారు.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర మొదలైంది. మంత్రివర్గ విసరణతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అన్ని కమిటీలను ప్రకటించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నేతలు కీలక పదవులపై దృష్టిసారించారు. ఇప్పటికే పలు కీలక కమిటీలను అధిష్టానం ప్రకటించగా, వాటిలో ఏ పదవి కూడా మంత్రి కొండా సురేఖకు దక్కకపోవటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇక టీపీసీసీ కార్యవర్గాన్ని కూడా ప్రకటించనున్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశిస్తుండగా, మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి లాబీయింగ్ చేస్తున్నారు. వీరితో పాటు టీపీసీసీలో ఇతర పదవులు, నామినేటెడ్, డీసీసీ పదవుల కోసం నేతల అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు.

కీలక కమిటీల్లో ముగ్గురు

కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల్లో ఓరుగల్లు నేతలకు చోటు దక్కింది. పార్టీలో అత్యంత కీలక కమిటీగా భావించే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)లో 22మందిని ప్రకటించగా, అందులో ఓరుగల్లుకు చెందిన ఇద్దరికి అవకాశం కల్పించారు. రాజకీయ వ్యవహారాల కమిటీలో మంత్రి సీతక్కతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌కు అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఇద్దరు ఎస్టీలకు పీఏసీలో చోటు దక్కించటం చర్చనీయాంశంగా మారింది. మొదటి నుంచి ఎంపీ బలరాం నాయక్‌కు టీపీసీసీలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కుతుందనే ప్రచారం జరిగింది. అయితే అనుహ్యంగా బలరాంనాయక్‌ను పీఏసీలోకి తీసుకోవటంతో మానుకోట నుంచి మరొకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉందనే చర్చ జరుగుతోంది.

సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ పెద్దల సానుకూలత ఉండటంతో పీఏసీలో మంత్రి సీతక్కకు చోటు దక్కిందని, ఆదివాసీ మహిళ కావటం కూడా కలిసి వచ్చిందనే టాక్ ఉంది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడకు చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కూడా పీఏసీలో స్థానం దక్కింది. హుస్నాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సైతం పీఏసీలో సభ్యుడిగా చోటు దక్కింది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ మంత్రి కొండా సురేఖను కాదని సీతక్కకు పీఏసీలో చోటు

మిగతా 5వ పేజీలో...

'వర్కింగ్' కోసం నాయిని.. మంత్రి పదవికి దొంతి..





కాంగ్రెస్ అధిష్ఠానం ఐదు కీలక కమిటీలను ప్రకటించిన నేపథ్యంలో అందరి దృష్టి టీపీసీసీ పదవులపై పడింది. ప్రధానంగా టీపీసీసీలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పాతికేళ్లకు పైగా తన రాజకీయ జీవితంలో పార్టీని వీడకుండా అనేక త్యాగాలు చేశానని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయ వ్యవహారాల కమిటీలో వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా సభ్యుడే కావటంతో ఈ పదవిపై నాయిని నజర్ వేశారనే చర్చ జరుగుతోంది. అయితే రాజేందర్‌రెడ్డిపై అధిష్ఠానం సానుకూలత ఉన్నప్పటికీ కుల సమీకరణల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కుతుందా అనే చర్చ జరుగుతోంది. ఇక మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌కు మొదటి నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారనే ప్రచారం జరిగింది. అయితే పీఏసీలో స్థానం దక్కటంతో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌కు అవకాశం కల్పిస్తారనే చర్చ జరుగుతున్నప్పటికీ, నామినేటెడ్ పదవులు ఉన్న వారికి పదవులు ఉండవని ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఇటీవల స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఎవరిని వరిస్తుందో అనే ఉత్కంఠ కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొంది. ఇక మంత్రివర్గ విస్తరణలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం దొంతికి పదవి ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే కుల సమీకరణలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డితో దొంతికి ఉన్న విభేదాల కారణంగా మంత్రి పదవి వచ్చేనా అనే చర్చ జరుగుతోంది.

దుబాయికి పేరిణి బృందం



దుబాయికి వెళుతున్న పేరిణి కళాకారులు

హనుమకొండ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జూన్ 2న దుబాయిలో ప్రదర్శన ఇచ్చేందుకు వరంగల్ నుంచి ప్రముఖ పేరిణి నాట్యాచార్యుడు గజ్జెల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో బృందం శుక్రవారం బయలుదేరి వెళ్లింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖపక్షాన అబుదాబిలోని ఎంబసీ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో పేరిణి ప్రదర్శన ఏర్పాటు చేశారు. రంజిత్ కుమార్ నాయకత్వంలో ధరావత్ రాజ్‌కుమార్‌నాయక్, పెరుమాండ్ల సంతోష్, తోట ప్రశాంత్, తదితర కళాకారులు పేరిణి ప్రదర్శనలో పాల్గొననున్నారు. పేరిణితోపాటు తెలంగాణ కళారూపాలైన గుస్సాడి నృత్యం, డప్పు నృత్యం, పోతరాజు నృత్యాలు ప్రదర్శింపజేస్తున్నట్లు సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తెలిపారు.





ప్రజా కవి కాళోజీ సినిమా పోస్టర్, దర్శకుడు ప్రభాకర్ జైనీ

మెరిసిన 'కాళోజీ'

గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు కైవసం

హనుమకొండ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు చలన చిత్రాలకు ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో 'ప్రజాకవి కాళోజీ' సినిమాకు స్పెషల్ జ్యూరీ అవార్డు దక్కింది. జైనీ క్రియేషన్స్ బ్యానర్‌పై విజయలక్ష్మి నిర్మాతగా, వరంగల్‌కు చెందిన ప్రభాకర్ జైనీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఈ సినిమాను రూపొందించారు. ఈ సినిమా గతంలో 8 ఫిలిం అవార్డులను కూడా అందుకుంది. కాళోజీ వాస్తవ జీవితాన్ని ప్రతిబింబిస్తూ రూపొందిన ఈ సినిమా విడుదలకు ముందే అనేక ప్రశంసలు అందుకుందని దర్శకుడు ప్రభాకర్‌జైనీ చెప్పారు. ఈ సినిమాకు గత సంవత్సరం దాసరి ఫిలిం అవార్డుతోపాటు 12వ ఇండియన్ ఫిలిం ఫెస్టివల్ అత్యుత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా అవార్డు అందుకున్నామన్నారు. అంతేకాక అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు అవార్డులు అందజేశాయన్నారు. తెలుగు చలనచిత్రాల దర్శకుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో కూడా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తాజాగా గద్దర్ అవార్డు కూడా రావడం ప్రజాకవి కాళోజీకి దక్కిన అపూర్వ గౌరవంగా చిత్ర నిర్మాత విజయలక్ష్మి, దర్శకుడు ప్రభాకర్ జైనీ చెప్పారు. వరంగల్ వాసిగా ప్రజాకవి సినిమా నిర్మాణం తన కల అని, దాన్ని రూపొందించిన క్రమంలో వరుసగా అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు.

నగరంలో 'ఉగ్ర' కలకలం

పలుచోట్ల ఎన్ఐఏ బృందాల తనిఖీలు



- వరంగల్‌కు చెందిన పరహాన్‌కు లింకులు ఉన్నాయనే అనుమానంతో సోదాలు
- సోషల్ మీడియా గ్రూపులో చాట్ చేసినట్లుగా గుర్తింపు
- పరహాన్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- ఆలస్యంగా వెలుగులోకి..

వరంగల్, మే 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో ఉగ్రవాదులు పేలుళ్లకు కుట్రలు చేస్తున్నారనే సమాచారంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వరంగల్ నగరంలో పలు చోట్ల సోదాలు నిర్వహించింది. విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లు 20మందితో సోషల్ మీడియాలో ఓ గ్రూపు ఏర్పాటు చేసినట్లుగా ఎన్ఐఏ గుర్తించింది. సౌదీలో ఉంటున్న అబూముసబ్‌తో వీరు కాంటాక్టులో ఉన్నట్లుగా గుర్తించారు. వీరంతా సోషల్ మీడియా గ్రూపులో తరుచూ మాట్లాడుకోవటం, చాట్ చేయడం చేసేవారు. ఈ క్రమంలోనే వీరికి పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధం ఉన్న అబూముసబ్‌తో పరిచయం ఏర్పడినట్లుగా గుర్తించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే సిరాజ్, సమీర్‌లు హైదరాబాద్, విజయనగరం, ఢిల్లీ, బెంగుళూరు, ముంబైల్లో ఉగ్ర కుట్రల కోసం రెక్కీ నిర్వహించినట్లుగా ఎన్ఐఏ బృందం గుర్తించింది. దీంతో రంగంలోకి దిగిన ఎన్ఐఏ.. విజయనగరానికి చెందిన సిరాజ్‌ను ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. సిరాజ్‌ను విచారించే క్రమంలో సోషల్ మీడియా గ్రూపులో వరంగల్‌కు చెందిన పరహాన్ సభ్యుడిగా ఉన్నట్లుగా ఎన్ఐఏ బృందం దృష్టికి వచ్చింది. దీంతో వారంరోజులుగా హైదరాబాద్, వరంగల్‌లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడిగా ఉన్న విజయనగరానికి చెందిన

మిగతా 6వ పేజీలో...

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



కవాతులో పాల్గొన్న సీపీ, డీసీపీ, ఏసీపీలు, సీఐలు

వరంగల్ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు చేసింది. హనుమకొండ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కవాతాను సీపీ సన్‌ప్రీత్ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వారం రోజుల పాటు కవాతు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఎలాంటి మత ఘర్షణలు, అల్లర్లు తలెత్తినా తక్షణమే స్పందించి స్థానిక పోలీసులకు సహకారం అందిస్తూ ప్రజలకు శాంతి భద్రతలపై నమ్మకం కల్పించడమే కవాతు లక్ష్యమన్నారు. హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రారంభమైన కవాతు బ్రహ్మణవాడ, అలంకార్ జంక్షన్, హనుమకొండ చౌరస్తా మీదుగా అశోక జంక్షన్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఆర్.ఏ.ఎఫ్ డిప్యూటి కమాండెంట్ సరస్వతి, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్‌పెక్టర్స్ రవికుమార్, సతీష్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐ పాఠాలకు సై..

ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో పూర్తి స్థాయిలో శ్రీకారం



వరంగల్ ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) ఆవశ్యకతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాదిలో పాఠ్యాంశాలను ప్రవేశపెట్టిన విషయం తెలిసందే. గత ఏడాది చివరలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఏఐ ఇంట్రడక్షన్, డిజిటల్ లిటరసీ పేరిట తరగతులు నిర్వహించారు. కాగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు నుంచి 9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా ఏఐ పాఠ్యాంశాలను ఒక బుక్‌లెట్‌గా రూపొందించి ప్రత్యేకంగా ఏఐ ఆధారిత విద్యా బోధన చేయనున్నారు. 5వ తరగతి వరకు గణిత పుస్తకాల్లో ఒక అధ్యాయం చేర్చనున్నారు. కంప్యూటర్లు అందుబాటులో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్యాబోధన ప్రారంభించేందుకు విద్యాశాఖ నిర్ణయించి అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు బెంగుళూరుకు చెందిన ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో గత విద్యా సంవత్సరం చివరలో ఏఐ ఆధారిత విద్యా బోధన విద్యాశాఖ ప్రారంభించింది. ఏఐని పరిచయం చేస్తూ డిజిట్ లిటరసీ పేరుతో ప్రతీ తరగతిలో ఒక పాఠాన్ని చేర్చారు. కంప్యూటర్ పరిచయంతో ప్రారంభించి చిన్న, చిన్న అంశాలకు కోడింగ్ రాసే విధానాన్ని నేర్చుకునే వరకు ఉన్నాయి. చాట్‌బాట్, అలెక్సా, గూగుల్ అసిస్టెంట్ తదితర యాప్ అంశాలున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఏఐ ఆధారిత బోధనను విద్యాశాఖ ప్రత్యేకంగా ప్రారంభించనుంది. ప్రత్యేకంగా ఏఐ పాఠ్యాంశాలను బుక్‌లెట్ రూపంలో ముద్రించి విద్యార్థులకు అందజేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ పరీక్షల విభాగంలో ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు ముద్రితం అవుతున్నాయి. కంప్యూటర్ పరిచయంతో ప్రారంభమయ్యే ఏఐ ఆధారిత పాఠ్యాంశాలు చిన్న, చిన్న అంశాలకు కోడిండ్ రాసే విధానాన్ని నేర్చుకునే అంశాలను ఈ పుస్తకాల్లో పొందుపరచనున్నారు. రాష్ట్రంలో 50 మందికి మించి ఉన్న ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులకు సంఖ్యకు అనగుణంగా కంప్యూటర్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే చాలా వరకు ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్లు ఉంటడంతో వాటి పనితీరును సరిచేయాలని కంప్యూటర్లు ఉన్న పాఠశాలల్లో అన్ని కంప్యూటర్లను పనిచేసే విధంగా సరిచేసి ఏఐ ఆధారిత విద్యాబోధనను అమలు చేయనున్నన్నారు. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది ఎంపిక చేసిన పాఠశాలల్లో రెండు విడతల్లో ఏఐ ఆధారిత విద్యాబోధనను విద్యాశాఖ ప్రారంభించింది. మొదటి విడతలో ఇంగ్లీష్, మ్యాథ్స్‌లో ఏఐ ఆధారిత బోధన నిర్వహించగా, రెండవ విడతలో స్లో లెర్నర్స్ కోసం ప్రత్యేకమైన ఏఐ ఆధారిత విద్యాబోధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా పేరు	ఏఐ పాఠ్యాంశాల బోధన జరిగిన పాఠశాలలు
వరంగల్	16
హనుమకొండ	14
జనగామ	18
మహబూబాబాద్	12
జయశంకర్ భూపాలపల్లి	06
ములుగు	06

కోర్టు స్టే వల్ల పదోన్నతులు ఇవ్వలేదు..

ఎన్పీడీసీఎల్ సీఈ వివరణ ● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

హనుమకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల వల్లనే ఏఈ, డీఈ పదోన్నతులు ఇవ్వలేకపోయినట్టు ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ (హెచ్ఆర్డీ) టి.మధుసూదన్ వివరణ ఇచ్చారు. 'ఖాళీలున్నా కానీ భర్తీ' పేరుతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఏడీఈల సీనియారిటీ లిస్టు ఖరారు చేసి డీఈ ప్రమోషన్లు ఇచ్చే సమయానికి గత ఏప్రిల్ 28న కోర్టు స్టే ఆర్డర్ వచ్చిందని, దీనివల్ల ఏడీఈ నుంచి డీఈ, అలాగే ఏఈ నుంచి ఏడీఈ ప్రమోషన్లు ఆగిపోయాయని తెలిపారు. సీనియారిటీ ఖరారుపై కోర్టు కేసు ఉన్నందున ఏఈ నుంచి ఏడీఈ ప్రమోషన్లు కేస్ బై కేస్ ఇవ్వడానికి వీలుకాక మొత్తం బ్యాచ్‌కు ఒకేసారి ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఏడీఈ నుంచి డీఈ ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే ఏఈ నుంచి ఏడీఈ ప్రమోషన్లు ఇవ్వడం వీలవుతుందని పేర్కొన్నారు. కోర్టు స్టే ఎత్తివేతకు డిపార్టుమెంట్ న్యాయపరమైన చర్యలు చేపడుతుందన్నారు.

డబ్బుల వివాదంలో గొడవ - వ్యక్తిపై దాడి

హనుమకొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ ముందు డబ్బుల వివాదంలో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఈ ఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండలోని కంచరకుంటకు చెందిన హజియా హజిమొద్దీన్‌కు, వరంగల్‌లోని మండిబజార్‌కు చెందిన సుభాన్, ఆరిఫ్, సుబేదారికి చెందిన అబుద్దుల్లాలకు మధ్య డబ్బుల వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో హరిత కాకతీయ హోటల్ వద్ద హజియా హజిమొద్దీన్‌కు, ఇతర వ్యక్తులకు మాటామాట పెరిగి తోపులాట జరిగింది. ఈ తోపులాటలో హజియా హజిమొద్దీన్ కింద పడిపోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణలో హజియా హజిమొద్దీన్‌పై సుభాన్, ఆరీఫ్ దాడిచేశారని సుబేదారి పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, ఈ విషయంపై సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా హజియా హజిమొద్దీన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు శాస్త్రీయ జానపద కళా ప్రదర్శనలు

వడ్డెపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో చేయూత వెల్ఫేర్ సొసైటీ భూపాలపల్లి చైర్ పర్సన్ ధరావత్ శాంతి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శాస్త్రీయ జానపద కళా ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు రోజా క్రియేషన్స్ డైరెక్టర్స్ ఆలేటి శ్యామ్ సుందర్, సినిమా ఆటోగ్రాఫర్ ఆనెం వెంకట్, నటుడు అజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాకతీయ కళా మహోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ కళా అవార్డును ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

డీసీపీ జనార్దన్ సేవలు అభినందనీయం


జనార్దన్‌ను సత్కరిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): డీసీపీ జనార్దన్ సేవలు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా విధులు నిర్వర్తించి శనివారం ఉద్యోగ విరమణ చేయబోతున్న జనార్దన్‌ను సీపీ జ్ఞాపికతో సత్కరించారు. ఎస్సై నుంచి డీసీపీ స్థాయికి ఎదిగి ఎన్నో క్లిష్టమైన కేసులను పరిష్కరించిన డీసీపీ జనార్దన్‌ను పోలీసులు ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా సీపీ అన్నారు.

అల్లు అర్జున్ అవార్డును రద్దు చేయాలి..

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యాశాయంపేట, మే30(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమాలో స్మగ్లర్ పాత్ర పోషించిన అల్లు అర్జున్‌కు ఇచ్చిన గద్దర్ అవార్డు, రజాకార్ సినిమాకు ఇచ్చిన అవార్డును రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిందన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, జమీందార్లకు వ్యతిరేకంగా సాగిందని, అయితే ఇది హిందువులకు, ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూ తీసిన రజాకర్ సినిమాకు ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు రావడం సిగ్గుచేటన్నారు. సాయుధపోరాటాన్ని వక్రీకరిస్తూ తీసిన సినిమాలకు ప్రభుత్వం ఉత్తమ సినిమా అవార్డులను ఇవ్వడం అమరవీరులను అవమానపరచడమే అన్నారు. అలాగే సమాజంలో విషసంస్కృతిని పెంచి పోషించే విధంగా ఎర్రచందనం స్మగ్లర్ పాత్రలో నటించిన అల్లుఅర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు ఇవ్వడం సరికాదని, ఇలాంటి పాత్రలకు గద్దర్ పేరుతో అవార్డు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఏం సందేశం ఇస్తుందని ప్రశ్నించారు. వెంటనే ఈ సినిమాలకు అవార్డుల ప్రకటనను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు మోతె లింగారెడ్డి, మండ సదాలక్ష్మీ, మార్క శంకర్‌నారాయణ, మద్దెల ఎల్లేష్, మంచాల రమాదేవి, కొట్టెపాక రవితోపాటు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రిలో కేస్‌షీట్ మాయం

బాలింత బంధువుల ఆందోళన

గిర్మాజిపేట,మే30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శుక్రవారం బాలింత కేస్‌షీట్ మాయమైంది. దీంతో ఆమె బంధువుల ఆందోళనకు దిగారు. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కాగా, బాలింత ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఆస్పత్రి అధికారులు భరోసా ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే..

వరంగల్ లేబర్‌కాలనీ ప్రాంతానికి చెందిన నజీయా బేగమ్ ప్రసవం కోసం గత ఆదివారం రాత్రి సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేరింది. సీజేరియన్ చేయగా మూడు కిలోల బరువున్న మగ శిశువును ప్రసవించింది. అయితే రెండు రోజుల తరువాత నజీయా బేగం కడుపు ఉబ్బడంతో ఎంజీఎం నుంచి వచ్చిన ఓ సర్జన్ డాక్టర్ బాలింతకు వివిధ పరీక్షలు నిర్వహించి అబ్డామిన్ సిటి స్కాన్ కోసం ఎంజీఎంకు రిఫర్ చేశారు. శుక్రవారం ఉదయం ఆమెను ఎంజీఎంకు తరలిస్తున్న సమయంలో కేస్ షీట్ కనిపించలేదు. దీంతో ఆస్పత్రి రికార్డుల ప్రకారం మరో కేస్ షీట్ తయారు చేసి ఎంజీఎంకు తీసుకెళ్లి అబ్డామిన్ సీటీ స్కాన్ చేయించి తీసుకువచ్చారు. అయితే కేస్‌షీట్ మిస్ అయిందనే విషయం తెలియడంతో నజీయాబేగం భర్త,బంధువులు ఆస్పత్రికి చేరుకుని ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్ఎంవో డాక్టర్ మురళి వచ్చి ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సర్దిచెప్పారు. అయినా ఈ విషయంలో విచారణ చేస్తున్నామన్నారు. ఈలోపు ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాలింత కుటుంబసభ్యులు, ఆర్ఎంవోతో చర్చించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ విషయంలో బాలింత కుటుంబసభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు వెళ్లిపోయారు. దీంతో ఆందోళన సద్దుమనిగింది.


సీకేఎం ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న బాలింత బంధువులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మడికొండ, మే 30(ఆంధ్రజ్యోతి): మడికొండలో డ్రెయినేజీలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం స్థానిక వినాయక నగర్ వద్ద డ్రైయినేజీలో వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ ఎస్సై రాజ్‌కుమార్ పెగడ, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలం వద్దకు చేరుకొని పరిశీలించారు. మృతుడు సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగి 5.3 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు, కుడి చేతిపై అమ్మ అనే పచ్చ బొట్టు కలిగి ఉన్నాడు, అలాగే నుదుటన, గొంతు వద్ద హనుమాన్ బొట్టు పెట్టుకొని, బూడిదరంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. స్థానికులు దువ్వ నవీన్, బైరి లింగమూర్తి సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 85009, 87126 85123, 87126 85248 నెంబర్లకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

అదనపు డీసీపీగా ప్రభాకర్‌రావు బాధ్యతలు



వరంగల్ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగం అదనపు డీసీపీగా రాయల ప్రభాకర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మార్కెట్ వేలం పాటల సమయాల్లో మార్పులు

వరంగల్ వ్యవసాయం, మే30(ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పంట వేలం పాటల సమయాల్లో మంగళవారం నుంచి మార్పులు చేసినట్లు కార్యదర్శి గుగులోతు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 11వ తేదీ బుధవారం నుంచి యథావిధిగా ప్రతీ బుధవారం మార్కెట్లో క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు. వేలం పటల వేళల్లో మార్పులు ఈవిధంగా ఉన్నాయి. మిర్చి యార్డు ఉదయం 7.30 గంటలకు, పత్తియార్డులో ఉదయం 8.35, పల్లికాయ యార్డులో ఉదయం 8.30, పసుపు, ధాన్యం, అపరాలు ఉదయం 9.00 గంటలకు వేలం పాటలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, కార్మికులు, దడువాయిలు, వ్యాపారులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి కోరారు.

ఎన్పీడీసీఎల్‌లో లేఖ కలకలం

రాంనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లో ఓ ఇంజనీరింగ్ అధికారిపై వైరల్ అవుతున్న లేఖ కలకలం సృష్టిస్తోంది. హెల్పర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన సదరు వ్యక్తి.. అక్రమ మార్గంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా పదోన్నతి పొంది కోట్ల ఆస్తులు సంపాదించాడని, పదోన్నతితోపాటు విద్యార్హతపై విచారణ జరిపి ఏసీఎస్‌ఈబీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, అలాగే ఆస్తులపై దృష్టిసారించాలని లేఖలో సీఎండీని కోరారు. వందలాది ఆరోపణలు వచ్చిన వ్యక్తిపై సర్వీసులో ఉన్నంతకాలంలో విచారణ చేసి చర్యలు తీసుకోకుండా, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకునేంతవరకు సమయం ఇవ్వడం ఏవిటని లేఖలో ప్రశ్నించారు. కార్మికులు, ఇంజనీర్లు, కార్యాలయ సిబ్బంది పేరుతో ఈ లేఖ విడుదలైంది. సర్వీసు పూర్తి కావడానికి ఇంకా 3 నెలలు మాత్రమే ఉండగా, ఇప్పుడు స్వచ్ఛంద విరమణ పొందడంపై వారు అనేక ఆరోపణలు చేశారు.

1న గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

న్యాశాయంపేట, మే30(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్1న హనుమకొండ హంటర్‌రోడ్‌లోని గౌడ హాస్టల్ భవనంలో ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) జిల్లా గౌరవ అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల గోపా కమిటీల ఆధ్వర్యంలో ఈ పురస్కారాలు ఇస్తామని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖతో పాటు వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు హాజరవుతారన్నారు. ఉమ్మడి జిల్లాలోని గౌడ విద్యార్థులు, గౌడ కులస్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

'మా వాడలో మా రాజ్యం' ద్వారానే సబ్బండ కులాలకు రాజ్యాధికారం

సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి రాష్ట్ర నేత వెంకన్న

మహబూబాబాద్ , మే 30 (ఆంధ్రజ్యోతి) : మా వాడలో మా రాజ్యం ద్వారానే సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కుతుందని సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. ఆయన పేరిట మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి శుక్రవారం పంపిన ఒక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. ఇండియా కమ్యూనిస్టు విప్లవోద్యమ చరిత్రలో తొలిసారిగా కుల-వర్గ జంట పోరాటాన్ని ఏజెండాగా చేసి కుల, వర్గ, పోరాట నాయకుడు కామ్రేడ్ మారోజు వీరన్న కుల జనాభా దామాషా ప్రకారం సకల సామాజిక రంగాల్లో వాటా కేటాయించి సామాజిక న్యాయాన్ని, ప్రతి కులంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ సమానత్వాన్ని పాటించే సామ్యవాదాన్ని అమలు చేసినప్పుడే పీడిత ప్రజల విముక్తి జరుగుతుందనే లక్ష్యంతో ఉద్యమ నిర్మాణం చేపట్టాడని చెప్పాడు. అందుకు గాను సార్వ జనీన విముక్తి సిద్ధాంతమైన మార్క్సిజంలెనినిజం-మావోసిద్ధాంతాన్ని ఈ దేశ సామాజిక వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి సామాజిక విప్లవకారులు పూలే, అంబేద్కర్ ఆలోచనలతో జోడించి అభివృద్ధి పరిచారని చెప్పారు. ఆ సిద్ధాంత రాజకీయ లక్ష్యంలో భాగంగా ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ (సీపీయూఎస్ఐ)ని స్థాపించాడని తెలిపారు. బ్రాహ్మణీయ అగ్రకుల దోపిడి వర్గాల ఆధిపత్యాన్ని కూల్చివేసి బహుజన ప్రజా రాజ్యాన్ని స్థాపించే లక్ష్య సాధనలో భాగంగా బహుజన పీడిత ప్రజలను విముక్తి పరిచే కార్యచరణలో మారోజు వీరన్నతో పాటు గోదావరిలోయ విప్లవోద్యమ రథసారథులు, 145 మంది దళిత బహుజన విప్లవ పోరాటవీరులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని, ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన వీరులకు సీపీయూఎస్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ జోహర్లు అర్పిస్తుందని చెప్పారు. ప్రజా స్వామిక రాజ్యాధికారం కోసం ముందుకు రావాలని పిలుపునిస్తోందన్నారు. అందులో భాగంగా మే 31న ములుగులో జరిగే సీపీయూఎస్ఐ వ్యవస్థాపకులు మారోజు వీరన్నతో పాటు 145 మంది అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తండ్రిపై బెంగతో కుమారుడి మృతి

● 12 రోజుల వ్యవధిలోనే ఇద్దరి మృతి ● ముల్కనూర్‌లో విషాదం


తండ్రి రాఘవరెడ్డి (ఫైల్)


కొడుకు రమణారెడ్డి (ఫైల్)

భీమదేవరపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై బెంగతో ఓ దివ్యాంగ కుమారుడు మృతి చెందాడు. 12 రోజుల కిందట తండ్రి మృతి చెందగా, ఆయనపై బెంగతో దివ్యాంగుడైన కుమారుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన పిన్నింటి రాఘవరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు విజేందర్‌రెడ్డి వ్యవసాయ పనులు చేస్తుండగా, చిన్న కుమారుడు రమణారెడ్డి (48) దివ్యాంగుడైన అంధుడు. కూతురికి వివాహం జరిగింది. 25 ఏళ్ల కిందట రాఘవరెడ్డి సతీమణి కన్నుమూసింది. అప్పటి నుంచి అంధుడైన చిన్న కుమారుడు రమణారెడ్డి ఆలనపాలన తండ్రి రాఘవరెడ్డి చూసుకునేవారు. దీంతోపాటు పెద్దకుమారుడు విజేందర్‌రెడ్డి, ఆయన భార్య సైతం రమణారెడ్డి బాగోగులు చూసేవారు. ఎప్పుడు తండ్రితో చనువుగా ఉండే రమణారెడ్డి.. తన కష్ట సుఖాలను తండ్రి రాఘవరెడ్డికి చెప్పుకునేవాడు. వృద్ధాప్యం మీద పడి అనారోగ్య సమస్యలతో రాఘవరెడ్డి 12 రోజుల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి తండ్రిపై దిగాలుగా ఉన్న రమణారెడ్డి.. తండ్రిని కలవరిస్తూ కలత చెంది మనోవేదనకు గురయ్యాడు. బుధవారం తండ్రి రాఘవరెడ్డి దశదిన కర్మ నిర్వహించారు. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో రమణారెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గురువారం తండ్రి రాఘవరెడ్డిని గుర్తుచేసుకుంటూ పలుమార్లు రమణారెడ్డి కంటతడి పెట్టాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం రమణారెడ్డి నిద్రలోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. 12 రోజుల వ్యవధిలో తండ్రి, కొడుకులు మృతి చెందడంతో ముల్కనూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలి..


ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న మున్నంగి నాగరాజు, మంద కుమార్ మాదిగ

వడ్డెపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డును అందుకొని మొదటి సారి నగరానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు, జాతీయ నేత మంద కుమార్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్‌మాదిగ మాట్లాడారు. 30 ఏళ్లుగా మాదిగ జాతి కోసం, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సుదీర్ఘంగా మంద కృష్ణ మాదిగ చేస్తున్న ఉద్యమానికి, పోరాట పటిమకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం అత్యుత్తమైన పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసిందని అన్నారు. ఈ అవార్డును స్వీకరించి తొలిసారిగా తన పురిటి గడ్డ అయిన వరంగల్‌కు శనివారం సాయంత్రం 5 గంటలకు వస్తున్నారని అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రం వరకు మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీతో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కాళోజీ కళా క్షేత్రంలో జరిగే మంద కృష్ణ మాదిగ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ, రాష్ట్ర నేతలు బొడ్డు దయాకర్, వైకే విశ్వనాథ్, బొర్ర భిక్షపతి, నరేంద్రబాబు, పుట్ట రవి, కొయ్యడ మల్లేష్, మంద రాజు, జన్ను దినేష్, గద్దల సుకుమార్, బండారి సురేందర్, చాతళ్ల శివ, కందికట్ల విజయ్ మాదిగలు పాల్గొన్నారు.

సైక్లింగ్‌లో హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్ ప్రతిభ

16 వేల కిలోమీటర్లు పూర్తి



మడికొండ, మే 30(ఆంధ్రజ్యోతి): మడికొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుండబత్తిని జయరాజు సైక్లింగ్‌లో మరో మైలురాయి దాటాడు. వృత్తిరిత్యా హెడ్ కానిస్టేబుల్ అయినప్పటికీ ప్రవృత్తిరిత్యా నిత్యం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. అలాగే సైక్లింగ్ పోటీలలో పాల్గొని అనేక బహుమతులు గెలుచుకున్నాడు. నాలుగేళ్లుగా ప్రతీరోజూ 30 నుంచి 40 కిలోమీటర్లు సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యం పట్ల సందేశం ఇస్తున్నాడు. శుక్రవారం నాటికి సైక్లింగ్‌లో 16 వేల కిలోమీటర్లు పూర్తి చేసి యువతరానికి స్ఫూర్తిగా నిలిచాడు. ఈ సందర్భంగా జయరాజును పోలీసు అధికారులతోపాటు పలువురు అభినందించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

హనుమకొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజినల్ పరిధిలో ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది మెరుగైన సేవలందించాలని కరీంనగర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలామన్ అన్నారు. శుక్రవారం వరంగల్-1, హనుమకొండ ఆర్టీసీ డిపోలను ఈడీ తనిఖీ చేసి సిబ్బందికి, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ సోలామన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ డిపోలలో ఆదాయం పెంచేందుకు చర్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డిపోలలోని టిమ్మూ డ్యూటీ చేస్తున్న డ్రైవర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లను సన్మానించి అభినందనలు తెలిపారు. పలురూట్లల్లో బస్సు సర్వీసుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హనుమకొండ డిపోలో 20 మంది అధికారులతో ఒక టీం ఏర్పాటు చేసి ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు పనిచేయాలని కోరారు. అనంతరం ఈడీ సోలామన్‌ను ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, వరంగల్-1 డిపో మేనేజర్ అర్పిత, హనుమకొండ డిపో మేనేజర్ ధరంసింగ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఈడీ సోలామన్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎంలు

సహకార శాఖలో బదిలీలకు శ్రీకారం

పీఏసీఎస్ సెక్రెటరీలు, సిబ్బందికి స్థానచలనం



హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

- జీవో నెంబరు 44కు సవరణతో మార్గం సుగమం
- జారీ అయిన ఉత్తర్వులు.. త్వరలో మార్గదర్శకాలు
- సీడెడ్ సంఘాలకు బదిలీ నుంచి మినహాయింపు

హనుమకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సహకార వ్యవస్థ ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా చేపడుతున్న ఈ బదిలీలకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ప్రాథమికంగా జీవో 44కు సవరణ తీసుకువచ్చింది. బదిలీలకు త్వరలో మార్గదర్శకాలు జారీ కానున్నాయి. బదిలీల ప్రక్రియలో భాగంగా పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న కార్యదర్శులు, ఇతర సిబ్బంది డేటా, సర్వీసు ఇతర వివరాలు ఈనెల 20 నాటికే ప్రధాన కార్యాలయానికి చేరినట్టు సమాచారం. కనీసం 3నుంచి 5 ఏళ్ల వరకు ఒకే సంఘంలో విధులు నిర్వహిస్తున్న వారిని కచ్చితంగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొన్నది. కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరుగుతాయి.

డీసీసీబీ పరిధిలో..

సహకార సంఘాల ఉద్యోగులను ఎలా బదిలీ చేయాలనే విషయంలో ప్రభుత్వం ఇప్పటికే స్పష్టతకు వచ్చింది. మొదట్లో అంతర్‌జిల్లాల వారీగా బదిలీ చేపట్టాలని భావించింది. అయితే కొన్ని జిల్లాలు పెద్దవిగా, కొన్ని చిన్నవిగా ఉన్నాయి. చిన్న జిల్లాల్లో పీఏసీఎస్‌లు మరీ తక్కువగా ఉన్నాయి. దీంతో బదిలీలు కష్టమవుతాయని భావించిన ప్రభుత్వం.. డీసీసీబీ పరిధిలో చేయాలనే నిర్ణయానికి వచ్చింది. వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో 91 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటిలో సెక్రెటరీలతో కలుపుకొని రెండు వందలకుపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, క్లర్కులు వీరిలో ఉన్నారు. ఇతర సిబ్బంది తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. అయితే బదిలీలను ప్రభుత్వం వందశాతం చేపడుతుందా? లేక నిబంధనల ప్రకారం 40 శాతం మించకుండానే అనేది స్పష్టత లేదు. బదిలీ ప్రక్రియను నిర్వహించేందుకు ఒక కమిటీని నియమిస్తారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డీసీవో, నాబార్డు డీడీఎం, డీసీసీబీ జీఎం, డీజీఎంలు కన్వీనర్లుగా ఉంటారు. బదిలీలకు ముందు ఎవరు.. ఎక్కడికి బదిలీని కోరుకుంటున్నారో తెలుసుకునేందుకు ఐచ్ఛికాలను అడగనున్నారు.

చైర్మన్ల ఒత్తిడి

సహకార సంఘాల ఉద్యోగులను బదిలీ చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం మొదటిసారి తీసుకోవడం వెనుక పీఏసీఎస్‌ల చైర్మన్ల ఒత్తిడే కారణంగా భావిస్తున్నారు. చాలా సంఘాల్లో సెక్రెటరీలకు చైర్మన్లకు పడడం లేదు. వారిద్దరి మధ్య సయోధ్య కరువై సంఘాల పనితీరు కుంటుపడుతోంది. సెక్రెటరీలు, ఇతర ఉద్యోగులు దీర్ఘకాలంగా ఒకే చోట పాతుకుపోయి ఉండడడంతో వారు చైర్మన్లను లెక్క చేయడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో పీఏసీఎస్‌ల చైర్మన్లు.. సెక్రెటరీలు, సిబ్బందిని బదిలీ చేయాలని చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై దృష్టిపెట్టింది. సహకార సంఘాలను బలోపేతం చేయడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిచేలా చర్యలు తీసుకోవడం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జీవో 44కు సవరణ తీసుకువచ్చింది. దీనితో సహకార ఉద్యోగుల బదిలీలకు మార్గం సుగమమైంది.

సీడెడ్ సంఘాలకు మినహాయింపు?

బదిలీల నుంచి సీడెడ్ సంఘాలను మినహాయించనున్నట్టు తెలుస్తోంది. ఇవి డీసీసీబీ పరిధిలోనే ఉన్నప్పటికీ జాతీయ, వాణిజ్య బ్యాంకులకు అనుబంధంగా పనిచేస్తున్నందువల్ల వీటిని మినహాయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. డీసీసీబీ పరిధిలో దానికి అనుబంధంగా పని చేసే పీఏసీఎస్‌లు ఆ బ్యాంకు ద్వారా రుణాలను పొంది రైతులకు పంపిణీ చేస్తోందని సీడెడ్ సంఘాలు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఐవోబీ తదితర బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని రైతులకు అందచేస్తాయి. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 91 సంఘాల్లో ఈ సీడెడ్ సహకార సంఘాలు 22 వరకు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో పెగడపల్లి, వంగపహాడ్, సింగారం, పరకాల పీఏసీఎస్‌లు సీడెడ్ సంఘాలే. అంటే వాస్తవంగా డీసీసీబీకి అనుబంధంగా పని చేస్తున్న 69 పీఏసీఎస్‌ల సిబ్బంది బదిలీలే జరుగనున్నాయన్నమాట.

హర్షం

ప్రభుత్వ నిర్ణయంపై పీఏసీఎస్ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని సహకార సంఘాల్లో చాలామంది ఉద్యోగులు 20, 30 ఏళ్లగా ఒకే చోట పని చేస్తున్నారు. కొంతమంది అదే సంఘంలో చేరి అక్కడే ఉద్యోగ విరమణ పొందారు. కొందరు ఉద్యోగులు సంఘాల బలోపేతానికి కృషి చేస్తుండగా, మరికొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. సంఘాల అధ్యక్షులను గుప్పిట్లో పెట్టుకొని పెత్తనం చెలాయిస్తున్న ఉద్యోగులూ ఉన్నారు. ప్రస్తుతం 50 శాతం సంఘాలు మెరుగ్గా ఉండగా, 50శాతం సంఘాలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి ఉన్నాయి. కొంత మంది సుదీర్ఘకాలం ఒకే సంఘంలో విధులు నిర్వర్తిస్తూ ఇష్టారీతిన వ్యవహరించి సంఘాలను కోలుకోకుండా చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

భిన్నాభిప్రాయాలు

ఉద్యోగుల బదిలీపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్మినెంట్ ఉద్యోగుల్లో కార్యదర్శి వేతనం సీనియారిటీని బట్టి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఉండగా, స్టాఫ్ అసిస్టెంట్, సబ్ స్టాఫ్ ఉద్యోగులకు రూ.15వేల నుంచి రూ.25వేలతో పాటు సుమారు రూ.2వేలు హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తున్నారు. ఈవేతనంతో సొంత మండలం వీడి విధులు నిర్వహించడం కష్టమవుతుందని కిందిస్థాయి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కార్యదర్శి హోదా గలవారిని బదిలీచేసి కిందిస్థాయి వారిని మినహాయించాలని కోరుతున్నారు. సహకార శాఖలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో తక్కువ వేతనం పొందుతున్న స్టాఫ్ అసిస్టెంట్, సబ్‌స్టాఫ్‌లకు మినహాయింపు ఇవ్వాలని, ఉద్యోగులందరి బదిలీ తప్పదనుకుంటే వేతనాలు పెంచాలని కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలంటున్నారు.

దూలయ్య ఏమైనట్లు..?

- మావోయిస్టులకు ఆశ్రయం కల్పించినట్టు గుర్తించిన పోలీసులు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్రెగుట్ట అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల నుంచి తప్పించుకొని ఇద్దరు మావోయిస్టులు గొత్తికోయగూడెంలో తలదాచుకున్న విషయం తెలిసిందే. మూడు రోజుల క్రితం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాయిబంధం గొత్తికోయగూడెంలోని చోడి దూలయ్య అనే గొత్తికోయ ఇంట్లో ఇద్దరు మావోయిస్టులకు ఆశ్రయం కల్పించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ తమ సిబ్బందితో కలిసి మూడు రోజుల క్రితం ఆ గూడేన్ని చుట్టుముట్టి ఇంటింటి సోదాలు చేశారు. అనంతరం దూలయ్య ఇంట్లో తలదాచుకొని అనుమానస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. కాగా, ఆ ఇద్దరు వ్యక్తులను పోలీసులు మావోయిస్టులుగా గుర్తించారు.

ఈ నేపథ్యంలో పోలీసులు ఆశ్రయం ఇచ్చిన దూలయ్యను విచారించి, మావోయిస్టులకు ఇంట్లో ఎందుకు ఆశ్రయం కల్పించావని మందలించి, రేపు ఉదయం వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశారు. పోలీసుల మందలించిన మరుసటి రోజు ఇంట్లో నుంచి వెళ్లిన దూలయ్య ఇంటికి తిరిగి రాలేదు. మూడు రోజులుగా ఆయన ఆచూకీ తెలియకపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న తమ బంధువులకు ఫోన్ చేసి తెలుసుకున్నప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. దాంతో దూలయ్య భార్య చోడి లింగమ్మ, కుమారుడు చోడి బీమాలు, గూడెంవాసులు తీవ్ర ఆత్మీయతకు గురయ్యారు. పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారా.. లేక పోలీసుల భయంతోనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తమ స్వగ్రామానికి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై దూలయ్య భార్య చోడి లింగమ్మ కుమారుడితో కలిసి శుక్రవారం జిల్లా ఎస్పీ శబరీష్‌ను కలిసినట్లు తెలిసింది.



మొగుళ్లపల్లిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల

తరగతిగదిలోకి నో సెల్‌ఫోన్

- విద్యాశాఖ ఆదేశాలు
- ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు
- పాటించకపోతే కఠిన చర్యలు

మొగుళ్లపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడకంపై విద్యాశాఖ ఆంక్షలు విధించింది. ఇటీవల డీఈవోలతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తరగతిగదిలో సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని డీఈవోలకు సూచించారు. అయితే ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. కాగా, భూపాలపల్లి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబా బాలికలు, బాలుర గురుకులాలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలలు, మోడల్ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు మొత్తం 538 ఉన్నాయి. ఇందులో 2,171మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

భూపాలపల్లి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యాబోధనను పక్కనబెట్టి సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, రీల్స్ చూడడం, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తరగతిగదిలో సెల్‌ఫోన్లతో హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బోధన చేయకుండా బాధ్యతలు విస్మరించి విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసేలా కొందరు ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంకా కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చినప్పటి నుంచి సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యే వరకు కూడా సెల్ ఫోన్‌లోనే మునిగిపోతున్నట్లు పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో సెల్‌ఫోన్ల వాడకం పూర్తిగా నిషేధం. ప్రభుత్వ ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌లో మాట్లాడడం పట్ల తల్లిదండ్రులు వారిపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లో తరగతిగదిలోకి సెల్‌ఫోన్ పోకుండా కట్టడి చేయాలని ప్రభుత్వం భావించి ఈమేరకు చర్యలకు ఆదేశించింది. విద్యాశాఖ అధికారులు తనిఖీకి వెళ్లిన సందర్భంలో తరగతిగదిలో సెల్‌ఫోన్ వాడుతున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే సదరు ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. కాగా, జిల్లాలో సెల్‌ఫోన్ నిషేధం ఏ మేరకు అమలవుతుందో ఇక వేచి చూడాల్సిందే.

జూన్ 2 నుంచి 'యువ' రుణాలు

- రాజీవ్ యువ వికాస పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం
- రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అందజేత
- తొలి విడతగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు..
- ఐదు విడుతల్లో రుణాలు ఇచ్చేలా కార్యాచరణ



ములుగు రూరల్, మే 30, (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్ వర్గాల్లో ఎంపిక చేసిన వారికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న, తొలి విడతగా రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే మండలస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు అర్హుల జాబితాను ఎంపిక చేసి జిల్లా కమిటీకి పంపించినట్లు సమచారం.

ములుగు జిల్లా వ్యాప్తంగా 20,300 మంది దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ వర్గాల నిరుద్యోగ యువతీ యువకులు ఆయా శాఖలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 20,300 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నింటిని మండలాల్లో ఎంపీడీవోలు పరిశీలించి జాబితాను జిల్లా అధికారులకు నివేదించినట్లు తెలిసింది. జూన్ 2న అన్ని ములుగు జిల్లా వ్యాప్తంగా రూ.లక్షలోపు రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందించనున్నారు.

ఐదు విడతల్లో రుణాలు ఇచ్చేలా ప్రణాళిక

ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద ఐదు విడతల్లో రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో భాగంగా రూ. 50వేల నుంచి లక్ష వరకు జూన్ నెలలో రుణాలు అందించనున్నారు. ఇందుకోసం దాదాపు వెయ్యి పైచిలుకు మందికి రాష్ట్ర అవతరణ దినోత్సవం ఇవ్వనున్నారు. ఇందులో మిగిలిన లబ్ధిదారులకు ఇదే నెలాఖరులోగా అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అలాగే రెండో విడతలో భాగంగా జూలైలో రూ.2లక్షల వరకు రుణాలు అందిచనుంది. అలాగే ఆగస్టులో మూడో విడతలో భాగంగా రూ. 2లక్షల నుంచి రూ. 3లక్షల లోపు రుణాలు, చివరగా సెప్టెంబరులో నాలుగు, ఐదు విడుతల్లో రూ. 3లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేసి అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జూన్‌లో లక్షలోపు రుణాల ఎంపిక పూర్తి

- సంపత్‌రావు డీఆర్‌డీవో, ములుగు

రాజీవ్ యువవికాసం పథకం కింద రూ. లక్షలోపు రుణాలకు లబ్ధిదారుల ఎంపిక దాదాపు పూర్తయింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హులైన వారికి జూన్‌లో కేటగిరీల వారిగా రుణాలు అందించేలా కార్యచరణ సిద్ధం చేస్తున్నాం.

పదవుల పండుగ.. ఆశలు నిండుగా..

3వ పేజీ తరువాయి

కల్పించటం చర్చనీయాంశంగా మారింది. పీఏసీ తరువాత అత్యంత కీలకమైన పార్టీ అడ్వయిజరీ కమిటీలో వరంగల్ మాజీ ఎంపీ, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు అవకాశం కల్పించారు. తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఉమ్మడి వరంగల్ నుంచి రాజయ్య ఒక్కరికే చోటు ఇవ్వటం కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కొండాకు దక్కని ఛాన్స్..

కాంగ్రెస్ అధిష్టానం గురువారం రాత్రి ప్రకటించిన కీలకమైన ఐదు కమిటీల్లో వరంగల్‌కు చెందిన సీనియర్ మంత్రి కొండా సురేఖకు చోటు దక్కకపోవటం చర్చనీయాంశంగా మారింది. అపార రాజకీయ అనుభవం ఉన్న సురేఖకు రాజకీయ వ్యవహారాల కమిటీలో చోటు దక్కాల్సిందనే చర్చ జరుగుతోంది. పొరుగునే ఉన్న ఉమ్మడి కరీంనగర్ నుంచి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్‌లకు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎంపీ రేణుకాచౌదరిలకు చోటు దక్కింది.


ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్టీ వర్గానికి చెందిన మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్‌లకే అవకాశం ఇవ్వడం క్యాడర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో మంత్రి కొండా సురేఖ అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారు. సినీ నటుడు నాగార్జున్ ఫ్యామిలిపై ఆరోపణల నుంచి ఇటీవల జూనియర్ కాలేజీ భవనాల శంకుస్థాపనల సందర్భంగా డబ్బులు తీసుకుని మంత్రులు పనులు చేస్తారనే చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించాయనే చర్చ జరిగింది. దీనికి తోడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలామంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో, కీలక నేతలతో కొండా దంపతులకు సయోధ్య లేదనే టాక్ ఉంది. ఈ నేపథ్యంలోనే మంత్రి సురేఖకు కీలకమైన ఏ కమిటీలో కూడా చోటు కల్పించలేదనే చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జరుగుతోంది.

పదవులపై ఆశలు


ఓరుగల్లు కాంగ్రెస్‌లో పదవుల సందడి నెలకొంది. జూన్ మొదటి వారంలోగా రాష్ట్ర కమిటీలో కీలక పదవులన్నింటినీ భర్తీ చేసేందుకు ఏఐసీసీ నేతలు కసరత్తు చేస్తున్నారు. పార్టీకి విధేయులుగా ఉండటంతో పాటు కష్టకాలంలో పార్టీని వీడకుండా ఉన్న వారికే అవకాశం ఇవ్వాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచించటంతో సీనియర్లలో ఆశలు రేకెత్తుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అనేక మంది నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఆరుగురికి నామినేటెడ్ పదవులు ఇవ్వగా, మరో డజను మందికి పైగా నేతలు పదవుల కోసం అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే టీపీసీసీలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధుల పదవుల కోసం పోటి పడుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు నమిండ్ల శ్రీనివాస్, ఎర్రబెల్లి స్వర్ణ, దొమ్మాటి సాంబయ్య, పెరుమాండ్ల రామకృష్ణ, మీసాల ప్రకాష్‌తో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దక్కని వారికి ఏదో ఒక పదవి ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. వీటితో పాటు అనుబంధ సంఘాల్లో కీలక పదవులను దక్కించుకునేందుకు నేతలు తమ గాడ్ ఫాదర్‌లపై ఒత్తిడి తెస్తున్నారు. టీపీసీసీ పదవుల జాతర తరువాత జూన్ రెండోవారంలో జిల్లా కాంగ్రెస్ కమిటీలను ప్రకటించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

మానుకోట జిల్లాకు ప్రాధాన్యం..

మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో మానుకోట జిల్లాకు ప్రాధాన్యత లభించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఐదు కమిటీలను ప్రకటించగా రెండింటిలో ఇద్దరికి చోటు దక్కింది. 22 మందితో ఏర్పాటు చేసిన రాజకీయ వ్యవహారాల కమిటీలో మానుకోట పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాంనాయక్‌కు చోటు దక్కింది. అదే విధంగా 16 మందితో ఏర్పాటు చేసిన సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీలో మహబూబాబాద్ మండల రెడ్యాల మాజీ సర్పంచ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం దక్కింది.



ఎంపీ పోరిక బలరాంనాయక్



వెన్నం శ్రీకాంత్‌రెడ్డి

పశువుల తరలింపు ముఠా గుట్టు రట్టు

- టమాటా ట్రైలర్‌ల చాటున తరలిస్తుండగా పట్టివేత
- డీసీఎం వాహనం సీజ్, 17 పశువులు స్వాధీనం



పట్టుబడిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం, మే 30 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్ళు కప్పి అక్రమంగా తరలిస్తున్న పశువుల ముఠాగుట్టును పోలీసులు రట్టు చేశారు. ఎస్సై తాజుద్దీన్ తెలిపిన కథనం మేరకు.. పశువులను అక్రమంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి ఏటూరునాగారం మీదుగా హైదారా బాద్‌లోని కబేళాకు తరలిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి చెక్‌పోస్ట్ వద్ద తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు.

దీంతో (టీఎస్ 05 యూఎఫ్ 2690)అనే నెంబర్ గల డీసీఎం వాహనంలో అక్రమంగా టమాటా ట్రైలర్‌ల చాటున 17 పశువులను డీసీఎంలో తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. కాగా, సూర్యాపేట జిల్లా చేనుపల్లి గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ పెరుమాండ్ల లక్ష్మణ్‌తో పాటు డీసీఎం యజమాని సెట్టూరి రామకృష్ణలపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. అనంతరం డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి, డీసీఎంలోని 13 ఎద్దులను, నాలుగు ఆవులను మొత్తం 17 పశువులను అక్రమంగా తరలిస్తుండగా వాటిని పట్టుకొని రక్షించి. కేసు నమోదు చేసి భూపాలపల్లి జిల్లాలోని రాంపూర్ గోశాలకు తరలించామని ఎస్సై పేర్కొన్నారు. కాగా, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ స్వయంగా పశువుల డీసీఎం వాహనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

ఇద్దరు టెన్త్ విద్యార్థులకు శాపం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది వరంగల్, హనుమకొండ జిల్లాలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. వరంగల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసిన ఓ విద్యార్థినికి సోషల్ జవాబు పత్రం నుంచి మ్యాప్ మాయం కాగా, సదరు విద్యార్థిని ఫలితాలను నిలిపివేశారు. ఇక హనుమకొండ జిల్లాలో పరీక్ష రాసిన మరో విద్యార్థికి ఇంటర్నల్ మార్కులు కనిపించకపోవడంతో సుమారు 20 మార్కులు తగ్గాయి. వివరాల్లోకి వెళ్లితే.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలోని టీజీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసింది. అయితే ఫలితాలు వెలువడిన రోజున ఆమె హతాశురాలైంది. ఆమె ఫలితాన్ని బోర్డు ఆపివేసింది. డీఈవో కార్యాలయానికి వచ్చి విషయాన్ని తెలుసుకోగా సోషల్ పరీక్షలో సదరు విద్యార్థిని పార్ట్-బిలోని మ్యాప్‌ను మెయిన్ జవాబు పత్రానికి కట్టకపోవడంతో బోర్డు ఫలితాన్ని నిలిపివేసిందని చావు కబురు చల్లగా చెప్పారు. అయితే తాను పేపర్లు కట్టి ఇచ్చానని విద్యార్థిని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా, హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మండలం రెడ్డిపాలెంకు చెందిన ఓ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థినికి ఫలితాల్లో సోషల్ సబ్జెక్టులో ఇంటర్నల్ మార్కులు 20కి గాను సున్నా మార్కులు వచ్చాయి. అయితే సదరు యాజమాన్యం మాత్రం తమ ఏ తప్పు జరగలేదని చెబుతోంది.

మ్యాపు మాయమైన విద్యార్థినికి సంబంధించిన విషయంలో పదోతరగతి పరీక్షల బోర్డు ప్రాథమిక విచారణ చేపట్టగా పరీక్షా కేంద్రంలో ఆ రోజు డ్యూటీ చేసిన ఇన్విజిలేటర్, సీఎస్, డీవోలు మ్యాప్‌ను జవాబు పత్రానికి విద్యార్థిని జత చేసిందని రాసిచ్చారు. విద్యార్థిని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించాల్సిన అధికారులు.. సకాలంలో స్పందించకపోవడంతోనే విత్‌హెల్డ్ అయ్యిందని ఆరోపిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ఈ విషయమై విద్యాశాఖాధికారి నిర్లక్ష్యాన్ని చూపుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


ఇక హనుమకొండ జిల్లాలో ఇంటర్నల్ మార్కులు కనిపించని విద్యార్థిని విషయంలోనూ విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతోనే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు జరుగలేదని ఆరోపణలున్నాయి. ఇంటర్నల్ మార్కుల విషయంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందా? లేదా ఇంటర్నల్ మార్కులను పరిశీలించే ప్రభుత్వ ఉపాధ్యాయుల బృందం నిర్లక్ష్యంగా వ్యవహరించిందా? అనే విషయాన్ని ఇప్పటివరకు విద్యాశాఖ తేల్చలేకపోయింది.

విత్తన షాపుల్లో ఏసీపీ తనిఖీలు



విత్తనషాపులో అధికారులతో కలిసి తనిఖీ చేస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

వరంగల్ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని పోస్టాఫీస్ ఏరియాలో ఉన్న విత్తనాలు, ఎరువు మందుల షాపుల్లో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు, మందులు విక్రయించిన, లూజ్ విత్తనాలు అమ్మిన, కంపెనీ లోగో లేని విత్తనాలు విక్రయించిన, ఎక్కువ ధరకు విక్రయాలు చేపట్టిన అలాంటి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల యజమానులు అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తే రైతులు పోలీసుశాఖ, వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ కోరారు.



కలెక్టరేట్ ఎదుట ఉపాధిహామీ కూలీల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, మే30(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఉపాధిహామీ కూలీలు శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాములు మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.వి గణేష్‌కు అందజేశారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు


9వ డివిజన్ కాకతీయకాలనీ ఫేస్-2లో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్థానిక కార్పొరేటర్ చీకటి శారద-ఆనంద్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హనుమకొండ చౌరస్తా, మే 30(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 9వ డివిజన్ కాకతీయకాలనీ ఫేస్-2లో రూ.8లక్షల 50వేల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ చీకటి శారద-ఆనంద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీకటి ఆనంద్, సముద్రాల రవిందర్, స్థానికులు లక్ష్మీపతి, రంగారావు, నరసింహచారీ, ఫాతిమా, చారీ, వీణ, పూర్ణ పాల్గొన్నారు.


మెట్టురామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న డాక్టర్ అనంతలక్ష్మి

మెట్టురామలింగేశ్వరస్వామి సేవలో ప్రవచనవేత్త అనంతలక్ష్మి

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ, మే 30(ఆంధ్రజ్యోతి) : మడికొండలోని మెట్టుగుట్టపై గల సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రం పునర్వసు పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. అనంతరం యాగశాలలో శ్రీరామ మూలమంత్ర హోమం నిర్వహించారు. ఈవో శేష భారతి ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి క్షేత్రాన్ని ప్రఖ్యాత విదుషీమణి, ఆధ్యాత్మిక ప్రవచనవేత్త డాక్టర్ అనంతలక్ష్మి శుక్రవారం సందర్శించారు. స్వయంభూ శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారామచంద్రస్వామి వారికి అర్చనలు చేశారు. ఆలయ పూజారి అభిలాష్‌శర్మ, పరాషరం విష్ణువర్ధనాచార్యులు దేవస్థాన విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట గోదావరి, బీజేపీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, పార్టీ 44, 45, 46, 64 డివిజన్ల జోనల్ అధ్యక్షుడు దామెరుప్పుల రమేష్ తదితరులు ఉన్నారు.


గోపాల్‌పూర్ ఊర చెరువులో శుద్ధీకరణ పనులు చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా చెరువు శుద్ధీకరణ

వడ్డెపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56 వ డివిజన్ పరిధిలోని గోపా ల్‌పూర్ ఊర చెరువు శుద్ధీకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చెరువులో ఏపుగా పెరిగిన గుర్ర పు డెక్క ఆకులతో పాటు ఇతర పిచ్చి మొక్కల తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. కొన్నేళ్లుగా పేరుకుపోయిన పూడిక మట్టితోపాటు గుర్రపు డెక్క ను యంత్రాల ద్వారా తొలగిస్తున్నారు. చెరువు శిఖంలో ఉన్న నిరుపయోగమైన చెట్లను తొలగించడంతోపాటు గుంతలు, గొయ్యిలను పూడ్చుతూ చదను చేస్తున్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం..

- హనుమకొండ చౌరస్తాలోని అడ్డాలను తొలగించడం దుర్మార్గం
- 2014లో చిరు వ్యాపారుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బాధితులకు పరామర్శ

హనుమకొండ చౌరస్తా, మే 30 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ చౌరస్తాలో అడ్డాలు తొలగింపబడిన కూరగాయల విక్రయదారులకు, చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించే వరకు వారికి అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ చౌరస్తాలో అడ్డాలు, స్థావరాలను కోల్పోయిన కూరగాయలు విక్రయదారులు, చిరు వ్యాపారులను వినయ్‌భాస్కర్ పార్టీ శ్రేణులతో కలిసి భరోసా నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీలో భాగంగా నగర సుందరీకరణ పేరుతో జీడబ్ల్యూఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు హనుమకొండ చౌరస్తాలో ఏళ్ల తరబడి కూరగాయలు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న నిరుపేదలు అడ్డాలను తొలగించడం దుర్మార్గమన్నారు. 2014లో పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీల కృషితో పార్లమెంట్‌లో చిరు వ్యాపారుల చట్టం అమలులోకి వచ్చిందనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు తెలుసుకోవాలని హితవుపలికారు. రాష్ట్రంలో చిరు వ్యాపారుల సంక్షేమం కోసం రూ.3కోట్ల నిధులతో 2,800


కూరగాయల విక్రయ అడ్డాను కోల్పోయి రోదిస్తున్న మహిళను ఓదార్చుతున్న వినయ్‌భాస్కర్

వెండింగ్ జోన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అదే విధంగా చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు వారికి వెండింగ్ జోన్ల నిర్మాణం చేపట్టిందన్నారు. మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. 16నెలల సమయంలో హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చడంతోపాటు స్మార్ట్‌సిటీ పేరుతో చిరు వ్యాపారుల పొట్టకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి మొదలుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పేదలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూరగాయలు, వస్తువులను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విషయమై జీడబ్ల్యూఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను కలిసి చిరు వ్యాపారులకు కష్టాలను వివరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడా షాపుల యాజమాన్యాలకు కొమ్ముకాస్తోందని వినయభాస్కర్ ఆరోపించారు. వారి షాపుల ముందు ఎలాంటి పార్కింగ్‌లు, సెల్లార్లు లేకున్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని అన్నారు. మేడే మాసోత్సవాల్లో భాగంగా నగరంలో, జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఈనెల 31న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలపార్కు ఎదుట పెద్దఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.

ఈ సందర్భంగా కూరగాయలు అమ్ముకుంటూ అడ్డాలు కోల్పోయిన మహిళలు వినయ్‌భాస్కర్ ముందు కన్నీళ్లపర్యంతం అయ్యారు. అదేవిధంగా పిండి రమేష్ అనే కూరగాయల విక్రయదారుడి అడ్డాను తొలగించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ప్రభుత్వ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని బాధితుడి సోదరి స్వరూప మొరపెట్టకుంది. దీంతో ఆస్పత్రి వైద్యుడితో వినయ్‌భాస్కర్ మాట్లాడి రమేష్ ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం చిరు వ్యాపారులు సమీపంలోని నేతాజీ సుబాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీమ్, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, లోహితా-రాజు, నర్సింగ్, సోడా కిరణ్, చెన్నం మధు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, బొల్లెపల్లి షన్నం చందర్, ఉడుతల సారంగపాణి, మేకల బాబురావు, జోరిక రమేష్, ఇస్మాయిల్, జుబేర్, కార్మిక విభాగం నాయకులు రవి, వివిధ డివిజన్ల నాయకులు, చిరు వ్యాపారులుపాల్గొన్నారు.

ఆటో కార్మికుల పొట్ట కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్టకొట్టిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. శుక్రవారం కార్మికుల మాసోత్సవాలలో బాగంగా హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని రుద్రమాదేవి ఆటోస్టాండ్ ప్రాంగణాన్ని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సందర్శించి ఆటోకార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆటో ప్రాంగణంలో డ్రైనేజీ పైపులైన్ లీకేజీతో మురికినీరు నిండి ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు వినయ్‌భాస్కర్‌కు తెలిపారు. దీంతో వినయ్‌భాస్కర్ ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వినయ్‌భాస్కర్ తెలిపారు. ఆటో కార్మికుడి కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆటో కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వినయ్‌భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల సంఘం నాయకులు రవీందర్‌రెడ్డి, సంజీవ్ బాబు, శ్రీధర్‌రెడ్డి, జయరాం, కుమార్, రమేష్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరులేదని.. హోర్డింగ్ ఎక్కి యువకుడి హల్‌చల్

పేరున్న లిస్టును వాట్సాప్‌లో పంపడంతో దిగి పరార్

వరంగల్ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి) : దరఖాస్తు చేసుకున్నప్పటికీ నిరుపేదనైన తన పేరును ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఎంపికచేయలేదని ఓ యువకుడు ప్రకటనల హోర్డింగ్ ఎక్కి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన శక్రవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదుట చోటు చేసుకుంది. హనుమకొండ ఎస్సై సతీష్ కథనం ప్రకారం... ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో తన పేరు లేదని రాంనగర్‌కు చెందిన పాషా అనే వ్యక్తి పోలీస్‌హెడ్ క్వార్టర్ ఎదుట ఉన్న హోర్డింగ్ ఎక్కి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతానంటున్నాడని స్థానికులు నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఫోన్‌లో సదరు యువకుడితో సంప్రదింపులు జరపగా ఇళ్ల కేటాయిస్తానంటేనే దిగుతా.. అనిచెప్పడంతో స్థానికుల సహాయంతో మరోకసారి ఫోన్ చేయించి బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. చివరికి లిస్టులో తన పేరుందని స్థానిక నాయకుల సహకారంతో


హోర్డింగ్‌పై ఉన్న యువకుడు

తెలుసుకొని పేరున్న లిస్టును వాట్సాప్ ద్వారా యువకుడి ఫోన్ నెంబర్ పంపించగా చూసుకొని కిందికి దిగినట్లు ఎస్సై తెలిపారు. కాగా, పోలీసులు అదుపులోకి తీసుకుంటారనే భయంతో అప్పటికే కింద ద్విచక్రవాహనంపై సిద్ధంగా ఉన్న తన స్నేహితుడితో అక్కడి నుంచి పరారయ్యాడని స్థానికులు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై బల్దియా కొరడా

పలువురికి జరిమానా విధించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ విక్రయాలపై బల్దియా అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం వరంగల్ నగరంలో పలు ప్రాంతాల్లోని షాపులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు శానిటేషన్ సూపర్‌వైజర్ పసునూరి భాస్కర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణ బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి సీకేఎం కళాశాల వరకు పలు కమర్షియల్ షాపులు, కిరాణషాపులలో తనిఖీలు నిర్వహించారు. రెండు షాపులకు రూ.15వేల జరిమానా విధించి మరో 5షాపుల యజమానులను హెచ్చరించారు. ఈ సందర్భంగా శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్ మాట్లాడుతూ.. షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలు కలిసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించిందని, ఎక్కడైనా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ నిర్మూలన బృందం సిబ్బంది పాల్గొన్నారు.


షాపు యజమానికి జరిమానా విధిస్తున్న బల్దియా అధికారులు


హైదరాబాద్‌లో జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ అశ్విని

వరద నివారణపై శిక్షణా తరగతులు

పాల్గొన్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తు నిర్వాహణ సంస్థ (ఎన్ఐడీఎం), రాష్ట్ర రెవెన్యూ శాఖల సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్ ఎంసీఆర్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులలో డిసిల్టింగ్, డ్రైనేజీ నిర్వహణ, అత్యవసర స్పందన వంటి ముఖ్యమైన అంశాలపై తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ నుంచి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. వరదల నుంచి రక్షించేందుకు నగర పాలక సంస్థ తీసుకుంటుందన్న జాగ్రత్తలు, పూర్వ అభిప్రాయ ప్రణాళిక, యంత్రాంగం సిద్ధత, విపత్తు నిరోధకతపై కమిషనర్ అక్కడి అధికారులకు వివరించారు. ఈ తరహా శిక్షణ అధికారులకు వర్షాకాలం ముందు ఇవ్వడంవల్ల విపత్తును ముందే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు కమిషనర్ అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి దేవాలయ స్థలం కబ్జా

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు న్యూశాయంపేట వాసుల ఫిర్యాదు

హనుమకొండ కలెక్టరేట్, మే30(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని కాజీపేట మండలం న్యూశాయంపేటలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చీకటి రాజు శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యకు ఫిర్యా దు చేశారు. సర్వే నెంబర్ 23లో ఉన్న 5 నుంచి 10గుంటలలో ఉన్న దేవాలయానికి సంబంధించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, స్థానికులు, రాజకీయ నాయకులు ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, దేవుడి భూమిని కూడా వదలడం లేదని రాజు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవాలయ భూములకు కూడా రక్షణ లేదని, న్యూశాయంపేట మెయిన్‌రోడ్డుకే ఈ దేవాలయం ఉండటంతో కోట్ల విలువైన భూమిపై కొందరు స్థానికులు, బడాబాబులు కన్నేశారని, ఈ దేవాలయ స్థలంపై సమగ్ర విచారణ జరిపి హద్దులు నిర్ణయించి ఆక్రమణదారుల నుండి స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌ను రాజు కోరాడు. స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య వెంటనే విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మల్టీజోన్-1 సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో మల్టీజోన్-1 పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని టీఎస్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరమ్ కార్యదర్శి ఎం.డి. ఫక్రుద్దీన్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని వరంగల్ ఆర్జేడీ కార్యాలయలంలో ఏడీ రంగయ్యనాయుడికి వినతి పత్రం అందజేశారు.

మల్టీజోన్-1లో ఏర్పడుతున్న ఖాళీలకు అనుగుణంగా అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని, పదోన్నతుల కల్పనలో తాత్సారం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్జేడీ చొరవ తీసుకొని అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీజోన్-1లో నెలకొని ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫోరమ్ ట్రెజరర్ కామిద్రి పవన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ రాయిశెట్టి అశోక్, ప్రధానకార్యదర్శి దిలిప్, నాయకులు ఎండి గౌసుద్దీన్, జాకీర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్జేడీ కార్యాలయ ఏడీ రంగయ్యకు వినతి పత్రం అందజేస్తున్న టీఎస్జీవోస్ నాయకులు

నగరంలో 'ఉగ్ర' కలకలం

3వ పేజీ తరువాయి

సిరాజ్ బీటెక్ పూర్తి చేసి, ఎస్సై శిక్షణం కోసం 2017లో హైదరాబాద్‌కు వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. ఉద్యోగం రాకపోవటంతో అక్కడే మకాంవేసిన సిరాజ్‌కు హైదరాబాద్‌లోని బోయగూడకు చెందిన సమీర్‌తో పరిచయం ఏర్పడింది. సమీర్ ద్వారా వరంగల్‌కు చెందిన పరహన్‌తో సిరాజ్‌కు పరిచయం ఏర్పడింది. జిహాద్ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికి సిద్ధపడాలని సోషల్ మీడియా గ్రూపులో చాటింగ్‌లు చేసుకున్నట్లు ఎన్ఐఏ తనిఖీల్లో వెల్లడైంది. దీంతో గత వారం వరంగల్‌లో పరహన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, వరంగల్, కాజీపేటకు చెందిన మరో ఇద్దరి పేర్లు చెప్పినట్లుగా సమాచారం. ఈ ముగ్గురిని వేర్వేరుగా ఎన్ఐఏ బృందం విచారించింది. అయితే వీరికి ఎలాంటి ఉగ్ర కుట్రలో భాగస్వామ్యం లేదని తేలినట్లుగా స్థానిక పోలీసులు తెలిపారు. కాగా, ఉగ్రకుట్రలపై ఎన్ఐఏ తనిఖీల విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి రావటంతో చర్చనీయాంశంగా మారింది.

వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయండి

అధికారులతో మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశానుసారం బల్దియా ద్వారా రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలను పక్కాగా అమలు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో వంద రోజుల కార్యాచరణకు సంబంధించిన సమీక్షా సమావేశాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి సెప్టెంబరు 9వ తేదీ వరకు బల్దియా ద్వారా 100 రోజుల్లో చేపట్టే కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించాలన్నారు. పచ్చదనం పరిడవిల్లేలా పెద్దఎత్తున మొక్కలు నాటాలని అన్నారు.

36ప్రధాన నాలాల్లో రూ.1.21కోట్ల వ్యయంతో పూడిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాలాల్లో ఉన్న బ్లాకేజ్ పాయింట్లను గుర్తించి మెష్‌లో ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో శిధిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి కూల్చివేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

ముగిసిన హెడ్మాస్టర్ల శిక్షణ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న హెడ్మాస్టర్లకు 5 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఉర్సు వద్ద గల తాళ్లపద్మావతి ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆర్జేడీ కె.సత్యనారాయణ రెడ్డి హాజరై పాఠశాలను ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత హెడ్మాస్టర్‌దేనన్నారు. పాఠశాలల్లో గణనీయమైన మార్పు కోసం హెడ్మాస్టర్లు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు, ఆవాసప్రాంత ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుజన్‌తేజ, ఆర్పీలు శ్రీనివాస్, రవీందర్, మోహన్‌రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


హెడ్మాస్టర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మేకప్



వానల్లో హేయ్ హేయ్...

వానల్లో వేసుకునే మేకప్ తడికి చెదిరిపోకుండా ఉండాలి. అందుకోసం మాన్‌సూన్ ప్రూఫ్ మేకప్ ఎంచుకోవాలి. వాన నీటికి చెక్కుచెదరని ఉత్పత్తులు, మెలకువలు పాటించాలి. అవేంటంటే...

ఇలా సిద్ధం చేయాలి

- జిడ్డు లేని మాయిశ్చరైజర్‌ను ఎంచుకోవాలి. అప్పుడే తేమతో మేకప్ కరిగిపోకుండా, జారిపోకుండా ఉంటుంది.
- నీటిని తట్టుకునే ప్రైమర్ ఉపయోగించాలి. ఇది నున్నని బేస్‌గా మారి, మేకప్‌ను ఎక్కువ సమయం పాటు నిలిపి ఉంచుతుంది
- సన్‌స్క్రీన్ వాడడం ఆపేయకూడదు. అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ కోసం సన్‌స్క్రీన్ వాడడం తప్పనిసరి

ఫౌండేషన్ ఇలా...

- తేలికపాటి బిబి క్రీమ్‌ను ఎంచుకోవచ్చు. భారీగా ఉండే, ఫుల్ కవరేజ్ ఫౌండేషన్లు ఈ కాలానికి తగినవి కావు. ఇవి అసౌకర్యంగా ఉండడమే కాకుండా, తేమకు కరిగిపోతాయి
- మేకప్ చెదిరిపోకుండా ఉండడం కోసం, మెరుపు నియంత్రించడం కోసం సెట్టింగ్ పౌడర్ ఉపయోగించాలి
- మ్యాట్ ఫినిషింగ్ స్ప్రేతో మేకప్ ఎక్కువ సమయం పాటు చెదిరిపోకుండా ఉంటుంది. అలాగే సహజ సిద్ధమైన మెరుపును అందిస్తుంది

ఐ మేకప్

- కళ్లను తీర్చిదిద్దడం కోసం, కనురెప్పల చిక్కదనాన్ని పెంచడం కోసం వాటర్‌ప్రూఫ్ ఐలైనర్, మస్కారాలనే ఎంచుకోవాలి
- పౌడర్ ఆధారిత ఐ షాడో ఎంచుకుంటే, చెదిరిపోకుండా సహజసిద్ధంగా కనిపిస్తుంది

పెదవుల కోసం

- మ్యాట్ లేదా లాంగ్ స్టే లిప్‌స్టిక్‌లు ఈ కాలానికి తగినవి. ఇవి చెదిరిపోకుండా ఉంటాయి.
- పెదవులు పొడిబారిపోకుండా లిప్‌బామ్ వాడుకోవాలి. ప్రత్యేకించి మ్యాట్ లిప్‌స్టిక్స్ వాడేటప్పుడు ముందుగా లిప్ బామ్‌తో పెదవులను మర్దించాలి

అదనపు చిట్కాలు

- బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. అదనపు జిడ్డును వదిలించడానికి ఇవెంతో బాగా ఉపకరిస్తాయి
- నిద్రకు ముందు మేకప్‌ను పూర్తిగా తొలగించుకోవాలి. లేదంటే చర్మ రంధ్రాలు పూడుకుపోతాయి
- టచప్స్ కోసం వెట్ వైప్స్ వాడుకోవాలి. వీటిని వాడుకుంటే రోజంతా తాజా అనుభూతి పొందవచ్చు
- వాటర్‌ప్రూఫ్ సెట్టింగ్ స్ప్రే మేకప్‌ను సీల్ చేసి, ఎక్కువ సమయంపాటు చెదిరిపోకుండా మేకప్‌ను కాపాడుతుంది

వంటిల్లు



పండ్లతో కొత్తగా కమ్మగా

మనం రోజూ రకరకాల పండ్లు తింటూ ఉంటాం. కొన్ని పుల్లగా, కొన్ని తియ్యగా వేటికవే విభిన్నంగా ఉంటాయి. వీటితో నోరూరించే వంటలు కూడా చేయవచ్చు. పండ్లను కొత్తగా, కమ్మగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ రుచులు...

అనాస పండు కూర

కావాల్సిన పదార్థాలు

అనాస పండు (పైన్‌ఆపిల్) ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, నూనె- మూడు చెంచాలు, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, అల్లం తరుగు- అర చెంచా, వెల్లుల్లి తరుగు- అర చెంచా, పచ్చిమిర్చి ముక్కలు- ఒక చెంచా, కొబ్బరి పాలు- రెండు కప్పులు, బియ్యప్పిండి- ఒక చెంచా, నిమ్మరసం- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు



తయారీ విధానం

- ఒక వెడల్పాటి గిన్నెలో అనాస పండు ముక్కలు, ఒక చెంచా కరివేపాకు తరుగు, కొద్దిగా ఉప్పు, కారం, చిటికెడు పసుపు వేసి బాగా కలపాలి. ఈ గిన్నె మీద మూతపెట్టి రెండు నిమిషాలు నాననివ్వాలి. ఒక చిన్న గిన్నెలో బియ్యప్పిండి వేసి కొన్ని నీళ్లు పోస్తూ జారుగా కలపాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఒక చెంచా కరివేపాకు తరుగు, వెల్లుల్లి తరుగు, అల్లం తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, చిటికెడు పసుపు వేసి కలపాలి. ఇవి వేగాక కొబ్బరిపాలు పోసి కలపాలి. ఒక నిమిషం తరవాత బియ్యప్పిండి నీళ్లు పోస్తూ కలపాలి. తరవాత కొద్దిగా ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి రెండు నిమిషాలు ఉడకనిచ్చి స్టవ్ మీద నుంచి దించాలి.
- స్టవ్ మీద మరో గిన్నె పెట్టి ఒక చెంచా నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అనాస పండు ముక్కల మిశ్రమం, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి ఒక నిమిషం వేగనివ్వాలి. తరవాత ఇందులో కొబ్బరి పాల మిశ్రమం పోసి కలిపి రెండు నిమిషాలు ఉడికాక స్టవ్ మీద నుంచి దించాలి. పైన కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేసుకోవాలి. పుల్కా, చపాతీ, పూరీ, వేడి అన్నంలోకి ఈ కూర రుచిగా ఉంటుంది.

• అనాసలో బి, సి విటమిన్లు, కాపర్, మాంగనీస్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ లాంటి మినరల్స్ ఉంటాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి, మెదడుతో పాటు నరాల పనితీరు మెరుగుపడేందుకు, జీవక్రియలకు, కణాల వృద్ధికి, తీసుకున్న ఆహారాన్ని శక్తిగా మార్చడానికి తోడ్పడతాయి. అనాసలోని పీచుపదార్థాలు రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరగకుండా నిరోధిస్తాయి. ఈ పండులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.

జాగ్రత్తలు

- కొబ్బరి పాలు చిక్కగా ఉండాలి. అనాస పండు ముక్కలను మరీ ఎక్కువగా వేపకూడదు.
- చివరలో కొద్దిగా జీడిపప్పు పేస్టు కలిపితే కూర మరింత రుచిగా ఉంటుంది.

మామిడి పండు బొబ్బట్లు

కావాల్సిన పదార్థాలు

పెద్ద సైజు మామిడి పండు- ఒకటి, మైదా- ఒక కప్పు, ఉప్పు- చిటికెడు, వేడి నీళ్లు- అర కప్పు, పచ్చి కొబ్బరి తురుం- అర కప్పు, నెయ్యి- నాలుగు చెంచాలు, పంచదార- అర కప్పు, యాలక్కాయ పొడి- అర చెంచా

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో మైదా, ఉప్పు వేసి వేడి నీళ్లు చల్లుకుంటూ మెత్తని ముద్దలా కలపాలి. దీని మీద మూతపెట్టి ఉంచాలి. మామిడి పండును నీళ్లతో శుభ్రంగా కడిగి తొక్క తీయాలి. చిన్న ముక్కలుగా కోసి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మామిడి గుజ్జును చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో పచ్చి కొబ్బరి తురుం వేసి కలుపుతూ పచ్చి వాసన పోయే వరకూ వేయించాలి. అయిదు నిమిషాల తరవాత పంచదార, మామిడి గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమం దగ్గరకు వచ్చేదాకా కలుపుతూనే ఉండాలి. తరవాత యాలక్కాయ పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేయాలి.
- మైదా పిండి ముద్దను అయిదు నిమిషాలపాటు గట్టిగా ఒత్తుతూ కలపాలి. తరవాత చిన్న ముద్దలుగా చేయాలి. చపాతీ పీటమీద కొద్దిగా పొడి పిండి చల్లి దానిమీద పిండి ముద్ద పెట్టి మందపాటి చపాతీలా ఒత్తాలి. ఈ చపాతీ మధ్యలో మామిడి-కొబ్బరి ఉండ పెట్టి అన్ని వైపుల నుంచి మూసి ముద్దలా చేయాలి. దీనిని చపాతీ పీట మీద పెట్టి మెల్లగా ఒత్తుతూ పలుచని చపాతీ మాదిరి చేయాలి.



- స్టవ్ మీద పెనం పెట్టి వేడిచేసి కొద్దిగా నెయ్యి రాయాలి. దీని మీద చపాతీ వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చాలి. ఇవి బాగా పొంగి మెత్తగా రుచిగా ఉంటాయి. ఇలా తయారు చేసుకున్న మామిడి బొబ్బట్లు మూడు రోజుల వరకూ నిల్వ ఉంటాయి. అదే ఫ్రిజ్‌లో పెడితే వారం పాటు బాగుంటాయి.

• మామిడి పండులో ఎ, సి విటమిన్లతో పాటు పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మామిడి పండును తినడం వల్ల శరీరంలో క్యాన్సర్ కారకాలు నశిస్తాయి. తక్షణ శక్తి లభిస్తుంది. గుండె, చర్మం, కళ్లు, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

జాగ్రత్తలు

- మైదా పిండికి బదులు గోధుమ పిండి వాడుకోవచ్చు.
- పంచదారకు బదులు బెల్లం వేసుకోవచ్చు.
- నెయ్యి వద్దనుకుంటే వెన్న లేదా నూనెతో కూడా చేసుకోవచ్చు.

కివి పచ్చడి



కావాల్సిన పదార్థాలు

కివి పండ్లు- మూడు, కొత్తిమీర తరుగు- రెండు కప్పులు, పుదీనా తరుగు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు చెంచాలు, అల్లం తరుగు- ఒక చెంచా, నల్ల ఉప్పు- పావు చెంచా, ఉప్పు- అర చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, పంచదార- ఒక చెంచా, నీళ్లు- మూడు చెంచాలు, పసుపు- చిటికెడు, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- పావు చెంచా, ఎండు మిర్చి- ఒకటి ఇంగువ- చిటికెడు, కరివేపాకు- రెండు రెమ్మలు.

తయారీ విధానం

కివి పండ్లను కడిగి తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో కివి ముక్కలు, కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం తరుగు, నల్ల ఉప్పు, ఉప్పు, జీలకర్ర పొడి, పంచదార, నీళ్లు, పసుపు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఆవాలు, ఎండుమిర్చి ముక్కలు, ఇంగువ, కరివేపాకు వేసి బాగా వేపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఈ కివి పచ్చడిని బ్రెడ్‌తో తింటే బాగుంటుంది. పుల్కా, చపాతీ, దోశ, వడలతో కూడా తినవచ్చు.



• కివి పండును పోషకాల గనిగా చెబుతారు. దీనిలో సి, ఇ, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. తరచూ కివి పండును తినడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ముఖంమీద మొటిమలు, గుల్లలు రావు. చర్మం మృదువుగా ప్రకాశవంతంగా మారుతుంది. గుండె జబ్బులు రావు.

జాగ్రత్తలు

- కివి మరీ పచ్చివి లేదా పండువి కాకుండా మధ్యస్థంగా ఉన్నవాటిని తీసుకోవాలి
- గుప్పెడు వేయించిన పల్లీలు లేదా రెండు చెంచాల జీడిపప్పు కూడా వేసి గ్రైండ్ చేస్తే పచ్చడి కమ్మగా ఉంటుంది.
- పచ్చడి పుల్లగా కావాలనుకుంటే రెండు రెమ్మల చింతపండు వేసుకోవచ్చు.

స్ఫూర్తి



ఆమె లక్ష్యం... రైతు హితం

నారు పోసి... ఆరుగాలం శ్రమించి... పంట పండించిన రైతుకు చివరకు నష్టమే మిగులుతోంది. అనాదిగా పాతుకుపోయిన దళారీ వ్యవస్థ నిలువుదోపిడీతో అప్పుల కుప్ప పేరుకుపోతోంది. దీనికి అడ్డుకట్ట వేసి... 'గ్రామ్‌హిత్'ను తీసుకువచ్చి... రైతులను లాభాల బాట పట్టించారు మహారాష్ట్రకు చెందిన శ్వేతా ఠాక్రే. ముప్పై ఐదు వేలమందికి పైగా రైతుల ఆదాయం పెంచి... వారి జీవితాల్లో నవక్రాంతులు తీసుకువచ్చిన శ్వేత ప్రయాణం ఇది.

"చిన్న, సన్నకారు రైతుల కష్టాలు ఏంటో నాకు బాగా తెలుసు. ఎందుకంటే నేను కూడా సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన దాన్నే. నా చిన్నప్పుడు ఏటా మా అమ్మానాన్న వడ్డీ వ్యాపారి వద్ద అప్పు తీసుకువచ్చేవారు. సాగు చేసి తెచ్చిన అప్పు తీర్చగలమని అనుకునేవారు. కానీ అది ఎప్పుడూ జరగలేదు. ఎంత కష్టపడినా కుటుంబ పోషణే కష్టమయ్యేది. చివరకు వ్యవసాయాన్ని వదిలి మా తల్లిదండ్రులు రోజువారీ కూలీ పనుల కోసం నగరానికి వలస వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా ఏటా నా చదువు కోసం డబ్బులు సమకూర్చడం వారికి పెద్ద సవాలే అయింది. ఆ కష్టాలన్నీ చూశాను కనుకనే రైతుల కోసం ఏదైనా చేయాలని బలంగా నిర్ణయించుకున్నాను.

మాలానే ఎన్నో కుటుంబాలు...

ఈ కథ నా ఒక్కదానిదే కాదు... మాలానే కొన్ని లక్షల వ్యవసాయ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. పంట దిగుబడి పెరుగుతున్నప్పటికీ రైతుల ఆదాయం మాత్రం అంతంతమాత్రంగానే ఉంటోంది. దేశంలో 60 శాతం రైతులు వ్యవసాయాన్ని వదిలేయాలని అనుకుంటున్నట్లు అప్పట్లో ఓ సర్వేలో తేలింది. ఈ క్రమంలో... ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో స్నేహితులతో కలిసి 'కస్తకర్' సంస్థను స్థాపించాను. మహారాష్ట్ర యావత్మల్ జిల్లాలోని రైతులకు మొబైల్ హెల్ప్‌లైన్ ద్వారా సేవలు అందించే ఉద్దేశంతో దీన్ని తీసుకువచ్చాం. వారికి ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలు తెలియజేసేవాళ్లం. దాన్ని అనుసరించి రైతులు తమ పంటలను దళారులకు అమ్ముకునే విషయంలో నిర్ణయాలు తీసుకునేవారు. అలా 'కస్తకర్' రైతులకు ఎంతో ఉపయోగపడింది. ఈ సేవలు మా జిల్లాకే పరిమితం కాకుండా... ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని అనుకున్నాం. తద్వారా మరింతమంది అన్నదాతలకు మేలు కలుగుతుందని భావించాం.

దళారుల దోపిడీకి చెక్...

పంట కొనుగోలు విషయంలో దళారుల గుత్తాధిపత్యం ఏ స్థాయిలో ఉందనేదానిపై మాకు పూర్తి అవగాహన కలిగింది. దానికి అడ్డుకట్ట వేయాలంటే రైతుల సమస్యలపై కూడా దృష్టిపెట్టాలి. వాటి పరిష్కారం కోసం ప్రయత్నించాలి. ఈ క్రమంలో ఎంతోమంది రైతులను కలిశాం. పంట నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంవల్ల కూడా తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని గుర్తించాం. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారంగా 'గ్రామ్‌హిత్'ను ప్రారంభించాం.

వేలమంది రైతులకు...

ఇప్పటివరకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 35 వేల మందికి పైగా రైతులకు 40 శాతం ఆదాయాన్ని పెంచగలిగాం. వీరిలో అయిదువేల మంది మహిళా రైతులు ఉన్నారు. గ్రామ్‌హిత్ ద్వారా నేను చేస్తున్న సేవలకు గానూ ఎన్నో అవార్డులు, పలు ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌లు అందుకున్నాను.

నేరుగా కొనుగోలు...

'గ్రామ్‌హిత్' రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తోంది. దీని ద్వారా రైతులు పండించిన పంటను నిల్వ చేస్తాం. వారికి సరైన ధర వచ్చేవరకూ పంటను సురక్షితంగా ఉంచుతాం. దీనివల్ల రైతులు సరైన ధర వచ్చే వరకు వేచిచూసే అవకాశం ఉంటుంది. డబ్బు అవసరాల కోసం కూడా రైతులు వెంటనే తమ పంటలను అమ్ముకుంటున్నారు. అందుకే మేము వారి అవసరానికి కావల్సిన డబ్బు సమకూరే మార్గం చూపిస్తున్నాం. దళారి అనేవాడు లేకుండా నేరుగా రైతులను... కొనుగోలుదారులను కలుపుతాం. దీనివల్ల రైతులకు పంటకు తగిన ధర లభిస్తుంది. తద్వారా ఆదాయం పెరుగుతోంది. ఎన్నడూ లేనంత లాభాలను రైతన్న చూస్తున్నాడు. ఒక వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా ఇది నాకు ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోంది."

భోజనకుతూహలం



బుద్ధి వర్ధకం బ్రాహ్మీ

మనిషిని మనీషిగా అంటే, మహా మేధావిగా మలచగల అద్భుత ఔషధం బ్రాహ్మీ! దీన్నే సరస్వతీ మొక్క అని కూడా పిలుస్తారు. చెరువుల పక్కన, కాలువల అంచున, ఖాళీ స్థలాల్లో, పొలాల్లో పెరిగే మొక్క. దొరికితే వదలకండి! విద్యార్థులకీ, వృద్ధులకూ ఈ మొక్కవల్ల అనేక ప్రయోజనాలున్నాయి. రఘునాథసూరి రాసిన 'భోజనకుతూహలం' గ్రంథంలో బ్రాహ్మీ గురించి ఎన్నో విశేషాలు పేర్కొన్నాడు. ఈ గ్రంథం ప్రకారం బ్రాహ్మీ..

హిమా- శరీరాన్ని చల్లబరచే స్వభావం కలది. కషాయా- వగరైన రుచి కలది. తిక్తా- చేదు రుచి కలది, వాతాస్ర జిత్- వాతరక్తం(గౌట్) వంటి వ్యాధులను తగ్గిస్తుంది, పిత్త జిత్- శరీరంలో పిత్త దోషాన్ని సమతుల్యం చేస్తుంది. బుద్ధి, ప్రజ్ఞా, మేధా కుర్యాత్- ఆలోచన, బుద్ధి, జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఆయుః ప్రవర్ధినీ- ఆయుష్షును పెంచుతుంది.

ప్రయోజనాలెన్నో: ఆయుర్వేదం బ్రాహ్మీని మేధో రసాయనంగా అభివర్ణించింది. దీనివల్ల మేధా (వివేకం), ధృతి (స్థిరత), స్మృతి (జ్ఞాపకశక్తి) పెరుగుతాయని పేర్కొంది. మానసిక ఒత్తిడిలో ఉన్నవారు, నిద్రలేమితో బాధపడేవారు, చదువులో ఏకాగ్రత కోల్పోయిన విద్యార్థులు, బ్రాహ్మీని తప్పనిసరిగా సేవించాలి. ఇది నరాల బలహీనతకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. వృద్ధుల్లో అల్జీమర్స్ వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. చెవుల్లో జుయిమనే శబ్దాన్ని (టినిటస్) తగ్గిస్తుంది.

ఎలా సేవించాలి?: వసకొమ్ము, శంకపుష్పి, బ్రాహ్మీ కలిపిన పొడితో టీ తయారుచేసుకొని తాగితే అనేక ఆరోగ్య సమస్యలు దరికి రావు. ఆయుర్వేద షాపుల్లో బ్రాహ్మీరసాయనం, బ్రాహ్మీ ఘృతం, సరస్వతీ లేహ్యం మొదలైనవి లభిస్తాయి. వీటి వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.

- బ్రహ్మీ ఆకులను శుభ్రంగా కడిగి, తాలింపు వేసి, ఉల్లి, కొబ్బరి, చింతపండు, మిర్చి కలిపి మిక్సీలో వేస్తే బ్రాహ్మీ పచ్చడి సిద్ధం. ఇదే విధంగా ఆకులను మగ్గించి, ఉడికించిన పప్పులో కూడా కలుపుకోవచ్చు.

• గంగరాజు అరుణాదేవి

సీజనల్ కేర్

వాతావరణ మార్పులకు ఇలా

ఏడాది పొడవునా వాతావరణ మార్పులు సహజం. ఈ మార్పులకు శరీరం సన్నద్ధమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రావు. ఆ జాగ్రత్తలు ఇవే...

- వాతావరణంలో ఏర్పడే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతల కారణంగా శరీరానికి నీటి అవసరం పెరుగుతూ తరుగుతూ ఉంటుంది. కాలానికి అనుగుణంగా తరచూ మంచినీరు తాగుతూ ఉంటే నిర్జలీకరణ సమస్యలనుంచి బయటపడవచ్చు.
- ఎండ, వాన, చలి తీవ్రతలను దృష్టిలో ఉంచుకుని దుస్తులు ధరించాలి. వడగాలి, వర్షం, చలిగాలి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- వాతావరణ మార్పుల వల్ల తరచూ వ్యాధులు సోకుతుంటాయి. కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో చేర్చుకోవాలి. అప్పుడే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్, పీచుపదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవాలి. దీనివల్ల హానికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల నుంచి రక్షణ లభిస్తుంది.
- ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా క్రమం తప్పకుండా వ్యాయామం లేదా యోగ, ధ్యానం చేయాలి. వీటివల్ల శారీరక దారుఢ్యం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నడక కూడా మంచిదే.



- నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్రించడం మంచిది. స్వచ్ఛమైన గాలి, ప్రశాంతమైన పరిసరాలు, తేలికపాటి భోజనం లాంటివి నిద్ర సమస్యలను దూరం చేస్తాయి.
- నీరసం, జీర్ణ సమస్యలు, దగ్గు, జలుబు, జ్వరం, విరేచనాలు, తలనొప్పి లాంటి సమస్యలు వస్తే వైద్యుని సంప్రదించాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

తెలుగు సినిమాకు
అవార్డుల పంట


- 2014- 2023 సినిమాలకు పురస్కారాలు
- ప్రకటించిన జ్యూరీ చైర్మన్ మురళీమోహన్
- ఏడాదికి మూడు చిత్రాల చొప్పున ఎంపిక
- నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 - 2023 మధ్య విడుదలైన సినిమాలకు అందించనున్న గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలను జ్యూరీ కమిటీ చైర్మన్, సీనియర్ నటుడు మురళీమోహన్ ప్రకటించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజుతో కలసి ఆయన అవార్డుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన చిత్రాలనే పరిశీలనకు తీసుకున్నట్లు తెలిపారు. మురళీ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అవార్డులను ఇవ్వడం ఆపివేశారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతగా తీసుకొని గద్దర్ పురస్కారాలను ప్రారంభించారని పేర్కొన్నారు. జ్యూరీ కమిటీ ఏకాభిప్రాయంతో ప్రతి ఏడాదికి మూడు చిత్రాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీటితో పాటు సినీ రంగానికి సేవలందించిన వారికి ఆరు ప్రత్యేక అవార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుకు నందమూరి బాలకృష్ణ, పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డుకు ప్రముఖ దర్శకుడు మణిరత్నం ఎంపికయ్యారు.

ఏపీలోనూ అవార్డులు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్‌లోనూ సినీ పురస్కారాలు ప్రకటించాలని సీనియర్ నటుడు మురళీ మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినిమాకు అవార్డులు ఇచ్చే విషయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అవగాహనకు రావాలని సూచించారు. 'ఒకే తెలుగు సినిమాకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అవార్డులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని నా అభిప్రాయం. ఇలా చేయడం అనవసరమైన చర్చలకు, వివాదాలకు దారితీస్తుంది. దీనికి బదులుగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఒక నిర్ణయానికి రావాలి. ఒక ఏడాది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటిస్తే, మరుసటి ఏడాది ఏపీ ప్రభుత్వం ప్రకటించాలి. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి. ఒక రాష్ట్రం ఎక్కువ, మరో రాష్ట్రం తక్కువ కాదు. సినిమాలను తెలంగాణ, ఆంధ్రా అంటూ వేర్వేరుగా చూడొద్దు. తెలుగు సినిమా ఒక్కటే. మనమంతా ఒక్కటే. మన సినిమా ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. మనకంటే ముందు సినిమాని అమెరికాలో చూస్తున్నారు. ప్రభుత్వాల ప్రోత్సాహం ఉంటే తెలుగు సినిమా ఖ్యాతి మరింత పెరుగుతుంది. విదేశాల్లోనూ మనకు మరింత ప్రత్యేక గుర్తింపు దక్కుతుంది' అని అన్నారు.





సంవత్సరం	మొదటి ఉత్తమ చిత్రం	రెండో ఉత్తమ చిత్రం	మూడో ఉత్తమ చిత్రం
2014	రన్ రాజా రన్	పాఠశాల	అల్లుడు శ్రీను
2015	రుద్రమదేవి	కంచె	శ్రీమంతుడు
2016	శతమానం భవతి	పెళ్లి చూపులు	జనతా గ్యారేజ్
2017	బాహుబలి: కన్‌క్లూజన్	ఫిదా	ఘాజి
2018	మహానటి	రంగస్థలం	కేరాఫ్ కంచెరపాలెం
2019	మహర్షి	జెర్సీ	మల్లేశం
2020	అల వైకుంఠపురములో	కలర్ ఫొటో	మిడిల్ క్లాస్ మెలోడీస్
2021	ఆర్ఆర్ఆర్	అఖండ	ఉప్పెన
2022	సీతారామం	కార్తికేయ-2	మేజర్
2023	బలగం	హనుమాన్	భగవంత్ కేసరి

ప్రత్యేక పురస్కారాలు

1. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు - నందమూరి బాలకృష్ణ
2. పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు - మణిరత్నం
3. బి.ఎన్.రెడ్డి ఫిల్మ్ అవార్డు - సుకుమార్
4. నాగిరెడ్డి- చక్రపాణి ఫిల్మ్ అవార్డు - అట్లూరి పూర్ణచంద్రరావు
5. కాంతారావు ఫిల్మ్ అవార్డు - విజయ్ దేవరకొండ
6. రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు - యండమూరి వీరేంద్రనాథ్
7. స్పెషల్ జ్యూరీ అవార్డు - ప్రజాకవి కాళోజీ

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ఇది దైవ నిర్ణయం..
నాన్న ఆశీర్వాదం




బాలకృష్ణ

ఎన్టీఆర్ జాతీయ అవార్డ్‌ను ఆయన తనయుడు బాలకృష్ణకు అందించనున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన అవార్డ్‌ను కొడుకు అందుకోవడం అరుదైన సంఘటనే. ఈ సందర్భంగా బాలకృష్ణ స్పందించారు. ఈ అవార్డ్‌ను అందుకోవడం అదృష్టంగా, దైవ నిర్ణయంగా, తండ్రి ఆశీర్వాదంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు పూర్తి చేసుకున్న అద్భుతమైన ఘడియలు ఒక వైపు, ఎన్టీఆర్ నట ప్రస్థాన 75 వసంతాల అమృతోత్సవాలు జరుగుతున్న శుభ ఘడియలు మరో వైపు, నటుడిగా నేను 50 ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న శుభ సందర్భం ఇంకో వైపు, కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మ భూషణ్‌తో సత్కరించిన తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాకు 'ఎన్టీఆర్ జాతీయ అవార్డ్' ప్రకటించడం నా అదృష్టం, దైవ నిర్ణయం, నాన్న ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, జ్యూరీ సభ్యులకు నా కృతజ్ఞతలు' అని ఓ ప్రకటనలో బాలకృష్ణ పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు ప్రత్యేక అవార్డులు

భారతీయ చిత్రపరిశ్రమకు విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు మహానటుడు ఎన్టీఆర్ గౌరవార్థం ఎన్టీఆర్ నేషనల్ అవార్డ్‌ను 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విభజన జరిగి రెండు రాష్ట్రాలుగా ఏర్పడే వరకూ ఈ అవార్డ్ ఇస్తూ వచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు అవార్డుల మీద దృష్టి పెట్టలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో సినీ అవార్డులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చి, అవార్డులను ప్రకటించింది. వాటితో పాటు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, రఘుపతి వెంకయ్య అవార్డ్, బీఎన్ రెడ్డి అవార్డ్, నాగిరెడ్డి-చక్రపాణి అవార్డులను పునరుద్ధరించింది. వీటితో పాటు కొత్తగా పైడి జైరాజ్ పేరుతో, కాంతారావు పేరుతో మరో రెండు అవార్డులను కొత్తగా ప్రవేశపెట్టింది.

సెన్సిబుల్ డైరెక్టర్‌కు పైడి జైరాజ్ అవార్డ్


మణిరత్నం


తెలంగాణలో పుట్టి, భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్రస్థాయికి ఎదిగి, తెలంగాణ కీర్తిని జాతీయ స్థాయిలో చాటి చెప్పిన గొప్ప నటుడు, కరీంనగర్ వాసి పైడి జైరాజ్. భారతీయ సినిమా తొలి దశలో ప్రారంభమైన మూకీల నుంచి టాకీల వరకూ సాగిన పైడి జైరాజ్ ప్రస్థానం ప్రశంసనీయం. భారతీయ సినిమా తెరపై తొలి యాక్షన్ హీరో ఆయనే కావడం విశేషాంశం. తెలంగాణకు ఎంతో ఖ్యాతి తెచ్చిన ఆ గొప్పనటుడు పేరుతో ఏర్పాటు చేసిన ఫిల్మ్ అవార్డ్‌ను తొలిసారిగా తమిళ దర్శకుడు మణిరత్నం అందుకోనున్నారు. సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరొందిన మణిరత్నం కీర్తి కిరీటంలో ఈ అవార్డ్ మరో కలికితురాయి.

సుకుమార్‌కు ఈ అవార్డ్ చాలా ప్రత్యేకం


సుకుమార్


తెలుగుతనాన్ని, వాస్తవికతను, మధ్య తరగతి జీవితాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించిన కళాత్మక దర్శకుడు బి.ఎన్.రెడ్డి. మూడు పదుల సినీ జీవితంలో ఆయన తీసినవి 11 చిత్రాలే. అయినా ప్రతి ఒక్క సినిమా ప్రేక్షకుల మనసుల్ని తాకింది. అటువంటి గొప్ప దర్శకుని పేరు మీద ఏర్పాటు చేసిన అవార్డ్ ను మరో గొప్ప దర్శకుడు సుకుమార్‌కు అందజేస్తున్నారు. పటిష్టమైన స్క్రీన్‌ప్లేతో కథను నడిపించడమే కాకుండా స్టార్ హీరోలను డీ గ్లామరైజ్డ్ పాత్రల్లో చూపించి పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన సుకుమార్ దర్శకత్వం వహించిన 'రంగస్థలం', 'పుష్ప' చిత్రాలు కూడా అవార్డుల జాబితాలో చోటు చేసుకోవడం విశేషంగా చెప్పాలి.

సాహసాల నిర్మాతకు నాగిరెడ్డి, చక్రపాణి అవార్డ్


అట్లూరి పూర్ణచంద్రరావు

చిత్ర పరిశ్రమలో స్నేహానికి ప్రతీకగా నిలిచిన గొప్ప వ్యక్తులు నాగిరెడ్డి, చక్రపాణి. ఒకటే మాట, ఒకటే బాట వీరిద్దరిదీ. విజయా పతాకంపై ఈ స్నేహితులిద్దరూ కలసి నిర్మించిన చిత్రాలన్నీ ఆణిముత్యాలే. వినోదం, సందేశం కలగలసిన విజయా వారి చిత్రాలు ఎన్ని సార్లు చూసినా ప్రేక్షకులకు విసుగనిపించదు. చిత్ర నిర్మాణరంగంలో ఓ ఒరవడిని ప్రవేశపెట్టిన నాగిరెడ్డి, చక్రపాణి పేరిట ఏర్పాటు చేసిన అవార్డ్‌ను మరో సీనియర్ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావుకు అందజేయనున్నారు. నిర్మాతగా ఎన్నో సాహసాలు, ప్రయోగాలు చేసిన పూర్ణచంద్రరావు మురళీమోహన్, గిరిబాబులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు.

కత్తివీరుడి స్మారక అవార్డ్ విజయ్ దేవరకొండకు


విజయ్ దేవరకొండ

జానపద చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరై 'కత్తి వీరుడు'గా పేరు తెచ్చుకున్న కాంతారావు పేరిట ఓ ప్రత్యేక అవార్డ్‌ను తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశ పెట్టింది. ఈ అవార్డును తెలంగాణ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండకు అందజేయనున్నారు.

యండమూరికి విశిష్ట పురస్కారం


యండమూరి వీరేంద్రనాథ్

తెలుగు సినిమా పితామహుడిగా ప్రఖ్యాతి పొందిన రఘుపతి వెంకయ్య పేరు మీద ఏర్పాటు చేసిన అవార్డ్‌ను ఈసారి ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు అందజేయనున్నారు. ఎన్నో చిత్రాలకు కథలు అందించిన యండమూరి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించారు కూడా.

నా దర్శకులకు ప్రేమ పంచుతున్నా



తను నటించిన 'శ్రీమంతుడు', 'మహర్షి' చిత్రాలకు, నిర్మించిన 'మేజర్' సినిమాకు తెలంగాణ ఫిల్మ్ అవార్డులు వచ్చినందుకు మహేశ్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందించడంతో పాటు సినీ పండగకు చొరవ చూపిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాల వెనుక ఉన్న దర్శకులకు మరింత ప్రేమ పంచుతున్నట్లు మహేశ్ వెల్లడించారు.

నాకు మరింత గౌరవం

కళాత్మక చిత్రాల దర్శకుడు బి.ఎన్.రెడ్డి పేరిట ఏర్పాటు చేసిన అవార్డ్‌కు తనకు ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని దర్శకుడు సుకుమార్ చెప్పారు. అంత గొప్ప అవార్డ్‌కు ఎంపిక చేయడం నా బాధ్యతను పెంచిందని తెలిపారు. తెలుగు సినీ రంగంలో శిఖరం లాంటి బి.ఎన్.రెడ్డి అవార్డ్ అందుకోవడం తనకు మరింత గౌరవం అని సుకుమార్ పేర్కొన్నారు.

ఎంతో సంతోషంగా ఉంది

'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌లో నట ప్రపూర్ణ కాంతారావు గారి స్మారక పురస్కారం నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అన్నారు విజయ్ దేవరకొండ. 'పెళ్లి చూపులు' చిత్రానికి రెండో ఉత్తమ చిత్రం పురస్కారం దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వానికి, జ్యూరీకి ధన్యవాదాలు తెలిపారు. అభిమానుల ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆయన చెప్పారు.

విశాఖలో నిర్మాతల భేటీ



తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలపై విశాఖపట్నంలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. దొండపర్తిలోని ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు సి.కల్యాణ్, నిర్మాతలు అశోక్ కుమార్, సుధాకర్‌రెడ్డి, భరత్ భూషణ్ తదితరులు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, స్టూడియోల నిర్వాహకులను కూడా ఆహ్వానించారు. అంతా కూర్చొని.. థియేటర్ల నిర్వహణ, సినిమాలు ప్రదర్శించినందుకు యాజమానులకు ఎంత పర్సంటేజీ ఇవ్వాలి వంటి అంశాలపై చర్చించారు. ఒక్కో విభాగం నుంచి తొమ్మిది మంది చొప్పున, మూడు విభాగాల (నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు) నుంచి మొత్తం 27 మందితో మూడు కమిటీల పేర్లను ప్రభుత్వానికి నివేదించనున్నట్టు నిర్మాత భరత్ భూషణ్ మీడియాకు తెలిపారు. ఈ జాబితాను ఆదివారం లేదా సోమవారం ప్రభుత్వానికి ఇస్తామని, అప్పుడే మీడియాకు కూడా అందజేస్తామన్నారు.

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

క్షమాపణ ప్రసక్తే లేదు



తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వడం తెలిసిందే. క్షమాపణలు చెప్పాలంటూ వస్తున్న డిమాండ్లపై కమల్‌హాసన్ స్పందించారు. తాను ఏమీ తప్పుగా మాట్లాడలేదని, అందువల్ల క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆయన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని రాజ్యసభ సభ్యుడిగా తనకు అవకాశం కల్పిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కమల్ చెల్లని నాణెం



కమల్‌హాసన్ చెల్లని నాణెం వంటి వాడని కేంద్రమంత్రి శోభా కరంద్లాజె అన్నారు. బెంగళూరులో ఎంఎస్ఎంఈల ప్రగతిపై శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి, మీడియాతో మాట్లాడారు. సినిమా ప్రచారం కోసం కన్నడ భాషను అవమానించడం సరికాదని కమల్ హాసన్‌పై మండిపడ్డారు. కన్నడ, తెలుగు, తమిళం, మళయాళం.. భాష ఏదైనా మనమంతా భారతీయులమని, కలసి జీవించాలని అన్నారు. మరొకరి భాషను అవమానించడం సరికాదని అన్నారు. అన్ని భాషల వాళ్ల ఆదరిస్తేనే సినీ పరిశ్రమకు మనుగడ సాధ్యమని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అటవీ చట్టాలు సంస్కరించండి

» కేంద్రానికి రాష్ట్ర మంత్రి సీతక్క విజ్ఞప్తి

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో నివసించే గిరిజనుల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలను అడ్డుకోకుండా అటవీ శాఖ చట్టాలను సంస్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఎస్డీఎఫ్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎం జన్మన్, ధర్తి అబజన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అనే కేంద్ర పథకాల అమలుపై శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో జరిగిన ఆగ్నేయ రాష్ట్రాల సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల గిరిజన సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు. అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేలకుపైగా పక్కా గృహాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ఇందిరా సౌరగిరి జల వికాసం' పథకం పేరిట పోడు భూములను రైతులు సేద్యం చేసుకునేందుకు వీలుగా సౌర విద్యుత్తు - పంపుసెట్లను అందించి నీటి పారుదల వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. సీఎస్ కె.రామకృష్ణారావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతి పథకం ఫలితాలు అడవుల్లోని ప్రతి గిరిజనుడికి అందుతాయని చెప్పారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్ మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రశంసించారు. సమర్థవంతంగా ఆయా పథకాల అమలుకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, ట్రైఫెడ్ ఎండీ హృదేశ్ కుమార్, ఛత్తీస్‌గఢ్ గిరిజన సంక్షేమశాఖ అధికారి సోన్‌మోని బోరో పాల్గొన్నారు.


కేంద్ర గిరిజన శాఖ అధికారికి గిరిజన ఉత్పత్తులను అందజేస్తున్న మంత్రి సీతక్క

ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం ఇవ్వండి

గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఐటీడీఏ పీఓలను మంత్రి సీతక్క కోరారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఐటీడీఏ పీవోలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఐటీడీఏ పరిధిలో ట్రైబల్ మ్యూజియం, విద్యార్థులకు లైబ్రరీ రీడింగ్ హాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో వాగుల మీద వంతెనల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని, అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల; చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బీఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్త పాలన

» రేవంత్ పాలనలో సమస్యలు పరిష్కారం: తుమ్మల

» అధికారులు అవినీతికి దూరంగా ఉండాలి: ఉత్తమ్

» సన్నబియ్యంతో సర్కారుకు మంచిపేరు: కోమటిరెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), మే 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాజకీయ, ఆర్థిక సమస్యలున్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అందరం కలిసి సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయం, భూభారతి, ఇరిగేషన్, ఇందిరమ్మ ఇళ్లపై నిర్వహించిన నల్లగొండ ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో అగ్రగామిగా నిలిచిందన్నారు. రైతుభరోసాకు రూ.13వేలకోట్లు, రైతుల రుణమాఫీకి రూ.21వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అవినీతికి ఆస్కారం లేకుండా పని చేయాలన్నారు. తప్పులు చేసే అధికారులు ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. గత పదేళ్లలో అధికారుల అలసత్వం, అవినీతి ఎక్కువగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటిన్నంటినీ విడనాడాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వాటిని సక్రమంగా అమలు చేయడంలో కలెక్టర్లు ముఖ్యభూమిక పోషించాలని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో లేకపోయినా సన్నబియ్యం ఇస్తున్నందున ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు.

ఆర్ఆర్ఆర్‌పై సీఎం రేవంత్ సమీక్ష

» దక్షిణ భాగం అలైన్‌మెంట్ పరిశీలన

» అధికారులకు పలు సూచనలు చేసిన సీఎం



హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానం (హ్యామ్)లో అభివృద్ధి చేయబోయే రోడ్లు, హైదరాబాద్-మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ రహదారులపైనా చర్చించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం రోడ్డు మొదలయ్యే చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు ఉన్న అలైన్‌మెంట్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. మార్గమధ్యంలో ఉన్న భూములు, నీటి వనరుల వివరాలు తెలుసుకున్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు పరిధిలో రాబోయే మార్గంపై పలు కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. అదే విధంగా హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయతలపెట్టిన పలు రోడ్ల గురించి కూడా ఆరా తీశారు. ఆర్అండ్‌బీ పరిధిలో హ్యామ్ కింద మొదటి దశలో 5,190 కి.మీ. మేర రోడ్లను నిర్మించాలని గుర్తించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. మొదటి దశలో గ్రామ, మండల, జిల్లా అనుసంధాన రోడ్లు ఎన్ని ఉన్నాయనే వివరాలను కూడా తెలిపారు. హ్యామ్ రోడ్లపై జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎం రేవంత్ సూచించినట్లు తెలిసింది. ఇక హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు రూపొందించిన మూడు ప్రతిపాదనలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్కడి నుంచి రహదారిని నిర్మించేందుకు అవకాశం ఉందనేదానిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ మార్గంపైనా పలు సూచనలు చేశారు. కాగా, ఏషియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించిన అగసర నందినికి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

ఆ అసైన్డ్ భూముల స్వాధీనమే!

బడా బాబుల చేతుల్లో ఉంటే తీసేసుకుంటాం.. కవిత వివాదం టీ కప్పులో తుఫానులాంటిదే: పొంగులేటి

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు బడాబాబుల చేతుల్లో ఉంటే, వాటిని స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసైన్డ్ భూముల హక్కులను తండ్రి నుంచి వారసులకు బదిలీ చేసే అవకాశం గతంలో లేదని.. భూభారతి చట్టం కింద ఆ అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఇవే భూములను పేదలు కొనుగోలు చేసి ఉంటే వారికీ హక్కులు కల్పిస్తామన్నారు. ధనవంతుల చేతుల్లో ఉంటే మాత్రం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. తొలి విడత రెవెన్యూ సదస్సులు నిర్వహించిన నాలుగు మండలాల్లో 13వేల దరఖాస్తులు వచ్చాయనిచెప్పారు. చట్టబద్ధంగా పరిష్కరించగల అంశాలను పరిష్కరించామని, తిరస్కరించిన దరఖాస్తులకు ఎందుకు తిరస్కరించామనే వివరణ కూడా ఇచ్చామని తెలిపారు. సాదాబైనామా కింద ఆన్‌లైన్‌లో 9.26లక్షల దరఖాస్తులు ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టులో స్టే ఉందని, దాన్ని ఎత్తివేయించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లోనూ అత్యధికంగా సాదాబైనామా దరఖాస్తులే వస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలనీ దరఖాస్తులొచ్చాయని, అలాంటి వాటిని ఆమోదించబోమని స్పష్టంచేశారు. రెండో విడత రెవెన్యూ సదస్సులు నిర్వహించిన 28 మండలాల్లో 46వేల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటిలో 21 శాతం దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. సర్వే నంబరు ఒకచోట, భూమి మరోచోట ఉన్న రైతులకు వారి సర్వే నంబర్లలో ఉన్న భూ మార్పిడికి అవకాశం కల్పించామని చెప్పారు. ధరణిలో సక్రమంగా చేసి ఉంటే ఇవాళ ఇన్ని దరఖాస్తులు వచ్చేవి కావన్నారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన 2.10లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇప్పటిదాకా రూ.135కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు. కేటీఆర్‌ను తన నియోజకవర్గంలోని లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని కోరితే ఇవ్వలేదన్నారు. మురికివాడల్లో ఉండే పేదల కోసం కోర్‌అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో జీ+4 అంతస్తుల భవనాలు నిర్మిస్తామని చెప్పారు. హైదరాబాద్ పరిధిలో 16మురికివాడలను గుర్తించామన్నారు. పేదలు నివాసం ఉండే చోటు ప్రభుత్వ స్థలమైతే అక్కడే నిర్మాణాలు చేయిస్తామని, ప్రయోగాత్మకంగా 10మురికివాడల్లో చేపడతామని తెలిపారు.



3 నుంచి రెవెన్యూ సదస్సులు

జూన్ 3 నుంచి18 వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని పొంగులేటి చెప్పారు. సర్వే శాఖను బలోపేతం చేస్తున్నామని, త్వరలో 700మంది రెగ్యులర్ ఉద్యోగులను నియమించనున్నామని తెలిపారు. 7000 మంది సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరికి పరీక్ష పెడతామని, ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్ సర్వేయర్లుగా అవకాశం కల్పిస్తామని చెప్పారు. గ్రామపాలనాధికారుల పరీక్షలో 3550మంది ఉత్తీర్ణులయ్యారని,2లోపు వారికి నియామక ఉత్తర్వులిస్తామని వెల్లడించారు. ఆర్థికపరమైన కారణాల వల్లే ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే ఏజెన్సీ ఎంపికలో జాప్యం జరిగిందని, వారంలోగా దీనిపై ఉత్తర్వులిస్తామన్నారు. త్వరలోనే భూబకాసురుల పనిపడతామని చెప్పారు. జీవో59 ముసుగులో పుప్పాలగూడ, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో 9-10ఎకరాల భూములను 999గజాల చొప్పున విడగొట్టి, బినామీల పేరుతో విక్రయంచేశారని తెలిపారు.

బీఆర్ఎస్ నేతల బుద్ధి మారలేదు

కాళేశ్వరం విషయంలో రోజూ మీడియా ముందు అబద్ధాలు చెప్పి, ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఓడించిన తర్వాత కూడా వారి బుద్ధి మారలేదన్నారు. తాము కక్ష సాధింపులకు పాల్పడాలనుకుంటే తొలి ముద్దాయిగా కేసీఆర్‌నే పిలిచేలా కమిషన్‌పై ఒత్తిడి చేసేవాళ్లమని చెప్పారు. ఎల్అండ్‌టీ సంస్థ కూడా ఒక ముద్దాయే అని, ఆ సంస్థ ఇచ్చిన నివేదికను అడ్డు పెట్టుకుని ఓ పత్రికలో క్లీన్‌చిట్ ఇచ్చినట్లు రాసుకున్నారని చెప్పారు. కమిషన్ ముందు కేసీఆర్ పీపీటీ ఇస్తున్నారని ప్రస్తావించగా.. ఆయనలో ఉన్న శిల్పి గురించి ప్రజెంటేషన్ ఇస్తారా? అని ఎద్దేవా చేశారు. కవితకు మంత్రి పదవి ఇస్తున్నారా? ఏ చాంబర్ కేటాయిస్తారు? వంటి విషయాలు మాట్లాడే స్థాయి తనకు లేదని చెప్పారు. కవిత వివాదం టీ కప్పులో తుఫాన్ లాంటిందని పేర్కొన్నారు. ఎవరి మీద పోరాటం చేస్తోందనేది కవిత చెబుతుందని తానూ ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. పూర్తికాలం రేవంత్‌రెడ్డే సీఎంగా కొనసాగుతారని, ఆయన పదవికి ఎలాంటి ఢోకా లేదని చెప్పారు. రాహుల్ గాంధీతో అర్ధరాత్రి కూడా మాట్లాడేంత చనువు రేవంత్‌కు ఉందన్నారు. ఈడీ తన ఇంట్లో సోదాలు చేయలేదని.. దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తన కుమార్తె ఉన్న ఇంటిపైనే ఈడీ సోదాలు చేసిందని చెప్పారు. క్యాబినెట్ విస్తరణపై విలేకరులు ప్రస్తావించగా.. త్వరలోనే జరుగుతుందన్నారు.

కేసీఆర్, ఈటల పాత బంధం చిగురించింది

(మొదటి పేజీ తరువాయి)

కొట్లాట జరుగుతోందని చెప్పారు. అసెంబ్లీలో 8 సీట్లున్న బీజేపీతో బీఆర్ఎస్ కలిస్తే.. ఆ పార్టీ 8 సీట్లకే పరిమితమవుతుందన్నారు. కేసీఆర్ కూతురు కవిత, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యల్ని పోల్చి చూస్తే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యమన్న సంగతి స్పష్టమవుతోందని వెల్లడించారు. రాజాసింగ్, కవిత వ్యాఖ్యలతో బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం గుట్టు వీడిందన్నారు. రాజాసింగ్ లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పకుండా.. రాహుల్‌పై విమర్శలు చేయడం బీజేపీ నేతల చేతగానితనమేనని మహేశ్ మండిపడ్డారు. 'పాక్‌పై యుద్ధంతో సాధించిందేంటి.. కోల్పోయింది ఏంటని ప్రజలు అడుగుతున్నారు. ఇందిరాగాంధీని వాజ్‌పేయీ.. అపర కాళీ అని అభివర్ణించిన సంగతి కిషన్‌రెడ్డికి తెలియకపోవడం విడ్డూరం. ఇందిర హయాంలోనే అప్పటి కాంగ్రెస్‌ప్రభుత్వంవందల సర్జికల్ స్ట్రైక్‌లను చేసింది. సైనిక రహస్యాల్ని బీజేపీ తన రాజకీయ స్వార్థం కోసం వాడుకోవాలని చూడటం శోచనీయం. కేసీఆర్, కిషన్‌రెడ్డిల వల్లే బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారంటూ రాజాసింగ్.. పరోక్షంగా చెప్పారు' అని వ్యాఖ్యానించారు. కవిత లేఖ లీకు వెనుక.. ఆమె ప్రమేయం.. కుటుంబ సభ్యుల ప్రమేయమూ ఉండొచ్చునన్నారు.

తిరుమల క్యూలైన్‌లో భక్తుల ఆందోళన

తిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి): తిరుమల సర్వదర్శన క్యూలైన్‌లో శుక్రవారం రాత్రి భక్తులు ఆందోళనకు దిగారు. టీటీడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీటీడీ సమయానికి ఆహారం అందించలేదని, సకాలంలో దర్శనం చేయించడం లేదని సర్వదర్శన క్యూలైన్లలోని భక్తులు రాత్రి 10.30 గంటల సమయంలో నిరసన వ్యక్తం చేశారు. 'టీటీడీ చైర్మన్ డౌన్‌డౌన్, భక్తులకు సౌకర్యాలు కల్పించాలి, పసిపాపలకు పాలు అందించాలి, ఆడవాళ్లకు ప్రత్యేక దర్శనం చేయించాలి, అధికారులు రావాలి, భక్తులను కాపాడాలి' అంటూ క్యూలైన్లలో నినాదాలతో హోరెత్తించారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు వారాంతం కావడంతో తిరుమలలో శుక్రవారం ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరిగింది.

సమస్యల పరిష్కారంపై సీఎంతో చర్చిస్తా

» ఆర్టీసీ జేఏసీ నాయకులకు మంత్రి పొన్నం హామీ

హైదరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై జూన్ 2లోగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై చర్చిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు శుక్రవారం మంత్రి పొన్నంను కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. సీఎంతో జరిగే సమావేశానికి జేఏసీ నాయకులను కూడా ఆహ్వానిస్తామని మంత్రి చెప్పినట్లు జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. అనంతరం సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్‌ను జేఏసీ నేతలు కలిశారు. మంత్రితో జరిపిన చర్చల అంశాలను వివరిస్తూ, వినతిపత్రాన్ని అందజేశారు.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై సర్వే

» ఆరు నదుల ప్రవాహంపై చేయాలని సీడబ్ల్యూసీ నిర్ణయం

» సర్వే ఖర్చు పోలవరం ప్రాజెక్టు అథారిటీదే!

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గోదావరిలో పలు నదుల ప్రవాహాలు సజావుగా కలవకుండా, ముంపునకు కారణమవుతున్నాయన్న తెలంగాణ అభ్యంతరాలపై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) స్పందించింది. ఆయా నదుల ప్రవాహాలపై సర్వే చేసేందుకు సమ్మతి తెలిపింది. సర్వే చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) కూడా సీడబ్ల్యూసీని కోరింది. నదుల క్రాస్ సెక్షన్లకు సంబంధించిన వివరాలూ అందించింది. సర్వేకయ్యే వ్యయాన్ని పీపీఏ భరించనుంది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ హైదరాబాద్‌లోని కృష్ణా-గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ (కేజీబీవో)ను సీడబ్ల్యూసీ ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం లేఖ రాసింది. నదుల ప్రవాహాలపై సర్వే చేశాక, నివేదికపై తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులతో కౌంటర్ సంతకం చేయించాలని ఆదేశించింది.

ఆ బ్యారేజీల్లో సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో పరీక్షలు

» ఎస్ఈకి రామగుండం చీఫ్ ఇంజనీర్ లేఖ

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం కాళేశ్వరం బ్యారేజీలపై కేంద్ర నీటి, విద్యుత్తు పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ద్వారా పరీక్షలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు వర్క్ ఆర్డర్ ఇవ్వాలని రామగుండం చీఫ్ ఇంజనీర్ శుక్రవారం ఎస్ఈకి లేఖ రాశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పరీక్షల కోసం రూ.19.4 కోట్లు కానుండగా.. వెంటనే సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు వర్క్ ఆర్డర్ ఇవ్వనున్నారు. పరీక్షల అనంతరం ఇచ్చే నివేదిక ప్రకారం ప్రణాళికను సిద్ధం చేసి, బ్యారేజీల మరమ్మతులకు సీడబ్ల్యూసీ ఆమోదం తీసుకోనున్నారు.

టైటిల్ నిర్ధారించే అధికారం తహసీల్దార్‌కు లేదు

» నిబంధనల్లేకుండా ప్రభుత్వ భూమిగా ప్రకటించలేరు: హైకోర్టు

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి నిబంధనలను ప్రస్తావించకుండా, భూమిపై టైటిల్‌ను నిర్ణయించే అధికారం తహసీల్దార్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌లో ఓల్డ్ సర్వే 380 నెంబర్‌లోని దాదాపు 5 ఎకరాల తోళ్ల కార్ఖానా భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ 2019లో తహసీల్దార్ జారీచేసిన ఉత్తర్వులను కొట్టివేసింది. ఆ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించడం చెల్లదని పేర్కొంటూ మహమ్మద్ నిజాముద్దీన్ అనే వ్యక్తి నుంచి ప్లాట్లు కొనుగోలు చేసిన 40మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏ అధికారం ద్వారా తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారని ప్రశ్నించింది. ఒకవేళ పిటిషనర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉంటే భూదురాక్రమణ నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. రెవెన్యూ రికార్డులు, ఎంట్రీలు భూమిపై ఎలాంటి హక్కును నిర్ధారించలేవని, ఆఅధికారం తహసీల్దార్‌కు లేదని పేర్కొంది. ప్రభుత్వ భూమి అటూ తహసీల్దారు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది.

నదుల అనుసంధానంపై మళ్లీ ఫోకస్!

జూన్ 24న సీడబ్ల్యూసీ, నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ భేటీ.. సగం వాటాకు తెలంగాణ డిమాండ్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ నదుల అనుసంధానం అంశంలో మళ్లీ కదలిక వచ్చింది. దీనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాలపై వచ్చేనెల 24వ తేదీ ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని జల సౌధలో సమావేశం జరుగనున్నది. కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే ఈ భేటీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ కమిటీ కూడా పాల్గొంటుంది. ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలని పదే పదే పట్టు బట్టిన ఏపీ.. తాజాగా రూట్ మార్చింది. రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో పోలవరం నుంచి 200 టీఎంసీల నీటిని తరలించేందుకు కొత్తగా గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును తెర మీదకు తెచ్చిన ఏపీ.. దీని నిర్మాణానికి 2014- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 46(2), 46(3) సెక్షన్ల కింద వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద నిధులు కేటాయించాలని కోరుతోంది. గోదావరి-బనకచర్ల అనుసంధానంలో భాగంగా పల్నాడు జిల్లా బొల్లాపల్లిలో నిర్మించనున్న 200 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్ నుంచి గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టి కావేరీ బేసిన్‌కు నీటిని తరలించే ప్రతిపాదన పరిశీలించాలని కేంద్రాన్ని ఏపీ కోరింది. ఇప్పటి వరకూ సమ్మక్క సాగర్ నుంచి గోదావరి - కావేరీ అనుసంధానానికి ఎన్‌డబ్ల్యూడీఏతోపాటు కేంద్ర జలశక్తిశాఖ మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఏపీ ప్రతిపాదన నేపథ్యంలో జూన్ 24న జరిగే సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

రక్షణ కల్పించాలి: తెలంగాణ

గోదావరి-కావేరీ అనుసంధానంలో భాగంగా తరలించే 148 టీఎంసీల్లో 74 (50%) టీఎంసీల నీటిని తమకు కేటాయించాలని తెలంగాణ కోరుతున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లా గొట్టిముక్కల ఎగువన వ్యాలీలపై 2 రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు వాటికి సమ్మక్క బ్యారేజీ నుంచి నీటిని వాడుకోవడానికి వెసులుబాటు కల్పించాలని వాదిస్తోంది. మరోవైపు, కృష్ణా జలాల పంపిణీపై ట్రైబ్యునల్ విచారణలో నీటి వాటాలు తేలిన తర్వాతే గోదావరి-కావేరీ లింక్‌లో నాగార్జున సాగర్ రిజర్వాయర్‌ను ఆన్ లైన్ రిజర్వాయర్ (బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)గా వినియోగించుకోవాలని ప్రతిపాదించింది. 83 మీటర్ల ఎత్తులో ఉన్న సమ్మక్క బ్యారేజీలో 83-87 మీటర్ల మధ్య నిల్వ చేసిన నీటిని మాత్రమే గోదావరి-కావేరీ అనుసంధానం కింద తరలించాలని తెలంగాణ సూచించింది. 83 మీటర్ల దిగువన ఉన్న నీటిని ముట్టుకోరాదని కూడా స్పష్టం చేసింది. సమ్మక్క బ్యారేజీ కింద 50 టీఎంసీలు, సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు కింద 70 టీఎంసీలు, దేవాదులలో 38 టీఎంసీలను కలుపుకుని 158 టీఎంసీల అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగానికి తమకు రక్షణ కల్పించాలని తెలంగాణ మరో ప్రతిపాదన చేసింది. ఇక గోదావరి- కావేరీ అనుసంధాన ప్రక్రియలో సమ్మక్క బ్యారేజీ కన్వేయర్‌ను వినియోగించుకోవాలని సూచించింది.

మా ప్రతిపాదన ఆమోదించాలి

పోలవరం-కృష్ణా-పెన్నార్-కావేరీ లింక్ పేరిట గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని ఏపీ ప్రతిపాదించింది. 14 ఏళ్ల క్రితం రూపొందించిన గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టు డీపీఆర్‌ను పక్కన బెట్టి తమ ప్రతిపాదనలను ఆమోదించాలని వ్యాఖ్యానించింది. గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టుపై అధ్యయనం పూర్తయిందని గుర్తు చేసిన ఏపీ.. దాన్ని పల్నాడు జిల్లాలో గోదావరి-బనకచర్ల అనుసంధాన బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి చేపట్టాలని కోరింది.

వరంగల్‌లో ఉగ్ర కలకలం!

» నగరంలో పలుచోట్ల ఎన్ఐఏ తనిఖీలు

» ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ

» ఆలస్యంగా వెలుగులోకి..

వరంగల్, మే 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో ఉగ్రవాదులు పేలుళ్లకు కుట్ర చేస్తున్నారనే సమాచారంతో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వరంగల్‌లో పలుచోట్ల సోదాలు నిర్వహించింది. ఉగ్ర కుట్రలో ఏపీ పోలీసులు పట్టుకున్న విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్ 20 మందితో సోషల్ మీడియాలో ఓ గ్రూపు ఏర్పాటు చేసినట్లుగా ఎన్ఐఏ గుర్తించింది. సౌదీలో ఉంటున్న అబూ ముసబ్‌తో వీరు కాంటాక్టులో ఉన్నట్లుగా గుర్తించారు. వీరంతా సోషల్ మీడియా గ్రూపులో తరచూ మాట్లాడుకోవడం, చాటింగ్ చేసేవారు. సిరాజ్‌ను విచారించే క్రమంలో సోషల్ మీడియా గ్రూపులో వరంగల్‌కు చెందిన పరహన్ సభ్యుడిగా ఉన్నట్లుగా ఎన్ఐఏ బృందం దృష్టికి వచ్చింది. దీంతో వారం రోజులుగా హైదరాబాద్, వరంగల్‌లలో దర్యాప్తు చేస్తున్నారు. సమీర్ ద్వారా వరంగల్‌కు చెందిన పరహన్‌తో సిరాజ్‌కు పరిచయం ఏర్పడింది. జిహాద్ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికి సిద్ధమవ్వాలని సోషల్ మీడియా గ్రూపులో చాటింగ్‌లు చేసుకున్నట్లు ఎన్ఐఏ తనిఖీల్లో వెల్లడైంది. గత వారం వరంగల్‌లో పరహన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వరంగల్, కాజీపేటలకు చెందిన మరో ఇద్దరి పేర్లు చెప్పినట్లు సమాచారం. ఈ ముగ్గురిని వేర్వేరుగా ఎన్ఐఏ బృందం విచారించింది. అయితే వీరికి ఎలాంటి ఉగ్ర కుట్రలో భాగస్వామ్యం లేదని తేలినట్లుగా స్థానిక పోలీసుల సమాచారం. కాగా ఉగ్ర కుట్రలపై ఎన్ఐఏ తనిఖీల విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది.

55 ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు నోటీసులు

» నిబంధనలు పాటించని కాంట్రాక్టర్ల తొలగింపు

» విజిలెన్స్ నివేదికపై చర్యలకు రంగం సిద్ధం

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో రోగులకు భోజనం అందించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందన్న విజిలెన్స్ నివేదిక మేరకు రాష్ట్రవ్యాప్తంగా 55 ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సూపరింటెండెంట్లకు వైద్య ఆరోగ్య శాఖ షోకాజ్ నోటీసులు జారీచేసింది. కాంట్రాక్టర్లపైనా చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వాస్పత్రుల్లోని రోగులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని, డైట్ మెనూ పాటించడం లేదని ప్రభుత్వానికి ఫిర్యాదులొచ్చాయి. దీనిపై సర్కారు విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ నివేదిక సర్కారు అందింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలకు ఉపక్రమించింది. మొత్తం 55 మంది ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఇందులో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని 40ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్.. వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని 15 ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు డీఎంఈ నరేంద్రకుమార్‌షోకాజ్ నోటీసులిచ్చారు. మెనూ పాటించని, రోజూ ఒకే తరహా భోజనం పెట్టేవారిని, పరిశుభ్రత పాటించని కాంట్రాక్టర్లను తక్షణమే తొలగించాలని కలెక్టర్లను వైద్య శాఖ ఆదేశించింది. ఆస్పత్రుల్లో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించింది.



సారంగి నివాసంలో అధికారులు గుర్తించిన నగదు

కిటికీలో నుంచి కరెన్సీ వర్షం

విజిలెన్స్ దాడికి భయపడి నోట్ల కట్టలు బయటకు విసిరేసిన ఒడిసా ఇంజనీర్

భువనేశ్వర్, మే 30 : ఒడిసా రాజధాని భువనేశ్వర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద శుక్రవారం కరెన్సీ వర్షం కురిసింది. ఒడిసా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న వైకుంఠనాథ్ సారంగి ఈ వర్షం కురిపించాడు. సోదాల నిమిత్తం తన ఇంటికి వచ్చిన విజిలెన్స్ అధికారులను చూసి కంగుతిన్న సారంగి.. తన దగ్గరున్న కొన్ని కరెన్సీ నోట్ల కట్టలను కిటికీలో నుంచి బయటికి విసిరేశాడు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై చీఫ్ ఇంజనీర్ వైకుంఠనాథ్ సారంగిపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. భువనేశ్వర్‌లో వైకుంఠనాథ్ నివాసముంటున్న ఫ్లాట్ సహా ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. తాను అక్రమంగా సంపాదించిన డబ్బు సంగతి బయటపడకూడదనే ఆలోచనతో సారంగి భువనేశ్వర్‌లోని తన ఇంటి కిటికీలో నుంచి కొన్ని రూ.500 నోట్ల కట్టలు బయటికి పారేశాడు. ఈ చర్యను గుర్తించిన అధికారులు ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ సోదాల్లో రూ.2.1 కోట్లు నగదును అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ సిబ్బంది ఆ నగదును లెక్కిస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి.

చిన్న రుణ గ్రహీతలను మినహాయించండి

- పసిడిపై 2 లక్షల వరకు రుణాలు తీసుకునే వారికి మినహాయింపు
- తమిళ పార్టీల వ్యతిరేకతతో ఆర్బీఐకి కేంద్ర ఆర్థిక శాఖ సూచన

న్యూఢిల్లీ, మే 30: బంగారం తాకట్టుపెట్టి రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకునే చిన్న రుణ గ్రహీతలను కొత్త మార్గదర్శకాల నుంచి మినహాయించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ 9న బంగారం రుణాలపై ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసింది. బంగారం తాకట్టు పెట్టుకుని ఇచ్చే రుణ విలువ పసిడి విలువలో 75% కంటే ఎక్కువ ఉండరాదని మార్గదర్శకాల్లో పేర్కొంది. దీనిపై తమిళనాడులోని రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ మార్గదర్శకాల వల్ల సన్నకారు రైతులకు రుణాలు లభించడం కష్టమవుతుందని, జోక్యం చేసుకోవాలంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్ర ఆర్థికమంత్రికి లేఖ రాశారు. దీంతో ఆర్‌బీఐ జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలను ఆర్థికసేవల విభాగం పరిశీలించి చిన్న రుణ గ్రహీతలపై ప్రభావం పడకుండా కొత్త మార్గదర్శకాలు ఉండాలని సూచించింది.

లోకం తీరు



నేవీ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగితే
పాక్ నాలుగు ముక్కలయ్యేది!

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యలు

పనాజి/పూంచ్/జమ్మూ, మే 30: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకా దళం సన్నద్ధమైన తీరును రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఇది చూసి పాకిస్థాన్ భయపడిపోయిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగి ఉంటే.. 1971 నాటికంటే తీవ్రమైన పరిణామాలను పాకిస్థాన్ ఎదుర్కొని ఉండేదని, ఆ దేశం నాలుగు ముక్కలయ్యేదని వ్యాఖ్యానించారు. మన దేశీయ యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను రాజ్‌నాథ్ శుక్రవారం సందర్శించారు. ప్రస్తుతం అరేబియా సముద్రంలో మోహరించి ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ సన్నద్ధతను సమీక్షించారు. ఇక ముందు కూడా నేవీ పూర్తి సన్నద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. కాగా, మన భద్రతా దళాల దెబ్బకు పాకిస్థాన్ ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ, అమర్‌నాథ్ యాత్ర సన్నాహాలపై సమీక్షించడంతో పాటు పాక్ జరిపిన షెల్లింగ్ దాడులకు గురైన బాధిత కుటుంబాలను కలుసుకోవడానికి జమ్మూలో ఆయన చేపట్టిన రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. పాక్ దురాక్రమణకు దీటుగా స్పందించిన సరిహద్దు భద్రతా దళాన్ని(బీఎస్ఎఫ్)ను ఆయన ప్రశంసించారు.

పాక్‌లో ఉగ్రవాదులు మరణిస్తే సంతాపమా ?

- కొలంబియా తీరుపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అసహనం

న్యూఢిల్లీ, మే 30: భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు చనిపోతే వారికి కొలంబియా సంతాపం తెలియజేయడంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాక్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శశిథరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియా రాజధాని నగరంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సానుభూతి తెలియజేయకుండా.. భారత్ చేసిన దాడుల్లో పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలియజేయడం తమకు నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. కాగా, ఆరేళ్ల క్రితం మోదీ సర్కారు జమ్మూ కశ్మీర్ నుంచి ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం విదేశాలకు పంపిన పార్లమెంటరీ ప్రతినిధుల బృందంలో ఒకరైన సల్మాన్ ఖుర్షీద్ గురువారం ఇండోనేసియాలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు.

అసద్ ప్రసంగాలకు ఫిదా

- ఉగ్రవాదాన్ని ఎండగడుతూ సౌదీలో ఉపన్యాసాలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ దురాగతాన్ని ఎండగట్టేందుకు విదేశాలకు బయలుదేరిన ఎంపీల బృందాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వేదికలపై భారత అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నాయి. ఇందులో భాగంగా అరబ్ దేశాలకు వెళ్లిన అఖిలపక్ష బృందంలో ఉన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. తన ప్రసంగాలతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఇస్లాం చరిత్రను ఉదహరిస్తూ పాకిస్తాన్‌ను అరబ్ ప్రతినిధుల ముందు ఎండగడుతున్న తీరుకు ఎంపీలు ఫిదా అవుతున్నారు. విదేశీయులు, ప్రవాసీలతో ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లోనూ ఒవైసీ తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంటున్నారు. బుధ, గురువారాల్లో సౌదీ అధికార ప్రముఖులను రియాద్‌లో కలిసిన ఒవైసీ.. గురువారం సాయంత్రం భారతీయ ఎంబసీ ప్రవాస భారతీయులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరు కాలేదు. అధికారిక కార్యక్రమాలను ముగించుకుని రియాద్ నుండి మదీనా వెళ్లారు. అక్కడ ప్రార్థనలు చేసిన అనంతరం నేరుగా అల్జీరియా రాజధాని అల్జీర్స్‌కు వస్తానని చెప్పి వెళ్లిపోయారు. రియాద్‌లో ఎంబసీకి వచ్చిన ప్రతినిధులలో అత్యధికులు ఒవైసీ ప్రసంగాన్ని వినడానికి వచ్చారు. అరబ్ ప్రతినిధుల ముందు అసద్ వాదించిన తీరు అద్భుతంగా ఉందని, తమకు ఇస్లాంపై అంతగా అవగాహన లేకపోవడంతో ఒవైసీలా వివరించలేకపోయామని ఎంపీలు తెలిపారు. పాకిస్థాన్‌పై ఒవైసీ మాట్లాడిన తీరు, ఇస్లామిక్ నేపథ్యంలో వివరించిన విధానం అరబ్బులను ఆకట్టుకుందని వెల్లడించారు.

ఆయుష్ సురక్షా పోర్టల్ ప్రారంభం

- మందులపై తప్పుడు ప్రకటనల నివారణే లక్ష్యం

న్యూఢిల్లీ, మే 30: సంప్రదాయ వైద్యంపై తప్పుదోవ పట్టించే ప్రకటనలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందు కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆయుష్ సురక్షా పోర్టల్‌ను కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ శుక్రవారం ఇక్కడ ప్రారంభించారు. గత ఏడాది సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రం ఈ పోర్టల్‌ను రూపొందించింది. తప్పుదోవపట్టించే ప్రకటనలు, మందుల దుష్ప్రభావాలపై ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. సామాన్య ప్రజలతో పాటు, వైద్యులకు కూడా ఇది ఉపకరిస్తుందని మంత్రి చెప్పారు. దీని ద్వారా ఫిర్యాదులు చేసే అవకాశం కూడా ఉందని ఆయుష్ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా తెలిపారు.

జస్టిస్ వర్మ కేసులో పక్కా ఆధారాలు

- నోట్ల కట్టలు దాచిన స్టోర్ రూం

జడ్జి కుటుంబం ఆధీనంలోనే.. తిసభ్య కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, మే 30: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో బయటపడ్డ నోట్ల కట్టల వ్యవహారంపై దర్యాప్తు జరిపిన త్రిసభ్య కమిటీ స్పష్టమైన ఆధారాలను నివేదికలో పొందుపరిచినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జస్టిస్ వర్మ నేరానికి పాల్పడినట్టు ఆ కమిటీ అభిప్రాయపడింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ కమిటీని నియమించడం గమనార్హం. జడ్జి నివాసంలోని స్టోర్ రూంలో ఆ నగదును దాచిపెట్టగా, అందులో కొంత అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఆ స్టోర్ రూం జడ్జి, ఆయన కుటుంబ సభ్యుల ప్రత్యక్ష నియంత్రణలోనే ఉన్నట్టు కమిటీ గుర్తించింది. మే 15న కాలిపోయిన నగదులో కొంత భాగాన్ని తొలగించినట్టు కూడా ఆధారాలు సేకరించింది. ఎలక్ట్రానిక్ రూపంలోనూ మరికొన్ని సాక్ష్యాలను గుర్తించింది. ఈ ఆధారాలను విశ్లేషించిన కమిటీ 50మందికిపైగా వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేసింది. న్యాయమూర్తి పదవి నుంచి జస్టిస్ వర్మను తొలగించేందుకు ఈ ఆధారాలు సరిపోతాయని అభిప్రాయపడింది.

ఈడీ అధికారిని అరెస్టు చేసిన సీబీఐ

(మొదటి పేజీ తరువాయి)

రఘువంశీ ఆయనపై ఒత్తిడి తెచ్చినట్టు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఇందులో భాగంగా మొదటి విడత రూ. 20 లక్షలు ఇస్తుండగా అరెస్ట్ చేసి, సీబీఐ కోర్టు ముందు హాజరుపరిచామని అధికారులు తెలిపారు. రఘువంశీ తరపు న్యాయవాది సిద్ధాంత్ మహంతి మాట్లాడుతూ ఆయనకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు చెప్పారు. అయితే బెయిల్ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉందని, జూన్ 4న విచారణకు వస్తుందని మహంతి తెలిపారు.

'బ్రహ్మోస్'తో పాక్‌కు నిద్ర లేని రాత్రులు

ఉగ్ర, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసిన క్షిపణులు.. స్వదేశీ ఆయుధ శక్తిని ప్రపంచం గుర్తించింది: మోదీ



సభలో మోదీ అభివాదం

కాన్పూర్, మే 30: బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులను మిగిల్చాయని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక శక్తిని యావత్ ప్రపంచం కళ్లారా చూసిందని చెప్పారు. జమ్మూకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి మన బలగాలు దీటుగా బదులిచ్చాయని, పాక్‌లోని ఉగ్రవాదులకు తగిన గుణపాఠం నేర్పాయని తెలిపారు. శుక్రవారం మోదీ బిహార్, యూపీలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయడంతో పాటు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రూ.47,600 కోట్ల విలువైన 15 అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రక్షణ రంగంలో పెద్దపెద్ద కంపెనీలు ఉత్తరప్రదేశ్‌కు వస్తున్నాయన్నారు. అమేఠీలో ఏకే203 రైఫిల్ తయారీ ప్రారంభమైందని చెప్పారు. ఈ సందర్భంగా మోదీ ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారు. మన అక్కచెల్లెళ్ల సిందూరాన్ని తుడిచివేసిన ఉగ్రమూకల పీచమణిచామని, పాక్‌లోని వాళ్ల స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత స్వదేశీ ఆయుధ శక్తి ప్రపంచానికి తెలిసిందని పేర్కొన్నారు. పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను మన క్షిపణి వ్యవస్థలు ధ్వంసం చేశాయన్నారు. బ్రహ్మోస్ క్షిపణులు.. శత్రువులకు నిద్రలేని రాత్రులను మిగిల్చాయని మోదీ చెప్పారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. స్వదేశీ ఆయుధ సామర్థ్యం, మేకిన్ ఇండియా శక్తిని ఇది ప్రపంచానికి చూపించింది. పాకిస్థాన్‌లో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రస్థావరాలను కూడా నాశనం చేశాం. మన ఆయుధాలు, క్షిపణులు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి శత్రువులను వణికించాయి" అని ప్రధాని పేర్కొన్నారు. బ్రహ్మోస్ క్షిపణులతో తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసిందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించిన నేపథ్యంలో ప్రధాని మోదీ మన క్షిపణుల గొప్పతనం గురించి ప్రస్తావించడం గమనార్హం. అంతకుముందు ఆయన బిహార్‌లోని కారకత్‌లో రూ.48,520 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఉగ్రవాదం పాములాంటిదని.. మళ్లీ పడగ విప్పితే ఏ కలుగులో దాక్కున్నా బయటికి లాక్కొచ్చి దాన్ని తొక్కి చంపేస్తామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ భారత అమ్ములపొదిలోని ఓ బాణం మాత్రమేనని చెప్పారు. భారత సైన్యం దాడులతో దిగివచ్చిన పాకిస్థాన్.. యుద్ధాన్ని ముగించాలంటూ వేడుకుందని చెప్పారు. అణ్వాయుధ బెదిరింపులకు భారత్ భయపడదని, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోదని తేల్చిచెప్పారు.



ఏడో తరగతి చదువుతున్న శివన్య తివారీ అనే బాలిక గీసిన 'ఆపరేషన్ సిందూర్' చిత్రపటాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వీకరించారు. సభా వేదికపై నుంచి ఆ బాలిక గీసిన చిత్రపటాన్ని చూసిన మోదీ, దానిని తీసుకురావాలని తన భద్రతా సిబ్బందికి సూచించారు. అలాగే ఆ చిత్రపటంపై బాలిక పేరు, చిరునామా రాయమని అడిగారు. ఆమెకు తానే స్వయంగా ఒక లేఖ పంపుతానని హామీ ఇచ్చారు.

శుభం ద్వివేది కుటుంబ సభ్యులకు ప్రధాని పరామర్శ

పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కాన్పూర్ వాసి శుభం ద్వివేది(31) కుటుంబాన్ని ప్రధాని మోదీ శుక్రవారం పరామర్శించారు. మోదీని చూడగానే కుటుంబ సభ్యులు బోరున ఏడ్చారని, వారికి ప్రధాని ధైర్యం చెప్పారని మృతుడి బంధువు సౌరబ్ తెలిపారు. ప్రధాని కూడా భావోద్వేగానికి గురయ్యారన్నారు.

హైదరాబాద్ కుర్రాడు..
స్పెల్లింగ్ బీ విజేత

- పతిష్ఠాత్మక పురస్కారాన్ని గెల్చుకున్న ఫైజాన్ జాకీ
- అమెరికాలో ఏడో తరగతి విద్యార్థి



న్యూయార్క్, మే 30: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ మూలాలున్న 13 ఏళ్ల భారతీయ అమెరికన్ కుర్రాడు ఫైజాన్ జాకీ గెల్చుకున్నాడు. eclaircissement అనే పదంలోని అక్షరాలను సరిగా చెప్పటంతో ఫైజాన్ విజేతగా నిలిచాడు. అస్పష్టంగా ఉన్న దానిని పరిష్కరించటం, జ్ఞానోదయం కలిగించటం అని ఈ పదానికి ఉన్న అర్థం. గురువారం రాత్రి అమెరికాలోని మేరీలాండ్‌లో జరిగిన స్పెల్లింగ్ బీ కార్యక్రమం ప్రత్యక్షప్రసారాన్ని ఫైజాన్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు హైదరాబాద్ నుంచి వీక్షించారు. ఫైజాన్ అమెరికాలోని సీఎం రైస్ మిడిల్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి. ఇప్పటి వరకూ నాలుగుసార్లు స్పెల్లింగ్ బీ పోటీల్లో పాల్గొన్న ఫైజాన్.. గత ఏడాది రెండోస్థానంలో నిలిచాడు. ఈసారి చివరిదైన 21వ రౌండ్‌లో ముగ్గురితో పోటీపడి గెలుపును సొంతం చేసుకున్నాడు. కాగా, 1925లో ప్రారంభమైన స్పెల్లింగ్ బీ పోటీకి ఇది 100వ సంవత్సరం కావటం విశేషం. తరచూ భారతీయఅమెరికన్ విద్యార్థులే స్పెల్లింగ్ బీ చాంపియన్‌షిప్‌ను గెల్చుకుంటున్నారు. విజేతలకు 50వేల డాలర్ల నగదు, మెడల్, ట్రోఫీని అందిస్తున్నారు.



ప్రమాణం చేస్తున్న జస్టిస్ ఎన్‌వీ అంజారియా జస్టిస్ విజయ్ బిష్ణోయి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్

ముగ్గురు సుప్రీం జడ్జీల ప్రమాణం

- 34కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

న్యూఢిల్లీ, మే 30: సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్ పదవీప్రమాణం చేశారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో వారితో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు పూర్తి బలాన్ని సంతరించుకుంది. సీజేఐతో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 34కి చేరుకుంది. సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌ల పదవీవిరమణతో ఖాళీ అయిన స్థానాల్లో కర్ణాటక, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ అంజారియా, బిష్ణోయి.. బోంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ చందూర్కర్‌లను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం గత సోమవారం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేయగా, వారి నియామకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారని కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ గురువారం 'ఎక్స్'లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

నా కుమారుడికి పాకిస్థాన్‌తో
సంబంధాల్లేవు

- సన్నీయాదవ్ తండ్రి రవియాదవ్

నూతనకల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై దేశ, విదేశాల్లో తిరుగుతాడే తప్ప తన కుమారుడికి పాకిస్థాన్‌తో ఎలాంటి సంబంధాలు లేవని యూట్యూబర్ బయ్యా సన్నీయాదవ్ తండ్రి రవియాదవ్ చెప్పారు. పాకిస్థాన్‌లో పర్యటించిన నేపథ్యంలో సన్నీయాదవ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారన్న నేపథ్యంలో శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన కుమారుడు పహల్గాం ఉగ్రదాడి కంటే ముందే మన దేశానికి వచ్చాడని, 10 రోజులు నూతనకల్‌లో ఉండి చెన్నై వెళ్లినట్లు తెలిపారు. వివిధ దేశాలు తిరిగే క్రమంలో పాకిస్థాన్‌కు కూడా వెళ్లాడన్నారు. సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో అసత్యాలు రాసి తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడిని ఎవరు తీసుకెళ్లారో తమకు ఇంతవరకు తెలియదన్నారు. సన్నీయాదవ్ చెన్నైలో స్నేహితుడి ఇంట్లో ఉంటే తీసుకెళ్లారని, దానికి విమానాశ్రయంలో అరెస్ట్ చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం బాధాకరమన్నారు. తమ కుమారుడి ఆచూకీ కోసం కోర్టులో పిటిషన్ వేస్తానని ఆయన చెప్పారు.

హెచ్‌ఏఎల్‌కు 'సెంటర్ ఫ్యూస్‌లాజ్'

తేజస్ యుద్ధ విమానాల్లో కీలకమైన సీఎఫ్ తయారు చేసిన వెమ్ టెక్నాలజీస్



వెమ్ టెక్నాలజీస్‌లో తయారైన సెంటర్ ఫ్యూస్‌లాజ్

హైదరాబాద్ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎంకే1ఏకు అత్యంత కీలకమైన 'సెంటర్ ఫ్యూస్‌లాజ్ (సీఎఫ్)' అసెంబ్లీని ప్రైవేటు సంస్థ వెమ్ టెక్నాలజీస్ తయారు చేసింది. తొలి సీఎఫ్‌ను శుక్రవారం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు అందజేసింది. శంషాబాద్ సమీపంలోని వెమ్ టెక్నాలజీస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎఫ్‌ను సంస్థ సీఎండీ వెంకటరాజు హెచ్‌ఏఎల్ అధికారులకు అందజేశారు. అనంతరం రక్షణ ఉత్పత్తుల శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. తేజస్ ఎంకే1ఏ కోసం సీఎఫ్ ఉత్పత్తిని వేగవంతం చేయడంలో వెమ్ టెక్నాలజీస్‌తో హెచ్‌ఏఎల్ భాగస్వామ్యం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ నగరం రక్షణ ఉత్పత్తుల హబ్‌గా మారుతోందని చెప్పారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశీయంగా తయారీని ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రక్షణ ఉత్పత్తుల తయారీ ఏటా 10 శాతం వృద్ధి రేటు సాధిస్తోందని చెప్పారు. దేశ భద్రత, సార్వభౌమాధికారం కోసం దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యం పెరగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పరిశోధన, అభివృద్ధి ప్రయత్నాల ద్వారానే అది సాధ్యమవుతుందని తెలిపారు. హెచ్‌ఏఎల్ సీఎండీ డీకే సునీల్ మాట్లాడుతూ.. తేజస్ ఉత్పత్తిలో ఎంఎస్ఎంఈలతో పాటు పలు సంస్థలు తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. తేజస్ ఎంకే1ఏ ప్రొడక్షన్ లైన్లు (తయారీ కేంద్రం) బెంగళూరులో రెండు, నాసిక్‌లో ఒకటి ఉన్నాయని.. వెమ్ టెక్నాలజీస్ అందించిన సీఎఫ్ నాలుగో ప్రొడక్షన్ లైన్ ఏర్పాటులో కీలకంగా నిలుస్తుందని చెప్పారు. తేజస్ విమానాల తయారీని పెంచడం ద్వారా భారత వాయుసేన అవసరాలను తీర్చనున్నామన్నారు. ఈ తరహా ప్రైవేటు రంగ సంస్థలతో మరిన్ని భాగస్వామ్యాలను చేసుకోవడానికి ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. వెమ్ టెక్నాలజీస్ సీఎండీ వేటుకూరి వెంకటరాజు మాట్లాడుతూ.. తేజస్ కోసం సీఎఫ్ రూపొందించే అవకాశాన్ని తమకిచ్చిన హెచ్‌ఏఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎఫ్ తయారీ కోసం తాము రెండు అసెంబ్లీ సెటప్‌లతో ప్రత్యేకంగా ఓ హ్యాంగర్ ఏర్పాటు చేశామన్నారు. నెలకో సీఎఫ్‌ను తయారు చేసేలా సామర్థ్యాన్ని పెంచుకుంటామని, ఈ ఏడాది కనీసం ఆరు సీఎఫ్‌లను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎఫ్ తయారీకి అవసరమైన సామగ్రిలో కొంత హెచ్‌ఏఎల్ అందించగా.. మరికొంత విదేశాలనుంచి దిగుమతి చేసుకున్నామన్నారు. డీజీఏక్యూఏ ధ్రువీకృత ఏరోస్పేస్ సరఫరాదారుగా 'వెమ్ టెక్నాలజీస్' నిలిచిందన్నారు. ప్రస్తుతానికి తేజస్‌కు సంబంధించి ఏకైక సీఎఫ్ సరఫరాదారులం తామేనని, హెచ్‌ఏఎల్ కూడా సీఎఫ్‌లను ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. జహీరాబాద్ ప్లాంట్‌లో వచ్చే ఏడాదికల్లా వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు.

ఒకే షిఫ్టులో నీట్–పీజీ ఎంట్రన్స్



2 షిఫ్టులంటే ఇబ్బంది పెట్టడమే

- విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు
- 'నీట్'ను ఉద్దేశించి సుప్రీం వ్యాఖ్యలు
- కీలక తీర్పిచ్చిన త్రిసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ, మే 30: వైద్య విద్యార్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షను ఒక షిఫ్టులోనే నిర్వహించాలని సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. రెండు షిఫ్టులుగా విద్యార్థులను విభజించి ప్రవేశ పరీక్షను నిర్వహించడం అంటే.. వారిని ఇబ్బంది పెట్టడమేనని.. ప్రశ్నల క్లిష్టత మారి.. వారిని నష్టపరచడమే అవుతుందని స్పష్టం చేసింది. ఇది ఒకరకంగా ఏకపక్ష నిర్ణయానికి దారి తీసే ప్రమాదం ఉంటుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు నీట్-పీజీ-2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలో త్రిసభ్య సభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. రెండు షిఫ్టులుగా నిర్వహిస్తే.. ఏ రెండు ప్రశ్న పత్రాలు ఒకే విధంగా ఉండవని, తద్వారా విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది. ఒకే షిఫ్టులో ప్రవేశ పరీక్షను నిర్వహించడం ద్వారా పారదర్శకతకు, నిర్వహణకు మరింత పెద్దపీట వేసినట్టు అవుతుందని తెలిపింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని నీట్‌ను ఆదేశించింది. నీట్-పీజీ-2025 ప్రవేశ పరీక్షను రెండు షిఫ్టుల్లో నిర్వహించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 2,42,678 మంది దరఖాస్తు చేసుకున్నారని, పైగా ఒకే నగరంలో నిర్వహించడం లేదని, పైగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రెండు షిఫ్టులుగా నిర్వహిస్తామన్న వాదనను తాము అంగీకరించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు జూన్ 15వ తేదీ వరకు గడువు ఉందని.. ఈలోగా ఏర్పాట్లు చేసుకునేందుకు చాలానే సమయం ఉందని పేర్కొంది.

ట్రంప్ సుంకాలకు మళ్లీ ఓకే!

- టారిఫ్‌లను ఆపాలన్న ట్రేడ్ కోర్టు తీర్పును

తాత్కాలికంగా నిలిపివేసిన అప్పీల్ కోర్టు

వాషింగ్టన్, మే 30: ట్రంప్ టారిఫ్‌ల వ్యవహారం మరో మలుపు తిరిగింది. వివిధ దేశాల దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలను నిలిపివేస్తూ ట్రేడ్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ కోర్టు స్టే ఇచ్చింది. ట్రంప్ సర్కారు సుంకాల వసూలు కొనసాగించేందుకు మార్గం సుగమం చేసింది. తాము తిరిగి ఆదేశాలు ఇచ్చేవరకు ఈ స్టే అమల్లో ఉంటుందని ప్రకటించింది. ఏప్రిల్ 2న లిబరేషన్ డే పేరిట వివిధ దేశాలపై భారీగా సుంకాలను ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా ఉత్పత్తులపై ఆయా దేశాలు భారీగా సుంకాలు వసూలు చేస్తున్నాయని, దానికి ప్రతిగా తాము సుంకాలు విధిస్తున్నామని ఆయన ప్రకటించారు. అమెరికా 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం-1977' కింద అధ్యక్షుడికి దఖలు పడిన అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై అక్కడి 'కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన ట్రేడ్ కోర్టు.. ట్రంప్ సుంకాలను నిలిపివేస్తూ తీర్పిచ్చింది. దీనిపై ట్రంప్ సర్కారు 'ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు'లో అప్పీలు చేసింది. ట్రేడ్ కోర్టు తీర్పును నిలిపివేయాలని కోరింది. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న అప్పీల్స్ కోర్టు.. ట్రేడ్ కోర్టు తీర్పును తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 'చాలా టెరిఫిక్' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. 'ఆయన ఎల్లప్పుడూ మనతోనే ఉంటారు' అని వ్యాఖ్యానించారు. డోగ్ బాధ్యతల నుంచి మస్క్ తప్పుకొన్న నేపథ్యంలో శుక్రవారం ట్రంప్ ఆయన సేవలను కొనియాడారు.

కనకగిరికొండల్లో మంత్రి తుమ్మల!

» ఖమ్మం జిల్లాలోని పర్యాటక ప్రాంత సందర్శన

» ఎమ్మెల్యే రాగమయితో కలిసి వన బస్సు ప్రారంభం



పెనుబల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): అది ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని కొండ కోనల ప్రాంతం.. ఎత్తయిన కొండలతో పచ్చని చెట్లతో పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే అడవి అందాలు దాని సొంతం.. ఎకో టూరిజం ద్వారా రూ.3.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ కనకగిరి గుట్టల్లోని పలు ప్రదేశాలను శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి వీరభద్రస్వామి ఆలయం వరకు అడవిలో సుమారు 3 గంటల పాటు పర్యటించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి వన బస్సును ప్రారంభించారు. ప్రాచీన కట్టడమైన వీరభద్రస్వామి ఆలయంతోపాటు పులిగుండాల ప్రాంతంలో పర్యాటకులు రెండు, మూడు రోజుల పాటు బస చేసేందుకు ఏర్పాటు చేసిన కుటీరాలను తుమ్మల పరిశీలించారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈసారి ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

» పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సవాలకు హాజరుకానున్న రేవంత్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఈసారి ఘనంగా నిర్వహిస్తామని ప్రభుత్వం తెలిపింది. జూన్ 2న హైదరాబాద్‌తో పాటు 32 జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేడుకను అధికారికంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగిస్తారు. జిల్లాకేంద్రాల్లో పతాకాలను ఆవిష్కరించే మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. కలెక్టరేట్లలో జరిగే ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారులు, మేయర్లు, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్‌పర్సన్లు, మునిసిపల్ చైర్‌పర్సన్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని తెలిపింది. ఈమేరకు సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, పలువురు ప్రముఖులను రాష్ట్ర ప్రభుత్వం సత్కరించనుంది. తెలంగాణ ఆవిర్భావ దిన్సోతవమైన జూన్ 2న ఒక్కొక్కరికీ ఫ్యూచర్ సిటీలో 300 గజాల ఇంటి స్థలంతో పాటు రూ.కోటి చొప్పున చెక్కులను అందించనుంది.

జూన్ 4 తర్వాతే సీఎం ఢిల్లీ టూర్!

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన వాయిదా పడింది. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకం తదితర అంశాలపై చర్చించేందుకు ఆయన శుక్రవారం ఢిల్లీకి వెళ్లాల్సి ఉన్నా.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడింది. 2న తెలంగాణ అవతరణ ఉత్సవాల నేపథ్యంలో 4 తర్వాతే ఈ సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు ఖమ్మంకు మీనాక్షి నటరాజన్

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరుపుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. అందులో భాగంగా శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలు నిర్వహించనున్నారు. కాగా.. మీనాక్షి శుక్రవారంనాడు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్లలో భువనగిరి, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలు నిర్వహించారు. సూర్యాపేట, జనగామ వంటి చోట్ల ఓటమికి కారణాలను ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు సహకరించని కారణంగానే తాను ఓటమి పాలైనట్లు జనగామ అభ్యర్థి కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం.

గ్రామ పాలనాధికారుల ర్యాంకుల జాబితా విడుదల

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పాలనాధికారుల(జీపీవో) ర్యాంకుల జాబితాను భూ పరిపాలన ప్రధాన కార్యాలయం విడుదల చేసింది. 5,300 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోగా వారిలో 4,558 మంది ఈ నెల 25న పరీక్ష రాశారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 3,550 మంది జాబితాను శుక్రవారం సీసీఎల్ఏ అధికారులు భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకర్‌గా అడ్డా మధు(హాల్‌టిక్కెట్ నంబరు 2532052) నిలిచారు. ఆ తర్వాతి ఐదు స్థానాల్లో షేక్ లతీఫ్ సాహెబ్, బి.ప్రవీణ్‌కుమార్, విజయ సోమిరెడ్డి, ఈదన్న రవీందర్ ఉన్నారు. అర్హులైన వారికి 2లోపు నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సీసీఎల్ఏ తెలిపింది. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి అభినందనలు తెలిపారు.

బ్యాంకు గ్యారంటీ బదులు ఐఆర్‌డీఏ బాండ్లు

» బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్ల భేటీలో నిర్ణయం

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనులకు బ్యాంకు గ్యారంటీల బదులు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏ) జారీ చేసే బాండ్లను అనుమతించాలని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చేసిన ప్రతిపాదనలపై బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్ల కమిటీ (బీవోసీఈ) సానుకూలంగా స్పందించింది. దీనిపై అధ్యయనం కోసం నీటిపారుదల శాఖతో పాటు రోడ్లు భవనాలు, జెన్‌కో, పురపాలక, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించింది. శుక్రవారం బీవోసీఈ చైర్మన్, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్) అంజద్ హుస్సేన్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా బ్యాంకు గ్యారంటీల బదులు ఐఆర్‌డీఏ బాండ్ల అంశంపైనే చర్చించారు. నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు వినియోగించే సామగ్రి ధరల పెరుగుదలకు అనుగుణంగా ధరలను 1 శాతం పెంచడానికి అవకాశం ఇవ్వాలన్న విజ్ఞప్తులపైనా అధ్యయనం చేసి, నివేదిక అందించే బాధ్యతను కమిటీకి అప్పగించారు.

2 నుంచి 'భూ మిత్ర' చాట్ బాట్ ప్రారంభం

భూసంబంధిత సమస్యలపై ప్రజల సందేహాలను నివృత్తి చేసేలా 'భూ మిత్ర' పేరుతో రెవెన్యూ శాఖ చాట్ బాట్‌ను జూన్ 2 నుంచి అందుబాటులోకి తెస్తోంది. గత నెలరోజులుగా ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ కొనసాగుతోంది. తెలుగు, హిందీ, ఉర్దూ, ఆంగ్లం ఇలా నాలుగు భాషల్లో సమగ్ర వివరాలు లభ్యమయ్యేలా ఈ చాట్ బాట్‌ను రూపొందించారు. రైతులకు, నిరక్షరాస్యులకు సులభంగా అర్థమయ్యేవిధంగా ఉండాలని సీసీఎల్ఏ కార్యదర్శి మంద మకరందు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. భూముల రిజిస్ట్రేషన్ విధానం, అవసరమైన పత్రాలు, నిషేధిత జాబితా నుంచి భూముల్ని తొలగించే ప్రక్రియ ఇలా పలు రకాల ప్రశ్నలకు సంబంధిత సమాధానాలను ఈ చాట్‌బాట్‌లో పొందుపరిచారు

సర్దుబాటు పేరిట ఉపాధ్యాయుల తరలింపు వద్దు

» జీఓ 25ను సవరించాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు పేరిట ఇతర పాఠశాలలకు తరలించాలనే నిర్ణయం ప్రాథమిక విద్యా రంగానికి గొడ్డలిపెట్టని, దానిని తక్షణమే విరమించుకోవాలని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యపరిచే ఈ సర్దుబాటు ఉత్తర్వులను, జీఓ 25ను సవరించాలంటూ పౌర సంఘాలతో కలిసి ఐక్య పోరాటం నిర్వహిస్తామని యూటిఎఫ్ అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ ప్రకటించారు.

'దళితబంధు'పై విచారణ జరిపించాలి: ఎఫ్‌జీజీ

దళితబంధు పథకంపై సమగ్ర విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు కోసం రూ.3,884 కోట్ల భారీ మొత్తాన్ని ఖర్చు చేసిందని అన్నారు. లబ్ధిదారుల ఎంపికను రాజకీయ నాయకులకు అప్పగించడంతో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

కమలంతో పొత్తు పెట్టుకున్న ఏ పార్టీ బాగుపడలేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. తాను కేసీఆర్‌కు లేఖ రాయడం కొత్తేమీ కాదని, దానిని లీకు చేసినవారెవరో బయట పెట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. లేఖలో ప్రస్తావించిన అంశాలు కొత్తవేమీ కాదని, ప్రజలు అనుకునేవేనని చెప్పారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి తాను వ్యతిరేక మని, పార్టీ బీజేపీ వైపు చూడాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలేవీ బాగుపడలేదని చెప్పారు. తాను జైల్లో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌ను బీజేపీలో కలపాలనే అంశం ప్రస్తావనకు వస్తే అంగీకరించే ప్రసక్తే లేదని చెప్పానన్నారు. ఇప్పుడు ఆ ప్రయత్నం చేసినా వ్యతిరేకిస్తానని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా కలిసి అసలు విషయం చెప్పాలని ప్రయత్నం చేశానని, తండ్రిని కలిసే అవకాశం కూడా వచ్చిందని, వ్యక్తిగత కారణాల వల్ల కలువలేక పోయానని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆపరేషన్ కగార్ పేరుతో దుశ్చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ కుటుంబ సభ్యులను కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మునీర్ విప్లవోద్యమ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో, సమస్యలను ఎండగట్టడంలో ముందుండేవారన్నారు. మావోయిస్టు నేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే అంతిమ సంస్కారాల కోసం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని ఇచ్చే సంస్కారం కూడా లేని పార్టీ బీజేపీ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేకులని ఆరోపించారు. సరస్వతీ నది పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ వంశీని ఆహ్వానించకుండా అవమానపరిచారన్నారు. యాదగిరి గుట్టలో రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులంతా పైన ఆసనాల్లో కూర్చుని, దళితుడైన డిప్యూటీ సీఎం భట్టిని కింది ఆసనాల్లో కూర్చోబెట్టి అవమానించారని వ్యాఖ్యానించారు.

కవిత వెంట కానరాని బీఆర్ఎస్ నాయకులు

కవిత పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గానీ, పార్టీ అనుబంధ తెలంగాణ సింగరేణి కార్మిక సంఘం(టీబీజీకెఎస్) నాయకులు కానీ ఎవరు కానరాలేదు. శ్రీరాంపూర్ నుంచి మొదలైన పర్యటన లక్షెట్టిపేట వరకు కొనసాగింది. కొందరు జాగృతి నాయకులు తప్ప బీఆర్ఎస్ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు ఎవరు పాల్గొనక పోవడం గమనార్హం. కవిత పర్యటనలో ఎవరు పాల్గొనవద్దనే ఆదేశాలు ఉండడంతో వారంతా స్పందించలేదని ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్‌తో పాటు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కూడా కవిత పర్యటనకు దూరంగా ఉన్నారు. పలు కూడళ్లలో జాగృతి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కేటీఆర్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశమైంది. గతంలోకవిత పర్యటన అంటే పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొనేవారు. తాజా పరిణామాలతో వారంతా మొఖం చాటేసినట్లు తెలుస్తోంది. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల కార్యకర్తలు కూడాదూరంగా ఉన్నారు.

కవిత బాయ్‌కాట్!

ఆమెకు దూరంగా గులాబీ కేడర్ .. తన వ్యాఖ్యలపై స్పందించవద్దు

» నేతలకు స్పష్టమైన ఆదేశాలు

» ఆమె పర్యటనపై మీడియాతో నిఘా

» కవిత తీరుతో కేసీఆర్ మనస్తాపం

» అధినేత నుంచి సొంత మీడియా వరకు పార్టీ వ్యవస్థ అంతా మౌనం



మంచిర్యాలలో కేటీఆర్ ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీపై ధిక్కార స్వరం వినిపిస్తున్న కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవితపై అధిష్ఠానం నిఘా పెట్టింది. ఆమె విషయంలో పార్టీ సీనియర్ నేతలు, కేడర్ సహా ఎవ్వరూ స్పందించవద్దని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అఖరికి ఆమె పాల్గొనే ఏ కార్యక్రమంలోనూ పాల్గొనవద్దని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఒక విధంగా ఆమెను పార్టీ బాయ్‌కాట్ చేసింది. దానికితోడు కవిత నివాసంతో పాటు, ఆమె ఎక్కడకు వెళ్లినా తనను ఎవరైనా కలుస్తున్నారా? అనేది కూడా పై నుంచి ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె గులాబీ నిఘా నీడలో ఉన్నారు. ఆమె ప్రతీ కదలికను ఆమె చుట్టూ మోహరించిన కొందరి ద్వారా పార్టీ పెద్దలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. గత వారం అమెరికా పర్యటన నుంచి వస్తూనే కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తర్వాత నుంచి ఆమె ఇంటికే పరిమితం అవుతూ వస్తున్నారు. కవిత వ్యాఖ్యల అనంతరం ఆమెను తెలంగాణ జాగృతి నేతలు, కేడర్ తప్ప బీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నేతలు, కార్యకర్తలు కలిసింది లేదు. దాంతో ఆమె సింగరేణి జాగృతి కమిటీని వేశారు. ఆ కమిటీని వేసిన మరుసటి రోజే పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు ఇద్దరు దూతలు వచ్చి, ఆమెతో రాయబారం నెరిపారు. అదికాస్త విఫలం అయింది. ఆ తర్వాత కూడా ఆమె ఇంటికే పరిమితం అయ్యారు. గురువారం ఆమె మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్ కుమార్ సహా అందర్నీ పరోక్షంగా కడిగి పారేశారు. గురువారం చేసిన వ్యాఖ్యలు గులాబీ పార్టీని మరింత కుదుపునకు గురి చేశాయి. అలాగే, ఆమె ఆరుగురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్‌లో చేరి, మంత్రి పదవి కోసం యత్నిస్తుందన్న వార్తల నేపథ్యంలో కవితపై పార్టీ అధిష్ఠానం నిఘాను తీవ్రతరం చేసింది. రాత్రివేళ కూడా ఆమె ఇంటికి ఎవరెవరు వస్తున్నారు? ఎవరు వెళ్తున్నారన్న విషయాలను ఆరా తీస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం, తెలంగాణ ఉద్యమం కోసం మొదట్నించీ పని చేసిన కొందరు సీనియర్స్, ఉద్యమకారులతో కవిత నేరుగా ఫోన్ చేసి మాట్లాడుతున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీలయితే పలు అంశాలపై చర్చించేందుకు సమావేశం అవుదామని కవితవారిని కోరుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ఆమెతో సమావేశమవుతుండగా, మెజార్టీ నేతలు కవితతో భేటీ అయ్యేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ ఆదేశాలమేరకు దూరంగా ఉంటున్నారు.

మొహం చాటేశారు

ఇప్పటికే ఆమె చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఆదేశాలిచ్చిన బీఆర్ఎస్ అధిష్ఠానం కవిత జిలా పర్యటనలపైనా నిఘా పెట్టింది. శుక్రవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె మంచిర్యాల వెళ్లారు. ఆమె పర్యటనను కేసీఆర్ సొంత మీడియా ప్రతినిధులు ఆసాంతం నిఘా పెట్టారు. కవిత వెంట ఎవరు ఎవరు ఉన్నారనే విషయాన్ని ఎప్పటికప్పుడు హైదరాబాద్‌కు చేరవేశారు. మంచిర్యాల పర్యటనలో ఆమె కార్యక్రమానికి హాజరు కాకుండా గులాబీ నేతలు, కేడర్ కవితకు షాక్ ఇచ్చారు. టీజీబీకే అధ్యక్ష హోదాలో ఉన్న సమయంలో కవిత వెంట ఉన్న వందల కార్మికులు, నేతలు సైతం హాజరు కాలేదు. ఆమె పర్యటనను కన్నెత్తి చూడలేదు. ఆమె పర్యటనలో పాల్గొంటే ఎక్కడ తమ రాజకీయ భవిష్యత్ దెబ్బతింటుందో నన్న అనుమానాలు లీడర్లు, కేడర్‌లో వ్యక్తం అవుతున్నాయి. ఒకరకంగా పార్టీకి దూరమైన, అధిష్ఠానం పెద్దల ఆగ్రహానికి గురైన వారి వెంట ఎవ్వరూ వెళ్లరన్న సంకేతాలను పంపినట్లు అయిందని ఓ సీనియర్ నేతవ్యాఖ్యానించారు. కేసీఆర్ సొంత మీడియా కూడా కవితను పట్టించుకోవడం లేదు. ఆమె వ్యాఖ్యలు అన్ని ప్రధాన మీడియాల్లో పతాక శీర్షికలకు ఎక్కగా... నమస్తే తెలంగాణలో మాత్రం కనీసం పేరు కూడా ప్రచురణకు నోచుకోలేదు. కవితను సొంత పార్టీ నేతలకు, కేడర్‌కు, మీడియాకు దూరంగా పెట్టడంలో బీఆర్ఎస్ పెద్దలు సఫలమయ్యారని పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు.

నొచ్చుకుంటున్న కేసీఆర్

కవిత వ్యవహారంపై పార్టీ అధినేత కేసీఆర్ నొచ్చుకున్నట్లు పార్టీలోని ఓ సీనియర్ నేత వెల్లడించారు. అందుకే కవిత వ్యవహారం తెర పైకి వచ్చి వారం రోజులు అవుతున్నా ఆయన నోరు విప్పలేదంటున్నారు. ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ ఎప్పుడు పెట్టేదీ క్లారిటీ కూడా ఇవ్వడం లేదని గులాబీ శ్రేణులంటున్నాయి. శుక్రవారం ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో సీనియర్ నేత హరీశ్‌రావు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. భేటీలో కవిత అంశం కూడా చర్చకు వచ్చిందని, ఈ వ్యవహారాన్ని చక్కదిద్దే బాధ్యతను హరీశ్‌కు కేసీఆర్ అప్పగించారన్న ప్రచారం సైతం జరుగుతోంది. అయితే ఈ విషయాన్ని ఎవ్వరూ ధ్రువీకరించడం లేదు. ఒకవైపు పార్టీ అధినేత కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరు కావాల్సి ఉండటం, మరోవైపు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారంలో రెండోసారి నోటీసులు జారీ అయి, ఏసీబీ ముందు హాజరు కావాల్సి ఉన్న నేపథ్యంలో కవిత వ్యవహారం గోరుచుట్టుపై రోకలి పోటులా మారిందని మరో సీనియర్ నేత వ్యాఖ్యానించారు. జరుగుతున్న పరిణామాలు పార్టీ కేడర్‌ను నిస్తేజంలోకి నెట్టివేశాయని చెప్పుకొచ్చారు.

బీజేపీలో విలీనంపై కేసీఆరే జవాబు చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన బావ రాబర్ట్‌వాద్రా, సీఎం రేవంత్‌రెడ్డి దేశ సైనికుల ధైర్యాన్ని, పరాక్రమాన్ని, పోరాటాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎంత మంది ఉగ్రవాదులు చనిపోయారో, పాకిస్తాన్‌పై మన సైనికులు ఎలా విరుచుకుపడ్డారో అడిగి ఉంటే దేశ ప్రజలు, సైనికులు సంతోషపడేవారని.. ఇవేమీ అడగకుండా ఎన్ని రాఫెల్ విమానాలు కూలిపోయాయో లెక్క చెప్పండి..? అని రాహుల్ అడగటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తాము దాడులు జరపాలని నిర్ణయించిన తర్వాత రాత్రికి రాత్రే తమ వైమానిక స్థావరాలపై భారత్ సాయుధ దళాలు దాడులు జరిపాయని, పాకిస్థాన్ ప్రధాని ఒప్పుకున్నప్పటికీ, మన దేశ సైనిక సత్తాపై రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండవాదం చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో బడేమియా రాహుల్ మాటలకు.. అక్కడ హైదరాబాద్‌లో ఛోటేమియా రేవంత్ వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్ బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ముఖ్యమంత్రి విమర్శలు పాకిస్థాన్ ఆరోపణలకు మద్దతు ఇచ్చేలా ఉన్నాయన్నారు. యుద్ధంలో రాఫెల్ విమానాలను కోల్పోయామని చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రధాని మోదీపై ఉన్న అక్కసును సైన్యంపై వెళ్లగక్కారని లక్ష్మణ్ మండిపడ్డారు. దేశ భద్రతపై కాంగ్రెస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ పాటించారని, భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ వద్ద తాకట్టు పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ చెల్లని రూపాయి: రఘునందన్‌రావు

కేసీఆర్ కుటుంబం ప్రజల దృష్టిలో చెల్లని రూపాయిలా మారిపోయిందని, ఆ రూపాయికి బ్రాండింగ్ వేసుకునే ప్రయత్నం జరుగుతోందని ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. ఆస్తులు, కుటుంబం, పార్టీ పంచాయితీ, ఉంటే వారే తేల్చుకోవాలి తప్ప బీజేపీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేశారు. కవిత కొత్త పార్టీ పెడతారన్నది తనకున్న సమాచారం అని పునరుద్ఘాటించారు.

నెహ్రూ, ఇందిర స్వాతంత్ర్యానికి ముందు పుట్టినోళ్లు

మోదీ, కిషన్‌రెడ్డి, సంజయ్ ఆజాదీ తర్వాత పుట్టారు .. చరిత్ర తెలియక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు

» బీజేపీకి నాయకుడు లేక పటేల్ పేరు వాడుకుంటోంది

» గాంధీ కుటుంబంపై కమలం నేతల చిల్లర మాటలు

» మీడియాలో ఫోకస్ కోసమే రాహుల్‌ను విమర్శిస్తున్నారు

» గాంధీభవన్‌లో అటెండర్ పోస్టు ఇచ్చినా చేస్తా: జగ్గారెడ్డి



గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ, నెహ్రూల చరిత్ర తెలియని బీజేపీ నేతలు.. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. మోతీలాల్, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ స్వాతంత్రానికి ముందు పుడితే.. మోదీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు ఆ తర్వాత పుట్టారని అన్నారు. వీరికి కాంగ్రెస్ చరిత్ర తెలియాలంటే ఆదిత్య 369 సినిమాలో చూపించినట్లుగా టైం మెషీన్‌లో 145 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పుట్టి 145 ఏళ్లు అయితే.. బీజేపీ పుట్టి 45 సంవత్సరాలే అయిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, బీజేపీ చరిత్రలకు వందేళ్ల అంతరం ఉందన్నారు. బీజేపీది కాంగ్రెస్ పార్టీ మునిమనవడి వయసని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. కిషన్‌రెడ్డి మొట్టికాయలకు రఘునందన్‌రావు మైండ్ బ్లాంక్ అయిందని, అందుకే ఆయన చరిత్ర వక్రీకరించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రఘునందన్‌రావుది రాహుల్ గాంధీని విమర్శించే స్థాయినా..? అని ప్రశ్నించారు. దేశాన్ని గాంధీ కుటుంబం పరిపాలించిన రోజున.. ఇవాళ వారిని విమర్శిస్తున్న బీజేపీ నాయకులు పుట్టనే లేదని అన్నారు. తమ నేతగా చెప్పుకోడానికి బీజేపీకి ఎవరూ దిక్కు లేక.. కాంగ్రెస్ నాయకుడు సర్దార్ పటేల్ పేరును వాడుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ సముద్రంలోని ఒక బిందెడు నీళ్లను తీసుకుని జీవిస్తున్నారని ఎద్దేవా చేశారు.

గాంధీ కుటుంబం చరిత్రను కొత్త తరం తెలుసుకోవాలి

నెహ్రూ ప్రధాని అయ్యాక.. 543 సంస్థానాలను భారత్‌లో విలీనం చేశారని జగ్గారెడ్డి తెలిపారు. కశ్మీర్.. భారత్ నుంచి విడిపోకుండా కాపాడిన ఘనత నెహ్రూదేనని చెప్పారు. కశ్మీర్ ప్రజల కోసం ప్రత్యేక చట్టాన్ని తెచ్చి.. ఆ సమస్యను సున్నితంగా పరిష్కరించారని వెల్లడించారు. రాహుల్ తాత ముత్తాతల చరిత్రను కొత్త తరం తెలుసుకోవాలని, అప్పుడు వారికి బీజేపీ నిజ స్వరూపం తెలుస్తుందన్నారు. చరిత్ర తెలుసుకోకుండా బీజేపీ నేతలు హోదాలను మరచి గాంధీ కుటుంబంపై చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారు పద్ధతి మార్చుకోకుంటే తానూ చిల్లరగా మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు. మీడియాలో ఫోకస్ కోసమే రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పాలోడిని పాలోడనే అంటారని.. రేవంత్ మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ డాక్టర్ డ్యూటీ చేస్తోందని, అందరి సమస్యలూ పరిష్కారమవుతాయని తెలిపారు. కొత్త కమిటీల కూర్పు అద్భుతంగా ఉందని, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. అయితే పీఏసీ కమిటీలో మంత్రి వెంకట్‌రెడ్డి పేరు చేర్చితే బాగుండేదని అన్నారు. ఆయన పేరును చేర్చాలని అధిష్ఠానాన్ని కోరారు. టీపీసీసీ అడ్వయిజరీ కమిటీలో తనను చేర్చడం సంతోషమేనన్నారు. జానారెడ్డి వంటి సీనియర్ ఉన్న కమిటీలో తనకు అవకాశం ఇచ్చారంటే ప్రమోషన్ ఇచ్చినట్లేనని తెలిపారు. తనకు గాంధీభవన్ అటెండర్ పోస్టు ఇచ్చినా సంతోషంగానే పనిచేస్తానని జగ్గారెడ్డి అన్నారు.

'కాళేశ్వరం' ప్రయోజనాల్ని వివరిద్దాం!

(మొదటిపేజీ తరువాయి)

ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌ను హరీశ్ కలిశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనేక విషయాలు చర్చించారు. ఇటీవల జరిగిన భేటీలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల గురించి కేసీఆర్ అడిగారు. ఆరోజు నుంచి హరీశ్‌రావు అదేపనిపై దృష్టి సారించారు. అప్పటి ఇంజనీర్లతో చర్చించి పూర్తి వివరాలతో కూడిన ఒక నివేదికను తయారు చేసి తాజాగా కేసీఆర్ చేతికి ఇచ్చినట్లు తెలిసింది. జూన్ 5న కమిషన్ ముందుకు కేసీఆర్ వెళ్తున్న నేపథ్యంలో ముందుగా తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిసింది. పార్టీ నేతలతోపాటు మీడియాకు కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలపై అవగాహన కల్పించేలా హరీశ్‌రావు అన్నీతానై వ్యవహరించనున్నారు. కాళేశ్వరం విచారణ కమిషన్ ముందు అనూహ్య రీతిలో కేసీఆర్ హాజరుకావడానికి సిద్ధమవుతున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించకముందు ఉన్న కరువు గాథలు, అప్పటి ఫొటోలను కమిషన్ సభ్యులకు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పలు పత్రికలు, టీవీల్లో వచ్చిన కథనాలు, కాళేశ్వరం విజయగాథలను వివరించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కమిషన్ ఎదుట తడబాటుకు గురికాకుండా పూర్తి సమాచారాన్ని ముందుంచాలనే కోణంలో కేసీఆర్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కవిత ఎపిసోడ్‌పై ఆరా..!

ఎమ్మెల్సీ కవిత వైఖరితో తలెత్తిన పరిణామాలపై కేసీఆర్ పార్టీ నేతలతో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ విచారణ, జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం ఉన్నందున.. ఆ తర్వాతే కవిత విషయంలో ఒక నిర్ణయం తీసుకునే పరిస్థితి కనిపిస్తోంది. దూతలకు కవిత పలు షరతులు పెట్టడంతో వాటి సాధ్యాసాధ్యాలపైనా కేసీఆర్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అందుకే కేటీఆర్ అమెరికా నుంచి వచ్చాకనే ఒక అంచనాకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మా విధానాలతోనే.. గ్లోబల్ టెక్‌హబ్‌గా హైదరాబాద్!

» పెట్టుబడులు పెట్టేవారు తెలంగాణకు ప్రాధాన్యమివ్వాలి

» త్రీగోర్జెస్ స్థాయిలో కాళేశ్వరం... లండన్ సదస్సులో కేటీఆర్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలోని పారిశ్రామిక అనుకూల విధానాల కారణంగానే ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని.. హైదరాబాద్ గ్లోబల్ టెక్‌హబ్‌గా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. లండన్‌లో నిర్వహిస్తున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో శుక్రవారం 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ పాత్ర' అంశంపై కేటీఆర్ కీలకోపన్యాసం చేశారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో.. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్ సహా ప్రఖ్యాత కంపెనీలు హైదరాబాద్‌లో క్యాంపస్‌లను నెలకొల్పాయని చెప్పారు. 2014లో రూ.56 వేలకోట్లు ఉన్న రాష్ట్ర ఐటీ ఎగుమతులు.. 2023 నాటికి రూ.2.41 లక్షల కోట్లకు చేరాయన్నారు. 10 లక్షల మంది స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని చెప్పారు.భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ప్రగతిశీల రాష్ట్రమైన తెలంగాణకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తమ ప్రభుత్వం టీఎస్ఐపాస్ విధానాన్ని తెచ్చి, దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శమని వ్యాఖ్యానించారు. ఇంజనీరింగ్ అద్భుతంగా పేర్కొనే చైనాలోని త్రీగోర్జెస్ డ్యామ్‌కు సమానమైన విధంగా తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టామని కేటీఆర్ చెప్పారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకమని, ప్రతీ సీజన్‌కు 45లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు.

అత్యాధునిక వసతులతో.. యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలు

» అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటుకు పూనుకుందని సీఎంవో కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 600 ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ప్రైవేటు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని, వీటిని అత్యాధునిక వసతులతో కూడిన ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా వసతులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలు, ప్రతి పాఠశాలలో 2,650 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఏ నిర్మాణంతో పోల్చినా ప్రస్తుతం ఈ పాఠశాలలకు నిర్ణయించిన ధర తక్కువేనని సీఎంవో కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

రేపు టీఎస్ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష

కేయూ క్యాంపస్, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఈడీ కళాశాలల్లో 2025-26 ఏడాది ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్-25 ప్రవేశ పరీక్ష జూన్ 1న జరుగనుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 78 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎడ్‌సెట్-25 కన్వీనర్, కేయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. 38,758 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్‌లో కంప్యూటర్ ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం సెషన్‌లో 9.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తామని పేర్కొన్నారు. నిర్దేశిత సమయం దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. చేశారు.

వేణుగానామృతం.. సంగీత పరవశం

» ఐఐటీ హెచ్‌లో అలరించిన 'స్పిక్ మైకే' సదస్సు

కంది, మే 30 (ఆంధ్రజ్యోతి): పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత పండిట్ హరిప్రసాద్ చౌరాసియా వేణుగానం, పద్మశ్రీ గ్రహీత విదుషి ఏ కన్యాకుమారి వయొలిన్ కచేరితో.. ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణం శుక్రవారం పరవశించిపోయింది. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హెచ్‌లో జరుగుతున్న స్పిక్ మైకే(సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్) అంతర్జాతీయ సదస్సు ఐదో రోజు, శుక్రవారం సంగీత ప్రయాణం శ్రావ్యమైన పాండిత్యం, మధురమైన పాటలు, నాట్యంతో రంజింపజేసింది. విదుషి ఏ కన్యాకుమారి తన వయొలిన్ కచేరితో అలరించగా, పండిట్ హరిప్రసాద్ చౌరాసియా మధురమైన వేణుగానంతో మైమరపింపజేశారు. విదుషి అశ్విని భిడే దేశ్‌పాండే హిందుస్థానీ గాత్ర పారాయణంతో ఆకట్టుకోగా, వార్సీ బ్రదర్స్ కచేరి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. భాయ్ గురుదేవ్ సింగ్ హజూరి రాగి - షాబాద్ కీర్తన, నీమ్రానా గాయక బృందం పవిత్ర సంగీతం, ఉస్తాద్ షాహిద్ పర్వేజ్ ఖాన్- సితార్, వెంకటేష్ కుమార్ హిందుస్థానీ గానం అలరించాయి.

జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం కింద గ్రాంట్లు

» రూ.50 లక్షల వరకు సాయం పొందే అవకాశం

హైదరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వ్యవసాయాన్ని శాస్త్రీయ దృక్పథంతో పునరుద్ధరించడం, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతూ రసాయనాల బెడద లేని ఆరోగ్యకర ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని(నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్) ప్రారంభించిందని తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి తెలిపారు. దీనికి సంబంధించి భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఎమ్ఆర్) పోటీ పరిశోధన గ్రాంట్లను(కాంపిటీటివ్ రీసెర్చ్ గ్రాంట్) ప్రకటించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐసీఏఆర్ సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలతో పాటు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థలు ఈ సీఆర్‌జీ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఈ గ్రాంట్ క్రింద గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు సాయం పొందవచ్చని తెలిపారు. సీఆర్‌జీ కోసం ప్రతిపాదనలను జూన్ 5 సాయంత్రం ఐదున్నరలోగా https://nmnfresearch.in పోర్టల్‌లో సమర్పించాలని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం nmnf.nrm@gmail.comలో సంప్రదించవచ్చని గోపి తెలిపారు.

కృష్ణాబోర్డు సభ్యుడిగా కె.కె.జంగిడ్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సభ్యునిగా శంఖువ స్థానంలో కె.కె.జంగిడ్‌ను నియమితులైయ్యారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత బోర్డు మెంబర్ శంఖువ శనివారం పదవీ విరమణ చేయనున్నారు. తాజా నియామక ఉత్తర్వులు జూన్ 1 నుంచి అమలల్లోకి రానున్నాయి.

17 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 17 మంది మావోయిస్టు సభ్యులు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్ సమక్షంలో లొంగిపోయారు. వారికి ప్రభుత్వం తరఫున రూ.25 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన 17 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో ఆరుగురు మహిళలు, 11 మంది పురుషులున్నారని తెలిపారు. జనవరి నుంచి ఇప్పటివరకు మొత్తం 288 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు.

వాహనాలు తనిఖీచేస్తే కఠిన చర్యలు

» గోరక్షక్ బృందాలకు డీజీపీ జితేందర్ హెచ్చరిక


హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): గోరక్షక్ బృందాలకు వాహనాలు తనిఖీ చేసే అధికారం లేదని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. జంతువుల అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. జూన్ 7న బక్రీద్ పండుగ సందర్భంగా డీజీపీ శుక్రవారం కీలక ప్రకటన చేశారు. గతంలో గోరక్షక్ బృందాల వల్ల సామాజిక ఉద్రిక్తతలు ఏర్పడిన నేపథ్యంలో తెలంగాణ పోలీసు విభాగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనట్టు తెలిపారు. జంతువుల అక్రమ రవాణా అడ్డుకునేందుకు అంతర్‌రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేకంగా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద 24 గంటల తనిఖీలు కొనసాగుతాయని, ప్రతి చెక్‌పోస్టుకు పశువైద్యులను నియమించామని చెప్పారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

» సన్మానించిన ఎండీ సజ్జనార్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఆర్టీసీ సిబ్బంది నిజాయితీని నిరూపించుకున్నారు. బస్సుల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న రూ.19 లక్షల విలువైన వస్తువులతో కూడిన బ్యాగులను వారికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. మూడు వేర్వేరు ఘటనల్లో ప్రయాణికులు మర్చిపోయిన బ్యాగులను వారికి అందజేసిన సూర్యాపేట, మియాపూర్-2 డిపోలకు చెందిన సిబ్బంది కె.అంజయ్య, యాకుబ్ పాషా, ముబీన్, రమేశ్‌లను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించారు. శుక్రవారం బస్ భవన్‌లో వారిని ఉన్నతాధికారులతో కలిసి సన్మానించారు. ప్రయాణికులు పోగొట్టుకున్న బ్యాగులను తిరిగి వారికి అందజేయడం ఆర్టీసీ సిబ్బంది నిజాయితీకి నిదర్శనమన్నారు.

సీనియర్ జర్నలిస్టు రామకృష్ణ కన్నుమూత



హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు జాగర్లమూడి రామకృష్ణ (71) కన్నుమూశారు. అనారోగ్యంతో అస్వస్థతకు గురైన ఆయన్ను ఆస్పత్రిలో చేర్చగా.. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. నలభై ఏళ్లకు పైగా పాత్రికేయ రంగంలో సేవలందించిన రామకృష్ణ.. సిటీహెరాల్డ్ పత్రికలో ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఈనాడు, ఆంధ్రభూమి దిన పత్రికలతో పాటు మాటీవీ, జెమిని తదితర టెలివిజన్ చానెళ్లలోనూ పనిచేశారు. రామకృష్ణ మృతికి సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. రామకృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామకృష్ణ మరణం పత్రికా రంగానికి తీరని లోటని సీఎం పేర్కొన్నారు. రామకృష్ణ మరణం బాధాకరమని వయోధిక పాత్రికేయ సంఘం కార్యనిర్వాహకులు బండారు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, సినీ పాత్రికేయుడు వినాయకరావు తదితరులు విచారం వ్యక్తం చేశారు. రామకృష్ణ భౌతికకాయాన్ని అమీర్‌పేటలోని సారథి స్టూడియో దగ్గర అస్విన్ అపార్ట్‌మెంట్‌లో బంధుమిత్రుల సందర్శనార్థం ఉంచారు. శనివారం ఉదయం 11 గంటలకు సనత్‌నగర్ ఈఎస్ఐ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చావు అంచుల దాకా వెళ్లొచ్చారు!

కారు, డీసీఎంను ఢీకొన్న ఇనుప చువ్వల లారీ

50 అడుగుల లోతున ఉన్న నదిలోకి కారు, లారీ పల్టీ.. కారులోని కుటుంబం సురక్షితం

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇనుప చువ్వల లోడుతో వంతెనపై వెళుతున్న ఓ లారీ ఎదురుగా కొబ్బరి బొండాల లోడుతో వస్తున్న డీసీఎంను, ఆ తర్వాత ఓ కారును ఢీకొట్టింది. ఈక్రమంలో లారీ, కారు వంతెనపై నుంచి 50అడుగుల లోతులో ఉన్న నదిలోకి పల్టీ కొట్టగా.. డీసీఎం రోడ్డుపైనే నిలిచినా పూర్తిగా ధ్వంసమైంది. లారీలోని ఇనుప చువ్వలు పైన పడడంతో కారు నుజ్జునుజ్జు అయింది.. ఖమ్మం జిల్లా వైరాకు సమీపంలో జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న వైరా నది హైలెవల్ వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం తీరిది. ఈ ప్రమాదాన్ని, అక్కడి భయానక వాతావరణాన్ని చూసిన వారెవరైనా సరే.. ఆయా వాహనాల్లో ఉన్నవారు చావడం ఖాయమనే అనుకుంటారు. కానీ, అలా జరగలేదు.. చావు అంచుల దాకా వెళ్లిన ఆయా వాహనాల్లో ఉన్నవారంతా అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన మొగిలిశెట్టి రాజశేఖర్, గీత దంపతులు, పిల్లలు తేజస్, జ్యోతి, రాజశేఖర్ తండ్రి కోటేశ్వరరావు కలిసి కారులో ఏపీలోని కృష్ణా జిల్లా తిరువూరు నుంచి వైరా మండలం రెబ్బవరం బయలుదేరారు. అయితే, ఖమ్మం నుంచి తల్లాడ వైపు 20ఎంఎం ఇనుప చువ్వల లోడుతో వెళుతున్న ఓ లారీ.. ఎదురుగా వస్తున్న, కొబ్బరిబొండాల లోడుతో తల్లాడ వైపు వెళుతున్న డీసీఎంను ఢీకొట్టింది. అదే క్రమంలో రాజశేఖర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీ కొంది. డీసీఎం వ్యాను వంతెన రెయిలింగ్ తగిలి నిలిచిపోగా.. లారీ, కారు 50అడుగుల లోతులో ఉన్న వైరా నదిలో పల్టీ కొట్టాయి. వైరా నదిలో మునిసిపాలిటీ డంప్ చేసిన చెత్తపై కారు పడింది. లారీలోని ఇనుప చువ్వలు కారు మీద పడగా. ఆ బరువుకు చెత్తలో కూరుకుపోయింది.

ప్రమాదానికి కారణమైన లారీ



లోయలోపడ్డ కారు



కారులో ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో రాజశేఖర్ కుటుంబం సురక్షితంగా బయటపడింది. రాజశేఖర్ తండ్రికి తీవ్ర గాయాలవ్వగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్‌కు తీవ్రంగా గాయపడ్డాడు.

1770 వజ్రాల కిరీటం

(మొదటిపేజీ తరువాయి)



హైటెక్స్‌లో మిస్‌వరల్డ్-2025కి జరుగుతున్న ఏర్పాట్లు

నుంచి నలుగురు చొప్పున 16 మంది విజేతల పేర్లను ప్రకటించారు. అమెరికా-కరేబియన్ విభాగం నుంచి ట్రినిడాడ్-టొబాగో, మార్టినిక్, ప్యూర్టోరికో, డొమినికన్ రిపబ్లిక్ దేశాలవారు.. ఆఫ్రికా విభాగం నుంచి జాంబియా, నమీబియా, ఉగాండా, కామెరూన్‌వారు.. యూరప్ నుంచి ఎస్తోనియా, వేల్స్, ఐర్లాండ్, మోంటెనెగ్రోవారు.. ఏషియా-ఓషియానా నుంచి భారత ప్రతినిధి నందినీ గుప్తాతో పాటు తుర్కియే, థాయ్‌లాండ్, ఇండోనేషియా భామలు ఉన్నారు. మొత్తంగా తుది పోటీల్లో ఒక్కో విభాగం నుంచి 10మంది చొప్పున 40 మంది ఉంటారు. ఇప్పటికే ప్రకటించిన 16మంది పోగా.. మిగతా 24మంది వివరాలను శనివారం పోటీల ప్రారంభం ముందు ప్రకటిస్తారు. ఫ్యాషన్ షో, ఇతర పోటీల ఆధారంగా ఈ 40మంది నుంచి.. 20 మందిని ఎంపిక చేస్తారు. అంటే ఒక్కో విభాగం నుంచి సంఖ్య 5కు తగ్గుతుంది. తర్వాత ఒక్కో విభా గం నుంచి ఇద్దరు చొప్పున 8మందిని తుది పోటీకి ఎంపిక చేస్తారు. జ్యూరీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఇచ్చే సమాధానాల ఆధారంగా.. ఒక్కో విభాగం నుంచి ఒకరు ఎంపికవుతారు. వీరిలో ఒకరు ప్రపంచ సుందరిగా, మిగతా ముగ్గురు రన్నరప్‌లుగా నిలుస్తారు. గత మిస్‌వరల్డ్ విజేత చెక్ రిపబ్లిక్ సుందరి క్రిస్టినా ఈసారి విజేతకు వజ్రాల కిరీటం పెడతారు.

నలుగురు న్యాయనిర్ణేతలు..

తుది పోటీలకు నలుగురు న్యాయనిర్ణేతల పేర్లను నిర్వహక సంస్థ శుక్రవారం ప్రకటించింది. వీరిలో నటుడు సోనూ సూద్, మేఘా ఇంజనీరింగ్ డైరెక్టర్ సుధారెడ్డి, మిస్ ఇంగ్లండ్-2014 విజేత కెరీనా టురెల్, మిస్ వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లీ ఉన్నారు. విజేత పేరును జూలియా మోర్లీ ప్రకటిస్తారు. తుదిపోటీలకు మిస్ వరల్డ్-2016 విజేత స్టిఫానీ డెల్‌వ్యాలీ, సచిన్ కుంభర్ వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ నటులు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ తమ నృత్యంతో అలరించనున్నారు. తుది పోటీలు సాయంత్రం 5-30 గంటలకు ప్రారంభమై రాత్రి 9-30కు ముగుస్తాయి.


భారత్ గెలిస్తే రికార్డు..

ఈసారి పోటీల్లో భారత సుందరి నందిని గుప్తా గెలిస్తే.. ఎక్కువ సార్లు మిస్ వరల్డ్ గెలుచుకున్న దేశంగా భారత్ రికార్డు సాధిస్తుంది. 1951 నుంచి ప్రపంచ సుందరి పోటీలు జరుగుతుండగా.. భారత్, వెనెజువెలా 6సార్లు చొప్పున కిరీటం గెలుచుకున్నాయి. మన దేశం నుంచి తొలిసారి 1966లో రీటా ఫారియా ప్రపంచ సుందరి కిరీటం గెలిచారు. 1994లో ఐశ్వర్యారాయ్, 1997లో డయా నా హెడెన్, 1999లో యుక్తాముఖి, 2000లో ప్రియాంక చోప్రా, 2017లో మానుషి చిల్లర్ విజేతలుగా నిలిచారు. ఈసారి గెలిస్తే ఏడోసారి కిరీటం భారత్ సొంతమవుతుంది. అయితే ఇప్పటివరకు జరిగిన పోటీలో నందినీ గుప్తా.. ఏషియా-ఓషియానా విభాగంలో తుర్కియే, థాయ్‌లాండ్, ఇండోనేషియా భామల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. ఇక ఇప్పటివరకు యూకే 5 సార్లు, జమైకా 4, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, ఐస్‌లాండ్, స్వీడన్ 3సార్లు మిస్ వరల్డ్ గెలుచుకున్నాయి.

అందరి చూపు.. హైదరాబాద్ వైపు..

ఈనెల 10న గచ్చిబౌలిలో జరిగిన మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు 120కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారంకాగా.. శనివారం జరిగే తుది పోటీలు 150కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. భారత్‌లో సోనిలివ్ చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. www.watchmissworld.coవెబ్‌సైట్ ద్వారా వీక్షించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 కోట్ల మంది మిస్ వరల్డ్ ప్రత్యక్ష ప్రసారాలు వీక్షిస్తారని అంచనా. తుది పోటీల కోసం హైటెక్స్‌లో 4వేల మందికి సరిపడా ఏర్పాట్లుచేశారు. సీఎం, మంత్రులు కుటుంబ సభ్యులతో హాజరుకానున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానాలు వెళ్లాయి.

మిస్ వరల్డ్ బ్రాండ్ అంబాసిడర్‌గా సుధారెడ్డి



మేఘా ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్ సుధారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఆమె మిస్ వరల్డ్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ చైర్ పర్సన్ జూలియా మోర్లీ శుక్రవారం ప్రకటించారు. మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న 108మంది అందాల భామలకు సుధారెడ్డి తన నివాసంలో 'బ్యూటీ విత్ ఏ పర్పస్ గాలా'విందు ఇచ్చారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, మహిళా సాధికారత కోసం సుధారెడ్డి తన పేరిట ఓ ఫౌండేషన్ స్థాపించి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలా సామాజిక సేవలో నిమగ్నమైన సుధారెడ్డిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకోవడం సంతోషంగా ఉందని జూలియా మోర్లీ ప్రకటించారు. ఈనియామకం తన సేవాబాధ్యతను పెంచిందని సుధారెడ్డి అన్నారు.

మిస్ వరల్డ్ పోటీలు, కార్యక్రమాలు ఇలా..

మే-3 నుంచి 8 వరకు వివిధ దేశాల ప్రతినిధుల ఆగమనం. శంషాబాద్ ఎయిర్ పోర్టులో వారికి తెలంగాణ సంప్రదాయ రీతిలో ఆహ్వానం

మే-10: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభోత్సవం. 108దేశాల అభ్యర్థుల పరిచయం

మే-12: నాగార్జునసాగర్ బుద్ధవనం సందర్శన

మే-13: చార్మినార్ సందర్శన, హెరిటేజ్ వాక్, లాడ్ బజార్ షాపింగ్, చౌమొహల్లా ప్యాలెస్‌లోవిందు

మే-14: వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, రామప్ప సందర్శన

మే-15: యాదగిరిగుట్టలో దర్శనం, చేనేత గ్రామం పోచంపల్లి సందర్శన

మే-16: హెల్త్ టూరిజంలో భాగంగా ఏఐజీ ఆసుపత్రి సందర్శన, పిల్లలమర్రి, ఎక్స్‌పీరియం ఎకో పార్క్ సందర్శన

మే-17: గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ ఫినాలే. రామోజీ ఫిల్మ్ సిటీ పర్యటన

మే-18: భద్రతపై కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం సందర్శన

మే-21: శిల్పారామం, విక్టోరియా హోమ్ సందర్శన

మే-22: శిల్పకళా వేదికలో టాలెంట్ ఫినాలే

మే-23: టి-హబ్‌లో హెడ్ టు హెడ్ చాలెంజ్ ఫైనల్

మే-24: మిస్ వరల్డ్ టాప్ మోడల్, ఫ్యాషన్ షో పోటీ

మే-26: బ్యూటీ విత్ పర్పస్, గాలా డిన్నర్

మే-27 నుంచి 30: ఫైనల్స్ కోసం రిహార్సల్స్

మే-31: మిస్ వరల్డ్ 2025 ఎంపిక

జూన్-2: రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ

దాబా హోటల్లో మత్తు!

హైదరాబాద్ సిటీ, షాద్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్ ప్లాజా దగ్గర ఉన్న సంజుభాయ్ మార్వాడి దాబాలో ఏళ్లుగా కొనసాగిస్తున్న డ్రగ్స్ దందా గుట్టు రట్టయింది. కేసు వివరాలను శుక్రవారం సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన వికాస్ సోహూ(26) సంజుభాయ్ దాబాలో 2019లో వంట మనిషిగా పనికి కుదిరాడు. యజమాని సంజూ భాయ్‌కి గంజాయి పీల్చే అలవాటు ఉంది. ధూల్‌పేటకు చెందిన సలీం నుంచి కొనేవాడు. దాబాకు వచ్చిన కస్టమర్లలో ఎవరైనా అడిగితే ఎక్కువ ధరకు విక్రయించేవాడు. యజమానిదన్ను చూసుకొని వికాస్ కూడా గంజాయి అమ్మేవాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన గణపత్ అనే వ్యక్తి.. సంజుభాయ్, వికాస్‌కు హెరాయిన్, ఓపీఎం, పాపీ స్ట్రాలను సరఫరా చేసేవాడు. కాగా 2022లో జడ్చర్ల బస్టాండ్ సమీపంలో సంజుభాయ్, వికాస్ గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. జైలుకెళ్లొచ్చాక మళ్లీ గంజాయిని విక్రయిస్తున్నారు. వీరికి గంజాయిని జల్‌పల్లి ప్రాంతానికి చెందిన రాజు సరఫరా చేసేవాడు. గత ఏప్రిల్ 25వ సంజుభాయ్ అనారోగ్యంతో చనిపోయాడు. ఆ తర్వాత దాబాను పూర్తిగా అధీనంలోకి తెచ్చుకున్న వికాస్ ఒక్కడే గంజాయి, డ్రగ్స్‌ను విక్రయించేవాడు. వారం కిత్రం వికాస్ 1.5 కిలోల హెరాయిన్‌ను, 750 గ్రాముల ఓపీఎంను 3.5 కిలోల పాపీ స్ట్రాను గణపత్ నుంచి కొనుగోలు చేయగా.. రాజు నుంచి 1.5 కిలోల గంజాయిని కొని విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో ఎస్‌వోటీ శంషాబాద్ బృందం, షాద్‌నగర్ పోలీసులు దాబాపై దాడి చేశారు. 1.5 కేజీల హెరాయిన్‌తో పాటు, కిలో ఎండు గంజాయి, 632గ్రాముల ఓపీఎం, పాపీ స్ట్రా 2.80 కేజీల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. వికాస్‌ను షాద్‌నగర్‌లో.. గణపత్, సలీం, రాజులను హైదరాబాద్‌లో అరెస్టు చేశారు.

అధిక వడ్డీ ఆశ చూపి.. రూ.150 కోట్లకు టోపీ

(మొదటిపేజీ తరువాయి)

ఎల్‌బీ నగర్, అత్తాపూర్‌లలోనూ కార్యాలయాలు పెట్టారు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే 16 నెలల్లో రూ.2 లక్షలు ఇస్తామని ఆశ చూపారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలవారు అధిక వడ్డీ ఆశతో డబ్బులు డిపాజిట్ చేశారు. రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు కట్టారు. వారిలో కొందరికి సంస్థ నిర్వాహకులు అధిక వడ్డీ చెల్లించారు. ఇది చూసి కొందరు తమ బంధువులను, స్నేహితులను ఈ సంస్థలో చేర్పించి, డబ్బులు కట్టించారు. 16 నెలల గడువు పూర్తయినవారు రెండు నెలలుగా డబ్బుల కోసం కార్యాలయానికి వస్తున్నారు. నిర్వాహకులు ఏదో ఓ కారణం చెబుతూ వారిని కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. 30న(శుక్రవారం) డబ్బులు ఇస్తామని కొందరికి చెప్పడంతో.. సుమారు 100 మంది వరకు వచ్చారు. కానీ కార్యాలయం మూసివేయడంతో మోసపోయామని గుర్తించి, పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు నిర్వాహకురాలు స్వాతిని అదుపులోకి తీసుకున్నారు. బాలాజీ పరారీలో ఉన్నాడు.

వాణిజ్య పన్నుల స్కామ్‌లో సీఐడీ దూకుడు

» యాప్స్, మాడ్యూల్స్ తయారీలో రిసోర్స్ పర్సన్లుగా ఉన్న అధికారులపై దృష్టి

» 30 మందికి విచారణ కోసం పిలుపు

» 29, 30 తేదీల్లో 20 మంది విచారణ

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల కుంభకోణం కేసులో సీఐడీ దూకుడు పెంచింది. కొన్నిరోజుల నుంచి స్తబ్దుగా ఉన్న ఈ కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. వాణిజ్య పన్నుల శాఖ యాప్స్, మాడ్యూల్స్ తయారీ ప్రక్రియలో రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన 30 మంది అధికారులపై సీఐడీ విచారణ చేపట్టింది. ఇప్పటికే 20 మంది అధికారులను పిలిచి ప్రశ్నించగా.. శనివారం మరో 10 మందిని విచారించనుంది. ఈకేసులో అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ నిందితుడిగా ఉన్న నేపథ్యంలో సీఐడీ విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది.

రూ.1,400 కోట్ల కుంభకోణం!

కొందరు డీలర్లు ఎలాంటి వస్తువులు విక్రయించకపోయినా, అమ్మినట్టుగా నకిలీ బిల్లులు (ట్యాక్స్ ఇన్వాయిస్) సృష్టించి.. ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందినట్టు రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనరేట్ గుర్తించిన సంగతి తెలిసిందే. మరో వ్యవహారంలో ఎలక్ట్రిక్ బైక్‌లను తయారు చేయకపోయినా... తయారు చేసి, అమ్మినట్టు రిటర్నులు దాఖలు చేసి భారీగా ఐటీసీ పొందారు. ఇలా జీఎస్టీలో వివిధ మోసాలకు సంబంధించి రూ.1,400 కోట్లకుపైగా కుంభకోణం జరిగినట్టు అప్పట్లో ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. మరోవైపు పన్నుల ఎగవేత, తక్కువ పన్ను చెల్లింపు, దొంగ ఇన్వాయిస్‌లతో ఐటీసీ కొల్లగొట్టడం తదితర అక్రమాలను తేల్చడానికి ప్రభుత్వం అప్పటి వాణిజ్య పన్నుల రాష్ట్ర కమిషనర్ టీకే శ్రీదేవి ఆధ్వర్యంలో కమిటీ వేసింది. మోసాలకు పాల్పడిన 75 కంపెనీల్లో ఇప్పటివరకు 40 కంపెనీల వివరాలను ఆ కమిటీ సేకరించినట్టు తెలిసింది.

అక్రమాలు దొరక్కుండా 'మాస్క్'..

ఒక రాష్ట్రంలోని డీలర్లు, మరో రాష్ట్రంలోని డీలర్లకు విక్రయించే వస్తువులపై ఐజీఎస్టీ వసూలు చేస్తారు. ఇందులో కేంద్రానికి, వస్తువులను కొనుగోలు చేసిన రాష్ట్రానికి చెరో 50శాతం సొమ్ము వెళుతుంది. దీనినీ అక్రమాలకు వాడుకున్నారు. రాష్ట్రంలోని కొందరు డీలర్లు.. ఇతర రాష్ట్రాల డీలర్లకు ఇనుము, ఇత్తడి, రాగి స్క్రాప్ వంటివి విక్రయించినట్లు నకిలీ ట్యాక్స్ ఇన్వాయిస్‌లను సృష్టించారు. ఈ ఇన్వాయిస్‌ల ఆధారంగా ఆయా రాష్ట్రాల డీలర్లు అక్కడి ప్రభుత్వం నుంచి 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్' పొందారు. ఈ సొమ్మును ఇక్కడి, అక్కడి డీలర్లు కలిసి పంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. నిజానికి జీఎస్టీ ఎగవేతలు, ఐటీసీ క్లెయిమ్‌లు, బకాయిలను గుర్తించడానికి ఐఐటీ-హైదరాబాద్‌తో ఒక సాఫ్ట్‌వేర్‌ను వాణిజ్య పన్నుల శాఖ అభివృద్ధి చేయించింది. అధికారులు ఇందులో ఐజీఎస్టీ ఎగవేతలు, ఐటీసీ క్లెయిమ్‌లను గుర్తించే స్క్రూటినీ మాడ్యూల్ కనిపించకుండా(మాస్క్) చేసినట్టు బయటపడింది. అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ 'స్పెషల్ ఇనీషియేటివ్స్' వాట్సాప్ గ్రూపు ద్వారా ఇచ్చిన సందేశాల మేరకు.. అప్పటి వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరాంప్రసాద్, ఐఐటీ-హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు కలసి ఆ మాడ్యూల్ పనిచేయకుండా చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ నలుగురితోపాటు సాఫ్ట్‌వేర్‌కు సాంకేతిక సహకారం అందించిన ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థపై కేసు నమోదు చేశారు.

తాజాగా 30 మందిని విచారిస్తున్న సీఐడీ

ఐజీఎస్టీ, ఇతర పన్ను ఎగవేతల నిరోధానికి అవసరమైన యాప్స్, మాడ్యూల్స్‌ను ఐఐటీహెచ్‌తో అభివృద్ధి చేయించడంలో.. వాణిజ్య పన్నుల శాఖ తరఫున కొందరు అధికారులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. వారిని కూడా ప్రశ్నిస్తే మరిన్ని అంశాలు బయటికి వస్తాయని భావించిన సీఐడీ అధికారులు.. తాజాగా 30మందిని విచారణకు పిలిచారు. అందులో పది మంది జాయింట్ కమిషనర్లు, 8 మంది డిప్యూటీ కమిషనర్లు, ఐదుగురు అసిస్టెంట్ కమిషనర్లు, నలుగురు స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్లు, ముగ్గురు డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్లు ఉన్నారు. ఈ 30 మందిలో ఈ నెల 29న 10మందిని, 30న మరో 10 మందిని సీఐడీ అధికారులు విచారించారు. 31న (శనివారం) మిగతా వారిని విచారించనున్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్య

» తన చావుకు కాంగ్రెస్ నాయకులే కారణమని అరచేతిపై రాతలు

» రంగారెడ్డి జిల్లాలో ఘటన



అశోక్(ఫైల్)

యాచారం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందిరమ్మ ఇల్లు, కాంగ్రెస్ నాయకులు, తన బావ బండ యాదయ్య.. తన చావుకు కారణమంటూ అరచేతిపై రాసుకుని మరీ ఉరి వేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్లకు చెందిన దొడ్డి అశోక్(45)కు భార్య రజని, కుమార్తెలు లహరి, నిఖిత, సుష్మాస్వరాజ్ ఉన్నారు. వీరంతా గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అశోక్, రజని కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అశోక్ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా.. స్థలం కూడా లేకపోవడంతో ఇల్లు మంజూరు కాలేదు. నిరుపేద కుటుంబమైన తమకు ఇల్లు కేటాయించాలని నాయకులు, అధికారులను కలిసి విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అశోక్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు.. అశోక్ మృతదేహాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకెళ్లి ధర్నా చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన తీవ్రమై పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు, తహసీల్దారు అయ్యప్ప, ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. విషయాన్ని ఆర్డీవో అనంతరెడ్డికి ఫోన్‌లో వివరించారు. బాధిత కుటుంబానికి 120 గజాల ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకుంటామని తహసీల్దారు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

» ఏన్కూర్‌లో 544 కిలోల విత్తనాల సీజ్

» 11మందిపై కేసు.. 9 మంది అరెస్ట్: ఖమ్మం ఎస్పీ

ఖమ్మం/ ఏన్కూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో నకిలీ నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు రోజులుగా ఖమ్మం జిల్లాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన తనిఖీల్లో ఏన్కూర్ మండల పరిధిలో రూ.15 లక్షల విలువైన 564 కిలోల పత్తి విత్తనాలు జప్తు చేశారు. మధిర మండలంలో శుక్రవారం నకిలీ విత్తనాలు లభ్యమయ్యాయి. ఏన్కూర్ మండల పరిధిలో జరిపిన తనిఖీల్లో 11 మందిపై కేసు నమోదు చేయగా, తొమ్మిది మందిని అరెస్ట్ చేశామని ఖమ్మం జిల్లా పోలీసు కమిషనర్ (సీపీ) సునీల్ దత్ చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వివరించారు. ఏన్కూర్ మండలం రేపల్లెవాడ గ్రామ శివారుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న సమాచారంతో మూడు టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపట్టిన తనిఖీల్లో.. వెనిగండ్ల శ్రీహరిరావు వ్యవసాయ భూమిలో 210 కిలోల విత్తనాలు, ఉమ్మినేని నరేష్ ఇంట్లో 120 కిలోలు, ఇదే మండలానికి చెందిన పోలేటి కోటేశ్వరరావు వద్ద 20 నకిలీ విత్తన ప్యాకెట్లు, గాజుల నరసింహారావు వద్ద 450 గ్రాముల విత్తనాలు స్వాధీనం చేసుకున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.